Crime News
# ది క్రైమ్ న్యూస్
తెలుగు దినపత్రిక

గురువారం, మార్చి 26, 2026 | సంపుటి - 20 | సంచిక 194 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## రాష్ట్రంలో పెట్రోల్ కొరత లేదు

### డీలర్లు స్వయంగా ప్రకటన చేశారు
### కొందరు కావాలనే పుకార్ల వ్యాప్తి
### కేంద్రమంత్రి బండి సంజయ్ వెల్లడి



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో పెట్రోలు, డీజిల్ కొరత ఉందంటూ సోషల్ మీడియాలో వస్తున్న వదంతులు నమ్మొద్దని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆయిల్ సంస్థల వద్ద సరిపడా పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయంటూ.. తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు.

తరువాయి 2లో



## కాంగ్రెస్‌పార్టీవి డైవర్షన్ పాలిటిక్స్

**ఫార్ములా రేస్ కేసు పెట్టిందే అందుకు**

**పునరుద్ఘాటించిన బిఆర్ఎస్ నేత కెటిఆర్**

హైదరాబాద్ : ఫార్ములా ఈ రేసు కేసు పేరిట రాష్ట్ర ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్ చేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు.

2

## సిరిసిల్ల నేతన్నలను కాపాడండి

**విద్యుత్ బాకాయిలు మాఫీ చేయండి**

**డిప్యూటి సిఎం భట్టికి కెటిఆర్ వినతి**

## కాంగ్రెస్ పార్టీకి జీవన్ రెడ్డి
# గుడ్ బై



కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయడానికే మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తోంది. ఆయన తన నిర్ణయాన్ని మార్చుకోవడానికి సిద్దంగా లేరు. ఈ క్రమంలో రాజీనామాపై మరోసారి స్పందించారు. రాజీనామా చేయడానికి గల కారణాలను వివరించారు.

### నాలుగు పేజీల రాజీనామా లేఖ విడుదల

- పదేళ్లుగా అవమానాలు భరించాక కూడా...పట్టించుకోరా
- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిందన్న భావనే లేదు
- ఇక రేవంత్ రెడ్డి పైనే తన పోరాటం అన్న జీవన్ రెడ్డి

జగిత్యాల : కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ విధానాలకు విరుద్ధంగా తెలంగాణ కాంగ్రెస్ నడుస్తోందని జీవన్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్న సంతోషం లేకుండా చేశారని మండిపడ్డారు. 20 నెలలుగా పార్టీలో మానసిక వేదనకు గురైనట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. నాలుగు పేజీల రాజీనామా లేఖను కార్యకర్తల సమావేశంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి మీద పోరాటం చేస్తానంటూ శపథం చేశారు. తనను నమ్ముకున్న అనుచరులకి పదవులు రాకపోతే పార్టీలో కొనసాగడం అవసరమా అని ప్రశ్నించారు.

తరువాయి 2లో

## ఇరాన్‌పై యుద్ధం గెలిచాం




- ఇరాన్‌ను సైనికంగా అంతమొందించాం
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన
- యుద్ధం ముగింపు కోసం యత్నాలు
- ఇరాన్‌కు 15 డిమాండ్ ముందు పెట్టిన ట్రంప్
- 450 కిలోల యురేనియం అప్పగింత ముఖ్యం


వాషింగ్టన్ : ఇరాన్‌తో జరుగుతున్న యుద్ధంలో తాము గెలిచామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రటించుకున్నారు. ఈ పోరులో ఇరాన్‌ను సైనికపరంగా అంతమొందించామని ఆయన అన్నారు. ఆ దేశం ఇకపై ఎప్పటికీ అణ్వాయుధాలను అభివృద్ధి చేయకూడదనేదే 2లో

## పేదలకు ఇందిరమ్మ ఇళ్లు
# అందిస్తాం

- అసంపూర్తిగా ఉన్నవాటిని పూర్తి చేస్తాం
- స్వాధీనం చేసుకోని ఇళ్లకు కొత్తవారికి కేటాయిస్తాం
- ఇందిరమ్మ ఇళ్లపై అసెంబ్లీలో చర్చలో మంత్రి పొంగులేటి



హైదరాబాద్ : గత ప్రభుత్వాలు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై సమీక్షించి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయడమే ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం 'ఇందిరమ్మ ఇల్లు' పథకం ద్వారా భారీ స్థాయిలో ఇళ్ల నిర్మాణం చేపట్టిందని మంత్రి గుర్తుచేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో 21 లక్షల ఇళ్లు నిర్మించారని తెలిపారు. 2లో




## దేశంలో పెట్రోల్, డీజిల్ కొరత లేదు

- ఇంధన ధరల్లో కూడా మార్పులు లేవు
- దేశవ్యాప్తంగా పైపులైన్ల విస్తరణ, నేచురల్ గ్యాస్ సరఫరా
- బ్లాక్ మార్కెటింగ్‌పై దాడులు కొనసాగిస్తున్నాం
- పైప్డ్ గ్యాస్ అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో దానికే ప్రాధాన్యం
- ఆందోళనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ మరోమారు ప్రకటన

న్యూఢిల్లీ : పైపులతో నేచురల్ గ్యాస్‌కు తాము ప్రాధాన్యం ఇస్తున్నామని, పెట్రోల్, డీజిల్‌కు దేశంలో ఎలాంటి కొరత లేదని, ఇంధనం ధరల్లో కూడా మార్పు లేదని పెట్రోలియం మంత్రిత్వ శాఖ బుధవారంనాడు ప్రకటించింది.

## పెద్ద ఎత్తున గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి

**సోలార్ పవర్‌పై డిప్యూటీ సీఎం భట్టి**



హైదరాబాద్ : గ్రీన్ ఎనర్జీని రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయాలన్న ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ప్రతి మండలంలో 2లో



## అరటి రైతులను ఆదుకోండి

- గిట్టుబాటు ధరలు కల్పించండి
- అరటి గెలలను వేసుకుని రైతులతో ర్యాలీ
- కడప కలెక్టరేట్ వద్ద ధర్నాకు యత్నం
- వైఎస్ షర్మిల డిమాండ్

కడప : అరటి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని వైఎస్ షర్మిల కోరారు. కోల్డ్ స్టోరేజీ సౌకర్యాల విషయంలో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నానని తెలిపారు.

తరువాయి 2లో



## ఐదు టవర్లుగా సెక్రెటేరియట్
# ఐకానిక్ టవర్

**వేగంగా ఐదు టవర్ల నిర్మాణం పనులు**

**పనులను పరిశీలించిన మంత్రి నారాయణ**

అమరావతి : రాజధాని అమరావతిలో రాష్ట్ర స్థాయి అధికారులంతా ఒకేచోట ఉండేలా సెక్రటేరియట్‌కు ఐకానిక్ టవర్లు డిజైన్ చేశామని మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ వెల్లడించారు. ఈ ఐదు టవర్ల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఆయన వివరించారు. అత్యాధునిక డయాగ్రిడ్ టెక్నాలజీతో వీటి నిర్మాణం జరుగుతోందన్నారు. బుధవారం రాజధానిలో నిర్మిస్తున్న హెచ్ఓడీ టవర్ -3 కార్నర్ నోడ్ అమర్చే పనులకు మంత్రి నారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఏడాది వర్షాలు కురవడంతో 4 నెలల పాటు ఈ పనులకు ఆటంకం కలిగిందని పేర్కొన్నారు. ఐకానిక్ భవనాలు, ప్రజాప్రతి నిధులు, అధికారుల నివాసాలు, మౌలిక వసతుల పనులు వేగంగా జరుగుతున్నా యని మంత్రి నారాయణ వివరించారు. 2లో

## విద్యార్థులు వినూత్నంగా
# ఆలోచించాలి

- భవిష్యత్‌పై స్పష్టత ఉండాల్సిందే
- యువత స్వశక్తితో ఎదగడానికి ప్రయత్నించాలి
- కుప్పం జాబ్ మేళాలో నారా భువనేశ్వరి



చిత్తూరు : విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలని, భవిష్యత్తుపై స్పష్టత ఉండాలని సీఎం చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి సూచించారు. యువత స్వశక్తితో ఎదగాలన్న ఆమె.. కష్టాన్ని నమ్ముకోవాలని, తద్వారా ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని చెప్పారు. కుప్పం నియోజకవర్గంలోని ఓ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన జాబ్‌మేళాలో సీఎం చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి పాల్గొన్నారు. యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు జాబ్‌మేళా నిర్వహించడం అభినందనీయమని తరువాయి 2లో

## ఇరాన్‌పై యుద్ధం గెలిచాం

తమ మొదటి షరతు అని.. దానికి ఇరాన్ అంగీకరించిందని కూడా ట్రంప్ పేర్కొన్నారు. 'ఇరాన్‌తో ప్రస్తుతం చర్చలు కొనసాగుతున్నాయి. అమెరికాతో ఒప్పందం కుదుర్చుకునేందుకు ఆ దేశం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఇప్పటికే వారి నౌకాదళం, వైమానిక దళం పూర్తిగా ధ్వంసమవడం సహా రాడార్ వ్యవస్థలు కూడా దెబ్బతిన్నాయి. అమెరికా విమానాలు టెహ్రాన్ మీదుగా చక్కర్లు కొడుతున్నాయి. ఒకవేళ చర్చలు విఫలమైతే.. అమెరికా ఏదైనా చేయగలదు' అని ట్రంప్ చెప్పారు. మరోవైపు ఇరాన్.. అమెరికాకు హార్ముజ్ జలసంధికి సంబంధించి ఓ పెద్ద గిఫ్ట్ ఇచ్చిందని ట్రంప్ తెలిపారు. అయితే.. ఆ బహుమతి ఏంటనే వివరాలు మాత్రం ఆయన వెల్లడించలేదు. అది చాలా విలువైన గిఫ్ట్ అని చెప్పుకొచ్చారు. అయితే.. ట్రంప్ వ్యాఖ్యలను పూర్తిగా తోసిపుచ్చింది ఇరాన్. అమెరికాతో ఇప్పటివరకు ఎలాంటి ప్రత్యక్ష చర్చలు జరగలేదని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇదిలా ఉండగా.. పాకిస్థాన్, ఈజిప్ట్, టర్కీ వంటి దేశాలతో కలిసి ఇరాన్.. అమెరికాతో మధ్య మధ్యవర్తిత్వం వహించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు పాక్ సైన్యాధిపతి ఆసిమ్ మునీర్ ఇటీవల అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్‌తో మాట్లాడినట్లు పాక్ మీడియా సంస్థలు వెల్లడించినట్లు సమాచారం. మరోవైపు.. సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్.. ఇరాన్‌పై దాడులను కొనసాగించాలని ట్రంప్‌ను కోరినట్లు న్యూయార్క్ టైమ్స్ తన కథనంలో రాసుకొచ్చింది. యుద్ధానికి ట్రంప్ 5 రోజుల విరామం ప్రకటించినప్పటికీ.. గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు కొనసాగుతున్నాయి. సౌదీ అరేబియా బాలిస్టిక్ క్షిపణి ఇరాన్‌కు చెందిన 6 డ్రోన్‌లను కూల్చివేసింది. తూర్పు ప్రావిన్సులో తమ వాయు రక్షణ వ్యవస్థ ఒక బాలిస్టిక్ క్షిపణిని అడ్డుకుని ధ్వంసం చేసిందని సౌదీ రక్షణ శాఖ తెలిపింది. ఆ వివరాల ప్రకారం.. అదే ప్రాంతంలో కనీసం 6 డ్రోన్‌లను కూల్చివేసినట్లు సమాచారం. ఇజ్రాయెల్, కువైట్ దేశాలపైనా ఇరాన్ డ్రోన్ల దాడి కొనసాగిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాల ద్వారా తెలుస్తోంది.

## రాష్ట్రంలో పెట్రోల్ కొరత లేదు

పెట్రోలు, డీజిల్ కొరత రాకుండా ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందని తెలిపారు. కృత్రిమ కొరత సృష్టిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేయాలని కొన్ని శక్తులు కుట్ర చేస్తున్నాయని, ఆ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. వాహనదారులు రోజువారీ అవసరాల మేరకు.. పెట్రోలు, డీజిల్‌ను కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఉదయం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో వస్తున్న పుకార్లపై ఆయన స్పందిస్తూ.. 'అమెరికా, ఇజ్రాయిల్ ? ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా పెట్రోలు, డీజిల్ కొరత ఏర్పడిందంటూ సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న ప్రచారంలో ఏ మాత్రం నిజం లేదు. ఇండియన్ ఆయిల్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ వంటి అన్ని పబ్లిక్ సెక్టార్ ఆయిల్ కంపెనీల వద్ద అవసరమైనంత స్టాక్ అందుబాటులో ఉంది. పెట్రోలు, డీజిల్ సరఫరాలోనూ లోపం లేదు. రాష్ట్ర అవసరాలకు సరిపడా పెట్రోలు, డీజిల్ సరఫరా నిరాటంకంగా కొనసాగుతోంది. ఇదే విషయాన్ని తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ కూడా స్పష్టం చేసింది. సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని నమ్మి చాలా మంది పెట్రోలు బంకుల వద్దకు పరుగులు తీస్తూ అవసరానికి మించి కొనుగోలు చేస్తున్నారు. దీనివల్ల ఒక్కసారిగా డిమాండ్ పెరగడంతో కొన్ని పెట్రోలు బంకుల్లో తాత్కాలికంగా కొరత ఏర్పడుతోంది. ఇదే అదనుగా కొంతమంది కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్ దందాకు పాల్పడే ప్రమాదం ఉంది. ఎట్టి పరిస్థితుల్లోనూ వదంతులను నమ్మొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా' అని అన్నారు.

## విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలి

ఈ సందర్భంగా ఆమె అన్నారు. 'నాడు విజన్ 2020.. నేడు విజన్ 2047. ఈ లక్ష్యంతో సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారు. ఒక నాయకుడిని నమ్మి ఓటేస్తే ఏం జరిగిందో గత ఐదేళ్లలో మనం చూశాం. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట తప్పరు. ఓట్ల కోసం హామీలు ఇవ్వరు. ప్రజల కోసం నిలబడతారు. నేను ఏమి చేయగలనో అదే హామీ ఇస్తానని చంద్రబాబు నాతో ఎప్పుడూ చెబుతూ ఉంటారు. ప్రజలకు ఇచ్చినమాట ప్రకారం రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు తీసుకొస్తున్నారు. 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నారు' అని భువనేశ్వరి పేర్కొన్నారు. ఇక తాను గృహిణిగా ఉంటూనే 'హెరిటేజ్' బాధ్యతలను సవాల్‌గా స్వీకరించానని భువనేశ్వరి చెప్పుకొచ్చారు. 'జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కోవాలి. ప్రతిదానికీ ఆందోళన చెంది ఆత్మస్థైర్యం కోల్పోకూడదు. కష్టపడి పనిచేస్తే ఎన్నో అవకాశాలు వస్తాయి. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లలను చదివిస్తారు. మంచి ప్రయోజకులు కావాలని, భవిష్యత్తు బాగుండాలని తాపత్రయపడతారు. పిల్లలు జీవితంలో ఉన్నతంగా స్థిరపడితే ముందుగా సంతోషించేది తల్లిదండ్రులే. చంద్రబాబు రాజకీయాల్లో బిజీగా ఉండటంతో నా కుమారుడు లోకేశ్ పెంపకం, చదువు బాధ్యతలు నేనే చూసుకున్నాను. ఏది మంచి, ఏది చెడు అనేది చెప్పి పెంచాను' అని సీఎం సతీమణి తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు.

## అరటి రైతులను ఆదుకోండి

ఎన్నికల ముందు ప్రచారం కోసం మాత్రమే పులివెందులలో అరటి ప్రాసెసింగ్ యూనిట్‌ను జగన్ ప్రారంభించారని విమర్శలు చేశారు. అరటి రైతుల సమస్యలపై కూడా షర్మిల స్పందించారు. పంట నష్టపోయిన అరటి రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి డిమాండ్ చేశారు.బుధవారం కడపకు వచ్చిన వైఎస్ షర్మిల రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి వ్యానులో అరటి గెలలు వేసుకొని ర్యాలీగా కడప కలెక్టరేట్ కు చేరుకున్నారు. పంట నష్టపోయిన అరటి రైతులను తక్షణం ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ జిల్లా జాయింట్ కలెక్టర్ నిధి మీనాకు వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైఎస్ షర్మిల రెడ్డి మాట్లాడారు. నిన్న పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురం మండలంలోని కసునూరు గ్రామంలో వడగండ్ల వర్షానికి దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలించి, రైతులతో మాట్లాడి వారి కష్టాలను అడిగి తెలుసుకున్నానన్నారు. రైతులు తమ దఃఖిన్ని తెలిపిన సమస్యలను జిల్లా జాయింట్ కలెక్టర్ వివరించడం జరిగిందన్నారు. అకాల వర్షానికి అరటి తోటలు పూర్తిగా దెబ్బతిని రైతులు పూర్తిగా నష్టపోయారన్నారు. మన రాష్ట్రంలో అరటి 70 నుంచి 80 లక్షల వరకు పండిస్తున్నారని తెలిపారు. 58 శాతం రాయలసీమ నుండి అరటి పండుతోందని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర లేక కొట్టుమిట్టాడుతున్నారన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. టన్ను 26 వేల రూపాయలు పలికిన అరటి ఈరోజు 6 వేల రూపాయలు కన్నా తక్కువగా పడిపోయిందన్నారు. దేశంలోనే మన రాష్ట్రంలో బెస్ట్ క్వాలిటీ అరటి పంట సాగు అవుతుందని, ఇతర దేశాలకు ఎక్స్‌పోర్ట్ చేసుకుంటున్నారన్న నమ్మకంతో రైతులు అరటి పంటను పండించారన్నారు. ప్రస్తుతం రేటు పడిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు వాపోతున్నారన్నారు. రైతులు పండించిన పంటను గిట్టుబాటు ధర వచ్చేంతవరకు నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజీలు లేక ప్రాసెసింగ్ ఎ÷-లాంట్ లు లేక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కోల్డ్ స్టోరేజీలు, ప్రాసెసింగ్ ఎ÷-లాంట్లు ఏర్పాటు చేయడంతోపాటు మార్కెటింగ్ సపోర్ట్ కల్పించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అరటికి కనీస గిట్టుబాటు ధర 12 వేల రూపాయలు కల్పించాలన్నారు. ధరల స్థిరీకరణ నిధులను రైతుల మేలు కోసం ఉపయోగించాలన్నారు. వైసిపి అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి తమ టార్గెట్ కానే కాదని వైఎస్ షర్మిలారెడ్డి అన్నారు. పులివెందుల అరటి రైతులతో కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి సొంత నియోజకవర్గమైన పులివెందులలో ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా కోల్డ్ స్టోరేజ్, ప్రాసెసింగ్ ప్లాంట్ పూర్తిగా ఏర్పాటు చేయలేకపోయారని విమర్శించారు. 2023లో పులివెందులలో ప్రాసెసింగ్ ఎ÷-లాంట్ ప్రారంభించాలని చెప్పుకుంటున్నారన్నారు. ఆయన చెప్పిన మాటల్లో నిజం లేదన్నారు. అసలు నిజం ఏమిటంటే 2024 మార్చి 11న ఎన్నికల కోడ్ వచ్చే ముందు ప్రాసెసింగ్ ఎ÷-లాంట్ పనులు పూర్తిగా కాకపోయినా జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారన్నారు. ఏదైనా చెప్పితే అందులో నిజం ఉండాలన్నారు. కుటుంబ వ్యవహారాలు, ఆస్తులకు సంబంధించిన విషయం గురించి మా తల్లి విజయమ్మ ఎవరు మాట్లాడకూడదని అని చెప్పినా కూడా వైసిపి మాట్లాడుతుందని మండిపడ్డారు. జగన్మోహన్ రెడ్డి తమ టార్గెట్ కానే కాదని, మీరు మమ్మును టార్గెట్ చేస్తూ మాట్లాడితే మేము ఈ÷ఆ-గ్గ÷ట చేస్తామని సవాలు చేశారు. వైసీపీ జోలికి వెళ్లాల్సిన అవసరం తనకు లేదనివెల్లడించారు. కానీ తనపై విమర్శలు చేస్తే తాను కూడా స్పందించాల్సి వస్తుందని తెలిపారు. తన లక్ష్యం వైఎస్ జగన్మోహన్ రెడ్డి కాదని, అయితే వైసీపీ నేతల వ్యాఖ్యల వల్ల తరచూ వివరణ ఇవ్వాల్సి వస్తోందని అన్నారు.

# కాంగ్రెస్ పార్టీకి జీవన్ రెడ్డి గుడ్‌బై

ప్రభుత్వ న్యాయవాదుల నియామకంలోనూ తాను న్యాయవాదిని అయినా పట్టించు కోలేదన్నారు. గత పదేళ్లలో కాంగ్రెస్ కార్యకర్తలని హింసించి కొట్టించినవారిని గద్దెనెక్కిస్తే ఎలా? అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం మాది అన్న ఫీలింగ్ మావారికి లేదని.. గాంధీభవన్‌లో ఫిరాయింపుల ఎమ్మెల్యే ఉంటే సమావేశంలో ఎలా పాల్గొంటారన్నారు. రాహుల్ గాంధీ ఫాంచ్ న్యాయ్ అని రాజ్యంగం పట్టుకొని తిరుగుతే ఇక్కడ రాజ్యాంగాన్ని అవమాన పరుస్తున్నారన్నారు. ఈ వయస్సులో నేను పార్టీ మారి ఎం చేస్తాను. కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల్లో తలదూర్చితే నేను ఎలా భరిస్తాను. నేను ఇరవై మాసాలు ఓపిక పట్టాను. కాంగ్రెస్ పార్టీలో నన్ను అడుక్కునే స్థాయికి పట్టుకొచ్చారు. మీనాక్షి నటరాజన్ ఎనభై శాతం సీట్లు నాకే ఇస్తామని మాట ఇచ్చారు.. ఆ మాట పట్టించుకోలేదు. నాకు టికెట్లు ఇవ్వాలని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఎలా చెబుతాడు. పదవులు కావాలనుకుంటే నేను బీఆర్ఎస్‌లోకి వెళ్లేవాడిని. పీసీసీ అధ్యక్షుడు కావాల్సి నోడిని నా హక్కుల కొసం పోరాటం చేసే పరిస్థితి వచ్చింది. జీవన్ రెడ్డి అణగదొక్కాలన్నదే మీ ఆలోచన. చంద్రబాబు, కేసీఆర్‌ల మీద పోరాటం చేశాను.. ఇప్పుడు రేవంత్‌రెడ్డి మీద పోరాటం చేస్తాను. అడుగులకి మడగులు ఒత్తేటోళ్ళే మీకు కావాలా? రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగా నడిచే వాణ్ని అణగదొక్కారు. బతకవచ్చిన పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వం సహహాదారుడా? పోచారం ఇప్పటివరకు ఏం సలహాలు ఇచ్చాడని సీనియర్ నేత జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీ ఫిరాయింపుల అంశంలో రాహుల్ నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్ర నాయకత్వం ప్రవర్తిస్తోందని జీవన్ రెడ్డి మండిపడ్డారు. హైకమాండ్ తీరు, పార్టీలోకి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను తీసుకున్న కారణంగానే మనస్తాపంతో పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ కష్టార్జితమని.. పదేళ్లు తమను ఇబ్బంది పెట్టిన వారిని తీసుకువచ్చి పార్టీలో చేర్చుకుంటారా? అంటూ ధ్వజమెత్తారు. తెలంగాణ కాంగ్రెస్ నిర్ణయాలు జాతీయస్థాయిలో ప్రభావితం చూపబోతున్నాయని.. 'జై భీమ్-జై సంవిధాన్-జై బాపు' నినాదాలకు తూట్లు పొడిచారంటూ విమర్శించారు. కాంగ్రెస్‌ను వీడటం బాధగా ఉన్నా తప్పడం లేదంటూ మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వివరించారు.

## కాంగ్రెస్‌పార్టీవి డైవర్షన్ పాలిటిక్స్

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్ల నాలుగు నెలలైందని.. ప్రభుత్వానికి సంబంధించిన పత్రాలు, యంత్రాంగం అన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో ఉన్నా.. బ్యాంక్ ద్వారా అధికారికంగా నిధులు బదిలీ చేసిన ఫార్ములా-ఈ అంశం మీద మాత్రమే కేసు పెట్టగలిగారని తెలిపారు. ఈ ఏసీబీ ఛార్జ్‌షీట్ రేవంత్ ప్రభుత్వం ఎంత నిస్పృహలో ఉందో చూపించడమే కాకుండా, మా హయాంలో జరిగిన మచ్చలేని పాలనకు సర్టిఫికేట్ లాంటిదని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పాలనలో ఎలాంటి నిబంధనలు ఉల్లంఘించలేదని ఈ ఛార్జ్‌షీట్ ద్వారా స్పష్టం అవుతోందని కేటీఆర్ తెలిపారు. కేవలం అభివృద్ధే లక్ష్యంగా చేసుకుని విజయవంతంగా ప్రభుత్వాన్ని నడిపామని స్పష్టం చేశారు. ఫార్ములా-ఈ రేస్ ద్వారా హైదరాబాద్‌ను ప్రపంచ నగరాల సరసన నిలిపేందుకు ఉపయోగించిన ?49 కోట్ల బ్యాంక్-టు-బ్యాంక్ నిధుల బదిలీని కాంగ్రెస్ ప్రభుత్వం స్కామ్ అంటుందా? అని ప్రశ్నించారు. స్కాంగ్రెస్ నాయకులారా.. రండి చూసుకుందామని సవాలు విసిరారు.

# సిరిసిల్ల నేతన్నలను కాపాడండి

హైదరాబాద్ : సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను చుట్టుముట్టిన విద్యుత్ సంక్షోభం నుంచి నేతన్నలను కాపాడాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సిరిసిల్ల పవర్‌లూమ్ యూనిట్లపై ఉన్న విద్యుత్ బకాయిలు, సర్‌చార్జిల భారంపై తుమ్మలకు సమగ్రమైన వినతి పత్రాన్ని అందజేసి, వాటిని మాఫీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు అసెంబ్లీలో ఉపముఖ్యమంత్రిని కలిసి ఒక లేఖను అందజేశారు. సిరిసిల్ల పట్టణం రాష్ట్ర వస్త్ర పరిశ్రమకు గుండెకాయ వంటిదని, గతంలో ఇక్కడ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడిన చేదు జ్ఞాపకాలను కేటీఆర్ ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వ హయాంలో 25 హెచ్.పి. వరకు విద్యుత్ సబ్సిడీ పెంచడం వల్ల పరిశ్రమ నిలదొక్కుకుందని, అయితే ప్రస్తుతం విద్యుత్ అధికారులు విధిస్తున్న 'బ్యాక్ బిల్లింగ్' భారం వల్ల వేలాది కుటుంబాల జీవనోపాధి ప్రమాదంలో పడిందని ఆయన వివరించారు. 2016 నుంచి 2024 వరకు ఉన్న కాలానికి సంబంధించి సుమారు 127 ఎస్.ఎస్.ఐ యూనిట్లపై అధికారులు రూ. 19 కోట్ల బ్యాక్ బిల్లింగ్ భారం మోపారని, అది సర్‌చార్జిలతో కలిపి ఇప్పుడు రూ. 38 కోట్లకు చేరిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ భారీ బకాయిలను చెల్లించలేక అనేక యూనిట్లు మూతపడటంతో పాటు, ఇటీవల కాలంలో ఆర్థిక ఇబ్బందులతో 13 మంది కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడటం అత్యంత బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బిల్లుల భారాన్ని మానవీయ కోణంలో రద్దు చేసి నేతన్నను అదుకోవాలన్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను, కార్మికుల ఉపాధిని రక్షించేందుకు ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని కేటీఆర్ కోరుతూ కింద పేర్కొన్న అంశాలపై విజ్ఞప్తి చేశారు:? సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపై ఉన్న బ్యాక్ బిల్లింగ్ మరియు సర్‌చార్జి మొత్తాలను పూర్తిగా మాఫీ చేయాలి. పాత బకాయిలతో సంబంధం లేకుండా, పరిశ్రమకు నిరంతరాయంగా విద్యుత్ సబ్సిడీ ప్రయోజనాలు అందేలా ఆదేశాలుఇవ్వాలి.కార్మికులు మళ్లీ ఆత్మహత్యల బాట పట్టకుండా తక్షణ ఆర్థిక వెసులుబాటు కల్పించాలి. సిరిసిల్ల నేతన్నల సమస్య కేవలం ఒక ప్రాంతానిది కాదని, అది వేలాది కుటుంబాల మనుగడకు సంబంధించినదని కేటీఆర్ గుర్తు చేశారు. ఉప ముఖ్యమంత్రి గారు సానుకూలంగా స్పందించి, త్వరితగతిన ఈ సమస్యను పరిష్కరిస్తారని ఆశిస్తున్నట్లు ఆయన తెలిపారు.కెటిఆర్ గారితోపాటు ఏంఎల్సీ ఎల్ రమణ గారు కూడా ఉన్నారు

# పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం

శాసనసభలో గృహ నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష ఇళ్లకు అనుమతులు ఇచ్చిందని చెప్పారు. అయితే, ఆ ఇళ్లలో అనేక పనులు పూర్తి కాలేదని మంత్రి వెల్లడించారు. సుమారు 70 వేల ఇళ్లలో చిన్నపాటి పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, మరో 26 వేల ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయని తెలిపారు. ఈ అసంపూర్తి పనులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసిందని చెప్పారు. ఇక గత ప్రభుత్వం కేటాయించిన ఇళ్లలో 12 వేల ఇళ్లను ఇప్పటికీ లబ్దిదారులు స్వాధీనం చేసుకోలేదని మంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో లబ్దిదారులకు మూడు నెలల గడువు ఇచ్చి నోటీసులు జారీ చేయగా, అందులో 6 వేల మంది ఇళ్లను ఆక్యూపై చేసుకున్నారని చెప్పారు. మిగిలిన ఇళ్లను అర్హులైన కొత్త లబ్దిదారులకు కేటాయిస్తామని స్పష్టం చేశారు. అలాగే, పూర్తి కాకుండా ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఎంత ఖర్చు అయినా పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇప్పటివరకు ఎవరికీ కేటాయించని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కూడా త్వరలో లబ్దిదారులకు అందజేస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల అంశంపై అన్ని పార్టీల ప్రజాప్రతినిధులతో కలిసి త్వరలో హైదరాబాద్‌లో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. 99 రోజుల ప్రణాళికలో పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇళ్లను పేదలకు కేటాయిస్తామని శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. డబుల్ బెడ్ రూం ఇళ్లపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూం ఇళ్లు ఎన్ని ఉన్నాయి? వాటిలో ఎన్ని పూర్తయ్యాయి? ఇంకా ఎన్ని పూర్తి కావాల్సి ఉందనే దానిపై తమ వద్ద సమాచారం ఉందన్నారు. ఎమ్మెల్యే కె. వెంకటరమణా రెడ్డి జోక్యం చేసుకుంటూ.. ఇందిరమ్మ ఇల్లు మంచి పథకమన్నారు. వీటి వల్ల పేదలకు లబ్ది జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో కట్టిన డబుల్ బెడ్ రూం ఇల్లు నాసిరకంగా ఉండడంతో శిథిలావస్థకు చేరాయని విమర్శించారు. ఇప్పటికే పూర్తయి ఎవరికి కేటాయించని డబుల్ బెడ్ రూం ఇళ్లలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరి జోక్యం లేకుండా పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందేలా చొరవ చూపాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఎన్ని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించారని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రశ్నించారు. ఇప్పటికే పూర్తయి.. ఎవరికీ కేటాయించని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు వీలైనంత త్వరగా లబ్దిదారులకు అందజేయాలని ప్రభుత్వానికి సూచించారు. ఖైరతాబాద్‌లో 5 ప్రాంతాల్లో డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టేందుకు శంకుస్థాపన చేశారని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. వీలైనంత త్వరగా వాటిని పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించిందని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గుర్తు చేశారు. చిన్న చిన్న రిపేర్ల కారణంగా వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇంకా లబ్దిదారులకు అందజేయలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పార్టీని దృష్టిలో పెట్టుకుని డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వలేదన్నారు. ప్రస్తుతం ఇందిరమ్మ కమిటీలు చెప్పే వారికే ఇళ్లు ఇస్తామంటున్నారని సబితా ఇంద్రారెడ్డి మండిపడ్డారు. అల్లుడు వస్తే ఏడుంటడు, బిడ్డ వస్తే ఏడుంటడు అని గతంలో మాట్లాడిన కేసీఆర్.. గత పదేళ్ళలో అసలైన పేదలకు ఇళ్లు ఇవ్వలేదని బీఆర్ఎస్ అధినేతపై ఎమ్మెల్యే వంశీ కృష్ణ మండిపడ్డారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లకు సైతం కాలం చెల్లడంతో అవి శిథిలావస్థకు చేరాయని పేర్కొన్నారు. వారికి సైతం ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ప్రభుత్వానికి సూచించారు. జాయింట్ ఫ్యామిలీని రీ ఎంక్వరీ చేసి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని ప్రభుత్వానికి ఆయన స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్లకు బ్జడెట్‌లో రూ. 5 వేల కోట్లు కేటాయించారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. ఇంకా పూర్తి కాని వాటికే ఈ రూ.5 వేల కోట్లు సరిపోవని చెప్పారు. వచ్చే ఏడాది కేటాయించిన ఇళ్లకు నిధులు ఎలా ఇస్తారంటూ ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఇంతలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క జోక్యం చేసుకుని.. పల్లా రాజేశ్వర్ రెడ్డి సభను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. నియోజకవర్గానికి నాలుగున్నర లక్షల ఇళ్లు అన్ని పల్లా మాట్లాడడం ఆశ్చర్యంగా ఉందన్నారు. నియోజకవర్గానికి అన్ని ఇళ్లు ఉంటాయా అంటూ సందేహం వ్యక్తం చేశారు. సభను పక్కదారి పట్టించడమే ఏజెండాగా పెట్టుకున్నారని పల్లాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల కోసం పెట్టిన బ్జడెట్‌ను బీఆర్ఎస్ విమర్శిస్తుందా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. బడ్జెట్ పుస్తకాలను చించి పేదలను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అవమానించారంటూ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నిప్పులు చెరిగారు.

## ఐదు టవర్లుగా సెక్రెటేరియట్ ఐకానిక్ టవర్

అమరావతి నిర్మాణానికి సీఎం చంద్రబాబు నాయుడు ప్రత్యేక ÷నాన్స్ మోడల్ ఇచ్చారని చెప్పారు. ప్రజలు చెల్లించే పన్నుల నుంచి ఒక్క రూపాయి కూడా రాజధాని అమరావతికి ఖర్చు పెట్టడం లేదని పేర్కొన్నారు. అమరావతి సెల్ఫ్ ÷నాన్స్ సిటీ అని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కానీ కొంతమంది అమరావతిపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అమరావతిలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంపై సీఎం చంద్రబాబు సమీక్షించారన్నారు. ప్రస్తుతం ఈ ప్రమాద ఘటనపై విచారణ జరుగుతోందని తెలిపారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ఈ పని చేస్తే.. ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏజీఐసీఎల్ ఎండీ శ్రీనివాస్‌తో పాటు ఇంజనీర్లు పాల్గొన్నారు.

## పెద్ద ఎత్తున గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి

ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకొని సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేయాలన్న ఆలోచనను ప్రభుత్వం పరిశీలన చేస్తుందని తెలిపారు.ప్రస్తుతం రాష్ట్రంలో గృహ ఉపయోగ, వ్యవసాయ రంగానికి సంబంధించి 81 గ్రామాల్లో ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టు కింద సోలార్ విద్యుత్ ఉత్పత్తి పక్రియను చేపడుతుందని తెలిపారు . ఈ కార్యక్రమంలో భాగంగా 38,216 గ్రామాలు మరియు 16,078 వ్యవసాయ పంప్ సెట్ లకు సోలార్ ఎ÷-లాంట్స్ ఏర్పాటు చేస్తున్నాం అన్నారు. గృహ ఉపయోగ రూఫ్ టాప్ సోలార్ కింద పీఎం సూర్యగర్ ప్రభుత్వ బిజిలీ కింద 40, 349 గృహాల్లో టు కే సామర్థ్యం రూట్ ఆఫ్ సోలార్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు వ్యవసాయ సేవలు కింద పీఎం కుసుమ్ కాంపోనెంట్ సి కింద సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయడం ద్వారా 16,708 వ్యవసాయ సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

# దేశంలో పెట్రోల్, డీజిల్ కొరత లేదు

వదంతులు నమ్మవద్దని కోరింది. గృహావసరాల కోసం వందశాతం పీఎన్‌జీ సరఫరాకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని పెట్రోలియం శాఖ సంయుక్త కార్యదర్శి సుజాతా శర్మ తెలిపారు. ఈ మేరకు నోటీఫికేషన్ ఇచ్చామని, నిర్దిష్ట కాలపరిమితి లోపు దేశవ్యాప్తంగా పైపులైన్ల విస్తరణ, నేచురల్ గ్యాస్ మౌలిక వసతుల అభివృద్ధి జరగనుందని చెప్పారు. పశ్చిమాసియాలో ఘర్షణల నేపథ్యంలో ఎల్పీజీ, ఇంధనం కొరతపై ఆందోళనలను ప్రస్తావిస్తూ, ప్రజలు ఎలాంటి వదంతులు నమ్మవద్దని, ప్యానిక్ బైయింగ్‌కు పాల్పడవద్దని కోరారు. రిఫైనరీలు గరిష్ఠ సామర్థ్యంతో పనిచేస్తున్నాయని, ఏటా 26 కోట్ల టన్నుల రిఫైనరీ సామర్థ్యం మనకు ఉందని చెప్పారు. గత రెండు రోజులుగా రిటైల్ ఔట్‌లెట్‌లు, పెట్రోల్ బంకుల వద్ద పెద్దఎత్తున జనం క్యూలు కడుతుండటం తమ దృష్టికి వచ్చిందని, అయితే ఆందోళన అవసరం లేదని, దేశంలో తగినన్ని పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయని చెప్పారు. పెట్రోల్, డీజిల్ ధరలు కూడా పెరగబోవడం లేదని వివరించారు. వలస కార్మికులకు ప్రాధాన్యతా క్రమంలో 5 కిలోల సిలెండర్లు అందిస్తామని సుజాతా శర్మ తెలిపారు. 26 రాష్ట్రాలకు 22,000 టన్నుల ఎల్పీజీ కేటాయించామన్నారు. మంగళవారంనాడు 30,000 ఐదు కేజీల సిలెండర్లు ఇచ్చామని చెప్పారు. బ్లాక్‌మార్కెటింగ్, అక్రమ నిల్వలకు కళ్ళెం వేసేందుకు 2,700 దాడులు జరిపామని, 2,000 సిలెండర్లు స్వాధీనం చేసుకున్నామని అన్నారు. గ్యాస్ రీఫిల్ బుకింగ్ గడువు పెంపుపై వస్తున్న వార్తలు నిజం కాదనీ, గ్యాస్ బుకింగ్ సమయాల్లో ఎలాంటి మార్పులూ లేవనీ సుజాత శర్మ వివరించారు. కనెక్షన్‌తో సంబంధం లేకుండా పట్టణ ప్రాంతాల్లో రీఫిల్ బుకింగ్‌కు 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల గడువు ఎప్పటిలాగానే కొనసాగుతుందని సుజాత శర్మ స్పష్టం చేశారు. ఇదిలావుంటే పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఎల్‌పీజీ కొరతను అధిగమించడం సహా గ్యాస్ పంపిణీ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పైప్డ్ న్యాచురల్ గ్యాస్(పీఎన్‌జీ) సరఫరా అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో వెంటనే దానికి మారాలని ఆయా వినియోగదారులకు సూచించింది. లేనిపక్షంలో లిక్విడ్ పెట్రోలియం గ్యాస్(ఎల్‌పీజీ) సరఫరాను నిలిపివేస్తామని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ఉత్తర్వులిచ్చింది. దేశంలో పీఎన్‌జీని ప్రోత్సహించే దిశగా ముందడుగు వేస్తున్న కేంద్రం.. ఈ మేరకు 3 నెలల గడువు నిర్దేశిస్తూ ఆదేశాలు జారీచేసింది. పీఎన్‌జీ సౌకర్యం అందుబాటులో ఉన్న ప్రాంతాల్లోని ఎల్‌పీజీ సిలిండర్లను మౌలిక సదుపాయాలు లేని ఏరియాలకు మళ్లించడమే ఈ చర్య ప్రధాన ఉద్దేశమని కేంద్రం స్పష్టం చేసింది. పీఎన్‌జీకి మారడం వల్ల రీఫిల్ బుక్‌చేసే అవసరముండదు. దీంతోపాటు నిరంతర గ్యాస్ సరఫరా అందుబాటులో ఉంటుంది. అయితే.. పీఎన్‌జీ సరఫరాలో సాంకేతిక సమస్యలు, ఇంటికి పైప్‌లైన్ కనెక్షన్ ఇవ్వడం అసాధ్యమైన సందర్భంలో మాత్రమే ఎల్‌పీజీ సరఫరా కొనసాగుతుంది.కానీ.. దానికి పీఎన్‌జీ గ్యాస్ కంపెనీ నుంచి నిరభ్యంతర పత్రంతప్పనిసరి. మేరకు పీఎన్‌జీ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు పలు చర్యలు చేపట్టింది కేంద్రం. పైప్డ్ గ్యాస్ లైన్‌కు నిర్ణీత గడువులోగా అధికారులు అనుమతులు మంజూరు చేయాలి. నిర్దేశిరచిన ఫీజుకంటే ఎక్కువ వసూలు చేయకూడదు. హౌసింగ్ సొసైటీలు లేదా భూయజమానులు కూడా పైపులైన్ సరఫరాకు ఎలాంటి ఆటంకాలు కలిగించరాదు. అలాంటి సందర్భాలేమైనా తలెత్తితే ఆ ప్రాంతానికి ఎల్‌పీజీ సరఫరాను నిలిపివేయడం సహా సంబంధిత వ్యక్తులపై అధికారులు చర్యలు తీసుకునేందుకు వీలుంటుందని ఉత్తర్వుల్లో పేర్కొంది ప్రభుత్వం. వీటి అమలును పర్యవేక్షించడం సహా సమ్మతిని నిర్ధారించేందుకు పెట్రోలియం, సహజ వాయువు నియంత్రణ బోర్డ్ నోడల్ అథారిటీకి బాధ్యతలు అప్పగించింది.

## తల్లిని చంపి ఇంట్లోనే పూడ్చిన కూతురు

### పోలీసుల దర్యాప్తులో అంగీకిరించన నిందితురాలు

హైదరాబాద్,మార్చి25 : నగరంలో దారుణం చోటుచేసుకుంది. ప్రేమ వ్యవహారానికి అడ్డుపడిందని తల్లిని ప్రియుడి సాయంతో కుమార్తె చంపేసింది. ఈ ఘటన నగరంలోని జవహర్‌నగర్ పరిధి కౌకూర్ భరత్‌నగర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 10 నెలల క్రితం అంజు అనే మహిళ అదృశ్యమైంది. దీనిపై జవహర్‌నగర్ పీఎస్‌లో పెద్దకుమార్తె ఫిర్యాదు చేసింది. కుటుంబసభ్యుల ఫోన్‌కాల్స్‌ను పోలీసులు విశ్లేషించడంతో పాటు స్థానికులను విచారించారు. ఈ క్రమంలో తల్లిని చంపినట్లు చిన్న కుమార్తె ఇషిక అంగీకరించింది. ప్రియుడు మౌంటీరాజ్‌తో కలిసి ఈ హత్య చేసినట్లు వెల్లడించింది. ప్రియుడితో సహజీవనంపై తల్లి మందలించడంతో ఆమెను చంపి ఇంట్లోనే పూడ్చిపెట్టినట్లు తెలిపింది.

## దమ్ముంటే సిద్దిపేటలో తనపై పోటీ చేయాలి

### రేవంత్ రెడ్డి మళ్లీ సిఎం కావడం కల్ల

### అసెంబ్లీ సమావేశాలను పొడిగించాలి: హరీష్ రావు

హైదరాబాద్,మార్చి25 : రాష్ట్రంలో తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి మళ్లీ సీఎం అవుతానని పగటి కలలు కంటున్నారని విమర్శించారు. దమ్ముంటే సిద్దిపేటలో తనపై పోటీ చేయాలంటూ రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. అసెంబ్లీ లాబీలో హరీష్ రావు చిట్‌చాట్‌లో భాగంగా సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తల్లకిందులుగా తపస్సు చేసినా రేవంత్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కాలేరని అన్నారు.అసెంబ్లీ నిర్వహణపై కూడా ఆయన విమర్శలు చేశారు. సభను సమయానికి ప్రారంభించడం లేదని, టీ బ్రేక్ పేరుతో గంటల తరబడి వాయిదాలు వేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి ఢిల్లీ నుంచి రావడం, మంత్రుల సంసిద్ధత వంటి కారణాలతో సభను తరచుగా వాయిదా వేస్తున్నారని విమర్శించారు. ప్రతిపక్ష గొంతును నొక్కుతున్నారని ఆరోపించిన హరీష్, అసెంబ్లీని మరో వారంరోజుల పాటు పొడిగించాలని డిమాండ్ చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, రైతులు సహా అన్ని వర్గాలను రేవంత్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. డీలిమిటేషన్ వల్ల బీఆర్ఎస్‌కు మేలు జరుగుతుందని, మహిళా రిజర్వేషన్లను తమ పార్టీ స్వాగతిస్తుందని తెలిపారు. కుటుంబ నియంత్రణను పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు ఆర్థిక, రాజకీయ నష్టం జరుగుతుందని కూడా ఆయన పేర్కొన్నారు. ఇక ఉద్యోగాల అంశంపై మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేకపోయిందని వ్యాఖ్యనించారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కేవలం 16,978 ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారని, మొత్తం 16 నోటిఫికేషన్లు మాత్రమే విడుదల చేశారని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన ఉద్యోగాలను కూడా కాంగ్రెస్ తమ ఖాతాలో వేసుకుంటోందని ఆరోపించారు. సంక్షేమ బోర్డుల పరిస్థితిపై కూడా హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 33 సంక్షేమ బోర్డులు ఉన్నప్పటికీ, వాటిలో 16కి మాత్రమే కార్యాలయాలు ఉన్నాయని, మిగిలిన 17 బోర్డులకు కార్యాలయాలు కూడా లేవని తెలిపారు. కార్పోరేషన్లకు కేటాయించిన నిధుల్లో 99 శాతం లాప్స్ అవుతున్నాయని, కేవలం 2 శాతం మాత్రమే ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు.

## జీవన్ రెడ్డి పార్టీని వీడడం బాధాకరం

### పార్టీలో ఉంటూనే పోరాడాల్సింది: మల్లు

హైదరాబాద్,మార్చి25 : మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి క్రమశిక్షణతో పని చేశారని, ఆయన పార్టీలోనే ఉండి ఉంటే బాగుండేదని ఎంపీ మల్లు రవి అన్నారు. జీవన్ రెడ్డి పార్టీ విడిపోవడం చాలా బాధాకరమని, పార్టీలోనే ఉండి తనకు కావాల్సిన దాని గురించి అడిగి ఉండాల్సిందని అన్నారు. గొప్ప సిద్దాంతాలున్న కాంగ్రెస్ పార్టీలో పని చేయడం గొప్ప విషయమని, కొన్ని రాజకీయ సమీకరణాల కారణంగానే అందరికీ పదవులు రావడం లేదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు, తెలంగాణ ప్రజల అవసరాలకు అనుగుణంగానే సీఎం రేవంత్ రెడ్డి పాలన చేస్తున్నారని మల్లు రవి అన్నారు. రేవంత్ రెడ్డి మంచి ప్రజాదరణ ఉన్న నాయకుడని, గొప్ప వ్యూహకర్త అని ప్రశంసించారు. జీవన్ రెడ్డి లాంటి క్రమశిక్షణ గల నాయకులు పార్టీ వీడడం బాధాకరమని, ప్రభుత్వం చక్కని పాలన అందించాలంటే కొంత సర్దుకు పోవాలని సూచించారు. తాను కూడా గతంలో చాలా అవకాశాలు కోల్పోయానని, అయినా పార్టీలోనే ఉండి పోరాటం చేశానని చెప్పారు. జీవన్ రెడ్డి మనసు మార్చుకొని పార్టీలో కొనసాగాలని, పరిస్థితులను బట్టి నాయకులకు అవకాశాలు వస్తాయని అన్నారు. మంచి నాయకులకు మంచి అవకాశాలు తప్పకుండా వస్తాయన్నారు.

## యూపిలో రెండ్రోజులు శ్రీరామనవమి సెలవులు

### యోగి సర్కార్ ప్రకటన

లక్నో,మార్చి25 : శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ఉత్తరప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మార్చి 26, 27 తేదీలను సెలవు దినాలుగా ప్రకటించింది. పండుగ సందర్భంగా ఆలయాలను సందర్శించే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. మతపరమైన మనోభావాలను గౌరవిస్తూ, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఉండేందుకు యోగి ఆదిత్యనాథ్ రెండ్రోజుల సెలవుదినాల నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. తద్వారా రామనవమి ఉత్సవాల్లో పాల్గొనే ప్రజలకు మెరుగైన సౌకర్యాల కల్పించడం జరుగుతుందని పేర్కొన్నాయి. శ్రీరామనవమి వేడుకల నేపథ్యంలో అధికారులు రాష్ట్రవ్యాప్తంగా విస్తృత భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. యూపీలోని ప్రధాన ఆలయాలను సందర్శించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఏటా తరలివస్తుంటారు. అయోధ్యతో పాటు పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, ఊరేగింపులు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తుంటారు. ఉత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అవసరమైన మార్గదర్శకాలను పోలీసులు, ప్రభుత్వాధికారులు ఇప్పటికే విడుదల చేశారు. అయోధ్య, వారణాసి, మధుర సహా ఇతర ప్రధాన నగరాల్లో ఇప్పటికే పండుగ వాతావరణం నెలకొంది.

## డీలిమిటేషన్‌తో నగరంలో సీట్లు పెరుగుతాయి

### అది బిఆర్ఎస్‌కు లాభిస్తుందన్న సుధీర్ రెడ్డి

హైదరాబాద్,మార్చి25 : డీలిమిటేషన్ జరిగితే గ్రేటర్ హైదరాబాద్‌లో అసెంబ్లీ సీట్ల సంఖ్య పెరిగే అవకాశముందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. ఇది తమకు లాభిస్తుందని అన్నారు. నగరంలో బిఆర్ఎస్ బలంగా ఉండడం వల్ల రానున్న ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధిస్తామని అన్నారు. మీడియాతో చిట్‌చాట్‌లో భాగంగా పలు రాజకీయ అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. టీడీపీ పార్టీ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఏర్పడినప్పటికీ, ప్రస్తుతం అదే కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోవడం రాజకీయాల్లో సాధారణమైందని సుధీర్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకుంటే తప్పేమిటని ప్రశ్నించారు. అలాగే, సర్ నిర్వహించడం మంచిదేనని ఆయన అభిప్రాయపడ్డారు. ఓటర్ల జాబితాను సమగ్రంగా నవీకరించడం అవసరమని చెప్పారు. హైదరాబాద్ నగరంలో ఓటింగ్ శాతం తగ్గిపోవడంపై కూడా ఆయన స్పందించారు. ఐదేళ్ల పాటు నగరంలో నివసించే ఓటర్లు, ఓటింగ్ రోజు తమ స్వగ్రామాలకు వెళ్లడం వల్ల గ్రేటర్‌లో పోలింగ్ శాతం తగ్గుతోందని ఆయన తెలిపారు.

## ఉగ్ర లింకుల కేసులో మరొకరి అరెస్ట్

### హైదరాబాద్ పాతబస్తీ మహిళ

### విజయవాడకు తరలింపు

హైదరాబాద్,మార్చి 25 : తెలుగు రాష్ట్రాల్లో ఉగ్ర లింకులు కలకలం రేపుతున్నాయి. ఇప్పటికే విజయవాడలో ముగ్గురు యువకులను అరెస్టు చేయగా.. తాజాగా వారిని ఉగ్రవాదం వైపు ప్రోత్సహించిన హైదరాబాద్‌కు చెందిన యువతిని కూడా అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ చంచల్‌గూడకు చెందిన సయిదా బేగంను కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం విచారణ నిమిత్తం ఆమెను విజయవాడకు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విదేశీ హ్యాండ్లర్ అల్ హకీమ్ షకూర్ సూచనలతో సయిదా బేగం పనిచేస్తుంది. ఈ క్రమంలోనే విజయవాడకు చెందని సోహైల్ బెగ్, షరీఫ్, డానిష్ యువకులను తీవ్రవాద సంస్థల వైపు మళ్లించడంలో ఆమె కీలక పాత్ర పోషించిందని పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా, ఈ కేసుకు సంబంధించి హైదరాబాద్ మల్లేపల్లి ప్రాంతానికి చెందిన మరో వ్యక్తిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది.

# మీరేమైనా రాజులా...ఎందుకీ నిర్లక్ష్యం

**గురుగ్రామ్ పోలీసుల తీరుపై మండిపడ్డ సుప్రీం**
**చిన్నారిపై అత్యాచరం జరిగితే ఇంత నిర్లక్ష్యమా**
**క్రాస్ ఎగ్జామిన్ పేరుతో వేధింపులు చేస్తారా**
**కనీసం కేసు కూడా పెట్టకుండా ఏం చేస్తున్నారు**
**చిన్నారిని పిలిచి పదేపదే ప్రశ్నించడం ఎంత దారుణం**
**మీరే ఎందు వారి ఇంటికి వెళ్లలేక పోయారు**
**వెంటనే పోలీసులపై చర్యలకు సుప్రీం ఆదేశం**

న్యూఢిల్లీ,మార్చి25 : నాలుగేళ్ల బాలికపై జరిగిన అత్యాచారం కేసులో గురుగ్రామ్ పోలీసులు స్పందించిన తీరును సర్వోన్నత న్యాయస్థానం తీవ్రంగా తప్పుపట్టింది. ఆ చిన్నారితో పాటు వారి తల్లిదండ్రులతో అధికారులు ప్రవర్తించిన తీరు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని మండిపడింది. బాలికను క్రాస్-ఎగ్జామినేషన్ చేసిన అధికారులను మందలిస్తూ.. ఈ చర్యలు ఆ బాలికను మరింత మానసిక వేదనకు గురిచేయడం సహా అగౌరవపరిచాయని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. తమ కూతురిపై అత్యాచారం జరిగిందని గురుగ్రామ్ పోలీసులకు ఫిర్యాదు చేసినా.. వారు చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తూ తల్లిదండ్రులు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ చేపట్టిన ధర్మాసనం.. నిందితుడి సమక్షంలో మేజిస్ట్రేట్.. ఆ బాలికను ఎలా ప్రశ్నించారనే దానిపై పోలీసులు, జిల్లా న్యాయవ్యవస్థ వివరణ ఇవ్వాలని కోరింది. 'పోలీసులు



బాధితురాలి ఇంటికి ఎందుకు వెళ్లలేరు? వాళ్లేమైనా రాజులా?' అని ఈ సందర్భంగా సీజేఐ ప్రశ్నించారు. ఈ కేసులో హరియాణా తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి వాదనలు వినిపించారు. చిన్నారులపై లైంగిక నేరాల నుంచి రక్షణ(పోక్సో) చట్టంలోని సెక్షన్ 6(నేరం రుజువైతే 20ఏళ్ల జైలుశిక్ష) నుంచి నేరాన్ని సెక్షన్ 10(పదేళ్ల జైలుశిక్ష)కి ఎందుకు కుదించారని ధర్మాసనం నిలదీసింది. బాలల సంక్షేమ కమిటీ నివేదిక ఆధారంగా అభియోగాలను మార్చినట్టు భాటి సమాధానమివ్వగా.. బాలిక వాంగ్మూలం కంటే ఆ నివేదికకు ఎందుకు ప్రాధాన్యమిచ్చారని ప్రశ్నిస్తూ.. అసమర్థమైన విషయాన్ని సమర్థించవద్దని ఆగ్రహం వ్యక్తం చేసింది. డీసీపీ, ఏసీపీ హోదా కలిగిన పోలీస్ అధికారులు ఈ విచారణలో భాగమయ్యారు. ఆ చిన్నారిపై జరిగిన నేరం గురించి వారి అవగాహన ఇదే అయితే, మరి చట్టబద్ధమైన పాలన సంగతేంటి? అత్యాచారం అంటే లైంగిక చొరబాటు మాత్రమే కాదు. ఈ విషయంలో పోలీసులకు స్పష్టమైన అవగాహన లేకపోవడం తీవ్ర ఆవేదన కలిగిస్తోంది. నేర తీవ్రతను తగ్గించేందుకే అత్యున్నత పోలీస్ అధికారులను రంగంలోకి దించారు' అని జస్టిస్ బాగ్చి అన్నారు. పోలీసులు కనీసం చట్టాన్ని చదవలేదు. నాలుగేళ్ల చిన్నారి నిర్దోషిత్వాన్ని నమ్మలేదు. వారికి సిగ్గుండాలి. రాష్ట్రానికి చట్టంపై ఏమాత్రం గౌరవం ఉన్నా, వారిని తక్షణమే బదిలీ చేయాలి. సీసీటీవీ కెమెరాలు లేవని చెబుతున్నారు. 15 రోజులుగా ఏమీ చేయకుండా.. మేమీ కేసును పరిగణనలోకి తీసుకున్నాకే అరెస్టులు మొదలెట్టారు. మీరెందుకంత తీరిక లేకుండా ఉన్నారో మేమే చెప్పాలా? ఈ కేసు సున్నితత్వం లేమికి పరాకాష్టగా నిలుస్తోంది. సీడబ్ల్యూసీ సభ్యులు ఎవరు? వారిని ఎవరు నియమిస్తారు? వారి అర్హతలేమిటి?' అని సీజేఐ సూర్యకాంత్ ప్రశ్నలవర్షం కురిపించారు. ఈ కేసు నమోదులో భాగంగా అఫిడవిట్‌లో పలుమార్లు ఆ చిన్నారి పేరు ప్రస్తావించడంపైనా ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. గురుగ్రామ్ పోలీసులు నిర్లక్ష్యపూరితమైన, బాధ్యతారహితమైన, పూర్తిగా చట్టవిరుద్ధమైన దర్యాప్తు విధానాన్ని కొనసాగించారని.. ఈ తీరుతో ఆ చిన్నారి మరింత మానసిక క్షోభకు గురై ఉంటుందని అభిప్రాయపడింది.

## రష్యా నుంచి భారీగా క్రూడాయిల్ కొనుగోళ్లు

### 60 మిలియన్ బ్యారెళ్లు సేకరించినట్లు ప్రచారం

న్యూఢిల్లీ,మార్చి25 : పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ముడి చమురుకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. బ్రెంట్ క్రూడాయిల్ ధర భారీగా పెరిగింది. దేశంలో ఇంధన సరఫరాకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కేంద్రం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. రష్యా నుంచి భారీగా ముడి చమురును కొనుగోలు చేస్తోంది. తాజాగా రష్యా నుంచి 60 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును భారత రిఫైనరీలు కొనుగోలు చేసినట్టు 'బ్లూమ్‌బర్గ్' తన కథనంలో పేర్కొంది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లోని బ్రెంట్ క్రూడాయిల్ ధర కంటే, బ్యారెల్‌కు 5-15 డాలర్లు అధికంగా చెల్లించి మరీ భారత రిఫైనరీలు ఈ కొనుగోళ్లు జరిపినట్టు సమాచారం. ఫిబ్రవరిలో రష్యా నుంచి కొనుగోలు చేసిన ముడి చమురుతో పోల్చుకుంటే ఈ కొనుగోళ్లు దాదాపు రెట్టింపు కావడం గమనార్హం. హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేసి ముడి చమురు సరఫరాకు ఆటంకం కలిగించిన నేపథ్యంలో.. రష్యా క్రూడాయిల్‌పై అమెరికా ఆంక్షలు సడలించింది. దీంతోనే భారత్ ర్గి÷నైరీలు ఇంత భారీ స్థాయిలో కొనుగోళ్లు జరిపాయి. హోర్ముజ్ జలసంధి దగ్గర నౌకల ప్రయాణానికి అంతరాయం కొనసాగినంత కాలం రష్యా ముడి చమురుపై ఆంక్షల సడలింపును అమెరికా పొడిగించే అవకాశం కనిపిస్తోందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే సముద్రంలో ఉన్న ఇరాన్ చమురుపై కూడా ఆమెరికా ఆంక్షలు ఎత్తేసింది. ఆ చమురును కూడా భారత రిఫైనరీలు కొనుగోలు చేసినట్టు వార్తలు వచ్చాయి.

## తెలుగు రాష్ట్రాల్లో పెట్రోల్ కొరత

### నగరంలో పలుచోట్ల పెట్రో బంకుల మూత

### బంకుల ముందు క్యూ కడుతున్న వాహనదారులు

హైదరాబాద్ : అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధంతో భారతదేశ వ్యాప్తంగా గ్యాస్, పెట్రోల్‌కు కొరత ఏర్పడింది. కొన్ని రోజులుగా ప్రజలు వంట గ్యాస్ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా పెట్రోల్ నిల్వలు కూడా దేశంలో తగ్గిపోయాయన్న ప్రచారంతో బంకుల ముందు వాహనదారులు క్యూ కడుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి కనిపిస్తోంది. క్యూ కట్టి మరీ బంకుల నుంచి పెద్దఎత్తున ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్నారు. హైదరాబాద్‌లోనూ అవసరం లేకున్నా లీటర్ల కొద్దీ పెట్రోల్ కొనుగోలు చేస్తున్నారు వాహనదారులు. దీంతో పలు బంకులు తాత్కాలికంగా మూతపడ్డాయి. నగర వ్యాప్తంగా చాలా బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు కనిపించడంతో ప్రజలు మరింతగా ఆందోళన చెందుతున్నారు. పెట్రోల్ కొరతతో ఇబ్బందులు తప్పవన్న వదంతులే ఇందుకు కారణం. అయితే, దీనిపై తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ కీలక ప్రకటన చేసింద్గి÷లంగాణలో సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని తెలిపింది. రాష్ట్ర ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని సూచించింది. పీఆర్ఎస్‌వో(ఖఖాక్ష)లకి విరుద్ధంగా ప్రజలు, బంకుల యాజమాన్యాలు ప్రవర్తించవద్దని చెప్పింది. అవసరాన్ని బట్టి మాత్రమే పెట్రోల్, డీజిల్ కొనాలని అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. సప్లయ్ చైన్స్ సరిగ్గా పని చేస్తున్నాయని.. ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదని తెలిపింది. మరోవైపు భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(ఃఖఅఒ) అడ్వైజరీ జారీ చేసింది. పెట్రోల్, డీజిల్ కొరత వదంతులు పూర్తిగా నిరాధారమైనవని తెలిపింది. భారతదేశంలో పుష్కలంగా ఇంధన నిల్వలు ఉన్నాయని పేర్కొంది. దేశవ్యాప్తంగా సరఫరా నడుస్తోందని.. బీపీసీఎల్ పూర్తిస్థాయిలో పనిచేస్తోందని అడ్వైజరీలో తెలిపింది. పెట్రోల్, డీజిల్ కొరతతో రాష్ట్రవ్యాప్తంగా వాహనదారుల ఆందోళన నేపథ్యంలో తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ స్పందించింది. పెట్రోల్, డీజిల్ కొరత ఉందన్న వదంతులు పూర్తిగా అవాస్తవమని కొట్టిపారేసింది. సోషల్‌మీడియాలో వస్తున్న ప్రచారాలతో తప్పుడు ప్రచారాల కారణంగా ప్రజలు అనవసరంగా పెట్రోల్ బంకులను పరుగులు తీస్తూ, ట్యాంకులు నింపుకుంటున్నారని తెలిపింది. ఈ భయాందోళనల కారణంగా సాధారణ స్థాయి కంటే 2.5 నుంచి 3 రెట్లు అధికంగా అమ్మకాలు జరుగుతున్నాయని తెలంగాణ పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ తెలిపింది. దీంతో కొన్ని ప్రాంతాల్లో తాత్కాలికంగా ఇంధన నిల్వలు తగ్గినట్లు కనిపిస్తున్నాయని పేర్కొంది. రాష్ట్రంలో ఎలాంటి ఇంధన కొరత లేదని స్పష్టంచేసింది. ఊఖఅఒ, ఎక్షఅఒ, ఃఖఅఒ సంస్థల వద్ద తగినంత నిల్వలు ఉన్నాయని.. సరఫరా వ్యవస్థ సక్రమంగా కొనసాగుతుందని తెలిపింది. పెట్రోల్ లేదా డీజిల్‌ను క్యాన్లలో నిల్వ చేయడం ప్రమాదకరమని.. ఇది ఖఇ÷ాక్ష నిబంధనలకు విరుద్ధమని పెట్రోలియం డీలర్స్ అసోసియేషన్ హెచ్చరించింది. ఇంధనాన్ని తప్పుగా నిల్వ చేయడం వల్ల అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం తెలిపింది. భయాందోళనలతో అధికంగా ఇంధనాన్ని కొనుగోలు చేసి నిల్వ చేసుకోవద్దని సూచించింది.

## నగరంలో ఒక్క ఇంటినైనా నిర్మించారా

### అసెంబ్లీలో తలసాని ప్రశ్న

హైదరాబాద్,మార్చి 25( : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 28 నెలలు గడుస్తున్నా హైదరాబాద్ నగరంలో ఒక ఇంటినైనా నిర్మించలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రభుత్వాన్ని నిలదీశారు. బుధవారం అసెంబ్లీలె ఇందిరమ్మ ఇళ్లపై చర్చలో ఆయన మాట్లాడారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కార్యక్రమంతో పేద ప్రజల సొంత ఇంటి కల నెరవేర్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనని అన్నారు. 2.31 లక్షల ఇండ్లను మంజూరు చేసి 1.62 లక్షల ఇండ్లను నిర్మించామని, జంటనగరాల పరిధిలో 65 వేల ఇండ్లను లాటరీ విధానంలో పారదర్శకంగా లబ్దిదారులకు కేటాయించామని వెల్లడించారు. సనత్ నగర్ లోని ఐడీహెచ్ కాలనీలోనే మొట్టమొదట డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. నాటి గవర్నర్ నరసింహన్ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను చూసి గొప్పగా అభినందించారని గుర్తు చేశారు.జంట నగరాలలోని బస్తీలలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను స్థానికంగా 70 సంవత్సరాల నుంచి నివాసం ఉంటున్న అర్హులైన పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణంపై విమర్శలు చేస్తున్న వారు తనతో వస్తే బీఆర్ఎస్ హయాంలో ఎంత గొప్పగా నిర్మించామో చూపిస్తామని సవాల్ విసిరారు.

## పెట్రోల్, డీజిల్, గ్యాస్ కోసం ప్రజల ఆందోళన

### ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్న వివేకానంద

హైదరాబాద్,మార్చి 25 : పెట్రోల్, డీజీల్, గ్యాస్ అవసరాలకు అనుగుణంగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దీనిపై ప్రజలకు సరైన భరోసా ఇవ్వడం లేదని అన్నారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కేపీ వివేకానంద మాట్లాడుతూ.. ప్రజల అవసరాలకు అనుగుణంగా స్టాక్స్ పెట్టుకుని ఉంటే ప్రజలు ఇబ్బంది పడాల్సిన అవసరం ఉండేది కాదని స్పష్టం చేశారు. యూరియా కొరతతో రైతులు ఎలా ఇబ్బంది పడ్డారో ఇన్ని రోజులు చూశాం.. ఇప్పుడు ఇంధన కొరతను చూస్తున్నామని కేపీ వివేకానంద తెలిపారు. ఇంధన నిల్వలపై కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం సమన్వయం చేసుకోవడం లేదని విమర్శించారు. యుద్ధం జరుగుతున్న దేశాల్లో ఇబ్బంది లేదు కానీ.. యుద్ధం లేని దేశాలు మాత్రం ఇబ్బంది పడుతున్నాయని అన్నారు. ఇంధన కొరతను ఊహించలేకపోవడం వల్లే ఇప్పుడు ఈ సమస్యను ఎదుర్కొంటున్నామని అన్నారు. పెట్రోల్, డీజిల్ గ్యాస్ లేకపోతే పొద్దుగడవదని కేపీ వివేకానంద అన్నారు.

## స్థిరంగానే భారత్ ఇంధన భద్రత

### మరిన్ని నౌకలు భారత్‌కు చేరుకునే అవకాశం

### పశ్చిమాసియా పరిస్థితులపై అఖిలపక్షంలో ప్రభుత్వం వివరణ

### సమస్య ఎదుర్కొనేందుకు ఉమ్మడిగా సాగాలని నిర్ణయం


న్యూఢిల్లీ,మార్చి25 : భారతదేశ ఇంధన భద్రత స్థిరంగా ఉందని, అదనపు సరకుతో నౌకలు వస్తున్నాయని కేంద్ర అన్ని రాజకీయ పార్టీలకు భరోసా ఇచ్చింది. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన బుధవారం సాయంత్రం పార్లమెంటు భవనంలో అఖిల పక్ష సమావేశం జరిగింది. ఒక గంటా 45 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, పెట్రోలియం మంత్రి హర్దీప్ సింగ్ పురి, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి, కాంగ్రెస్ నేతలు ముకుల్ వాస్నిక్, తారిఖ్ అన్వర్, సమాజ్‌వాదీ పార్టీ నేతలు ధర్మేంద్ర యాదవ్,జావెద్ అలీ, సీపీఎం నేత జాన్ బ్రిట్టాస్, ఎల్‌జేపీ నేత అరుణ్ భారతి, డీఎంకే నేత పి.విల్సన్, ఆప్ ఎం సంజయ్ సింగ్, జేడీయూ నేత రాజీవ్ సింగ్, సంజయ్ ఝా తదితరులు పాల్గొన్నారు. టీఎంసీ నుంచి ఎవరూ హాజరుకాలేదు. అఖిలపక్ష సమావేశానంతరం కిరణ్ రిజిజు మాట్లాడుతూ, సమావేశంలో అన్ని పార్టీలు చురుకుగా పాల్గొన్నాయని, ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా మధ్య జరుగుతున్న యుద్ధం, భారత్‌పై దాని ప్రభావంపై సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశాయని తెలిపారు. ప్రభుత్వం సమగ్రంగా, సంపూర్ణంగా స్పందించిందని, విపక్షాలందరి ప్రశ్నలన్నింటికీ సంతృప్తికరంగా సమాధానాలి చ్చిందని చెప్పారు. ప్రస్తుత పరిస్థితిని సమర్ధవంతగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వానికి మద్దతుగా నిలబడతామని విపక్ష పార్టీలు హామీనిచ్చాయని చెప్పారు. 'ప్రస్తుత సంక్షోభ సమయంలో పరిస్థితికి అనుగుణంగా ప్రభుత్వం తీసుకునే చర్యలకు సమష్టిగా మద్దతు ఇస్తామని విపక్షాలు తెలిపాయి' అని రిజిజు వివరించారు. కాగా, దేశంలో ఇంధన భద్రత స్థిరంగా, దేశ ఇంధన అవసరాలకు సరిపడా ఉందని అఖిలపక్ష సమావేశంలో ప్రభుత్వం పేర్కొన్నట్టు అధికార వర్గాలు తెలిపాయి. సరకు కోసం అడ్వాన్స్ బుకింగ్ చేసుకోవడంతో పాటు వివిధ దేశాలతో సంప్రదింపులు సాగిస్తున్నామని, నిరంతరాయ ఇంధన సరఫరాకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని ప్రభుత్వం హామీ ఇచ్చినట్టు పేర్కొన్నాయి. ఎల్‌జీపీ లభ్యత, హోర్ముజ్ జలసంధి మీదుగా షిప్‌మెంట్‌పై సమావేశంలో విపక్షాల ఆందోళన వ్యక్తం చేశాయి. అయితే పరిస్థితి అదుపులోనే ఉందని, మరో నాలుగైదు రోజుల్లో నాలుగు నౌకలు పోర్టుకు చేరుకుంటాయని ప్రభుత్వం తెలిపింది. ఎలాంటి ఇంధన కొరత లేదని, తగినన్ని నిల్వలు ఉన్నాయని వివరించింది. అఖిలపక్షానికి హాజరైన అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామని, విపక్షాలతో ఏ సమయంలోనైనా చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపింది. దేశ ప్రజల ప్రయోజనాలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, విపక్షాలతో చర్చలకు తలుపులు తెరిచే ఉంటాయని రాజ్‌నాథ్ అఖిలపక్ష సమావేశంలో పేర్కొన్నారు. యుద్ధంతో తలెత్తిన పరిణామాలు, ఇంధన భద్రతపై ఆందోళనలు, ప్రపంచ వ్యాప్తంగా ఎదురవుతున్న సవాళ్లను విదేశాంగ కార్యదర్శి మిస్రీ అఖిల పక్ష నేతలకు వివరించారు. మొత్తం మీద.. పరిస్థితులు అదుపులోనే ఉన్నాయని, దేశీయంగా ప్రజల ఆందోళనలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందనే సందేశాన్ని అఖిలపక్ష సమావేశం ఇచ్చింది.

## బస్సులు లేక ప్రజల ఇబ్బందులు

### అధికారులకు విన్నవించినా స్పందన లేదు

### విశాఖలో ధర్నాకు దిగిన విద్యార్థి సంఘం

విశాఖపట్టణం,మార్చి 25 : విశాఖపట్నం జిల్లాలో విద్యార్థులు, ప్రయాణికులు బస్సుల కొరత కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమస్యపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు భారీ స్థాయిలో బుధవారం ఆందోళన చేపట్టారు. గత మూడు నెలలుగా విద్యార్థుల నుండి పెద్ద ఎత్తున సంతకాల సేకరణ చేపట్టి జిల్లా కలెక్టర్, ఆర్టీసీ రీజనల్ మేనేజర్, రవాణా శాఖ మంత్రికి పలుమార్లు వినతిపత్రాలు అందజేసినప్పటికీ ఎలాంటి స్పందన లేకపోవడంతో ఎస్ఎఫ్ఐ పిలుపు మేరకు రీజనల్ మేనేజర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ గాంధీ విగ్రహం నుండి ప్రారంభమై ఆర్టీసీ రీజనల్ మేనేజర్ కార్యాలయం వరకు సాగింది. అనంతరం విద్యార్థులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి. వెంకటరమణ మాట్లాడుతూ ?. జిల్లాలో ఆర్టీసీ బస్సుల కొరత తీవ్రమైందని, దీని వల్ల విద్యార్థులు గంటల తరబడి బస్ స్టాండ్లలో వేచి ఉండాల్సి వస్తోందని తెలిపారు. బస్సులు తగిన సంఖ్యలో లేకపోవడంతో విద్యార్థులు తరగతులకు సమయానికి చేరుకోలేక క్లాసులు మిస్ అవుతున్నారని, అలాగే ఇంటికి తిరిగి వెళ్లడంలో కూడా ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. అలాగే విశాఖ ప్రజలు బస్సుల కొరతతో ఇబ్బందులు పడుతుండగా సుమారు 30 ప్రభుత్వ బస్సులను గీతం ప్రైవేట్ యూనివర్సిటీకి కాంట్రాక్ట్ ఇవ్వడం అన్యాయమని పేర్కొంటూ ఆ కాంట్రాక్ట్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షులు అజరు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను అమలు చేయడంలో చూపుతున్న శ్రద్ధను ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో చూపడం లేదని విమర్శించారు. విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి, ప్రత్యేక బస్సులు నడపాలి, నగరానికి తగిన విధంగా బస్సుల సంఖ్యను పెంచాలని, గీతం యూనివర్సిటీకి ఇచ్చిన కాంట్రాక్ట్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జోన్ వారీగా బస్సులను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ధర్నా స్థలానికి వచ్చిన ఆర్టీసీ రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు విద్యార్థుల డిమాండ్లపై స్పందిస్తూ జూలై 1వ తేదీ నుంచి విశాఖ జిల్లాకు అదనంగా 100 బస్సులు ఏర్పాటు చేస్తామని, గీతం యూనివర్సిటీ కాంట్రాక్ట్‌పై ఉన్నతాధికారులతో చర్చించి రద్దు చేసే చర్యలు తీసుకుంటామని, విద్యార్థులకు ప్రత్యేక బస్సులు కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అధికారుల హామీతో విద్యార్థులు తమ ధర్నాను విరమించారు.



# సంపాదకీయం

## ఆయిల్ సంక్షోభంలో భారత్ !

మధ్యప్రాచ్యంలో యుద్ద వాతావరణం నేపథ్యంలో భారత్‌లో కరోనాలాంటి దుర్భర పరిస్తితులు రాబోతు న్నాయని ప్రధాని మోడీ చేసిన హెచ్చరిక మనం అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితిని సూచిస్తోంది. ఎందుకంటే గల్ఫ్ ఆయిల్ దక్కితే తప్ప ఇక్కడ బండి నడవని పరిస్థితులు ఉన్నాయి. దేశీయంగా మనం గ్యాస్ ఉత్పత్తి చేస్తున్నా... సోలార్ విద్యుత్ పొందుతున్నా మనమింకా స్వయం సమృద్ధి సాధించలేక పోయాం. ఇప్పుడిప్పుడే సోలార్ రంగంలో గణనీయమైన ప్రగతి సాధిస్తున్నాం. అయితే ఆయిల్‌కు ప్రత్నమ్నాయంగా మనం ఎదగడం లేదు. నేచరల్ గ్యాస్ లభ్యత అంతంత మాత్రంగానే ఉంది. చమురు వినియోగంలో రవాణా రంగానిది ప్రథమ స్థానం. రవాణా కార్యకలాపాలలో సహజవాయువు వినియోగం ఆశించిన విధంగా పెరగలేదు. రైల్వేస్‌లో సైతం డీజిల్ వినియోగం ఎక్కువే అయినా 90శాతానికి పైగా రైల్వే లైన్లు విద్యుదీకరణ కావడంతో ఆ చమురు వినియోగం 62శాతానికి తగ్గింది. విద్యుదుత్పాదనలో సహజవాయువుకు ప్రాధాన్యం అంతకంతకూ పెరిగిపోతోంది. వ్యవసాయ రంగంలో సన్నకారు రైతుల సాగు బావులకు విద్యుత్ పంపు సెట్లు అందించడం ద్వారా గ్రామీణ విద్యుత్ సరఫరాకు ఊతమివ్వడం డీజిల్ వినియోగాన్ని తగ్గించడంలో భాగమే. అనేక రాష్ట్రాల్లో వ్యవసాయ పంపుసెట్లు ఇప్పటికీ డీజిల్‌పై ఆధారపడి ఉండగా ఎరువుల కర్మాగారాలు గ్యాస్ ఆధారితంగా ఉన్నాయి. ఎరువుల ఉత్పత్తికి అవసరమైన రసాయనాలు సైతం గల్ఫ్ దేశాల నుంచే దిగుమతి అవుతున్నాయన్న విషయం విస్మరించలేనిది. ఇరాన్‌తో యుద్ధం ఇప్పట్లో ముగుస్తుందా అన్నది కూడా సందేహంగానే ఉంది. ట్రంప్ మూర్ఖత్వంపైనే యుద్ధం ముగింపు ఆధారపడి ఉంది. వెనిజులాను చెరపట్టినట్లుగా ఇరాన్‌ను చెరపట్టవచ్చున్న ట్రంప్ ఎత్తుగడలు ఫలించలేదు. ట్రంప్ అంచనాలు తలికిందులు అయ్యాయి. ఇరాన్ ధీటుగా స్పందిస్తోంది. వెంటనే ముగిసినా దాని తాలూకు నష్టాలు భరించి ముందుకు వెళ్లడానికి కనీసం ఓ ఐదారు నెలలు పడుతుంది. ఈ దశలో ఆయిల్ వాడకాలు తగ్గించుకోవడం మంచిది. దేశీయ ఉత్పత్తులను మాత్రమే వాడాలన్న నిబంధన రావాలి. దేశీయ వస్తువులను వాడేందుకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకోవాలి. రైతులు పండించే పంటలకు తోడు,దేశానికి అవసరమైన పంటలను పండించేలా రైతులను ప్రోత్సహించాలి. దిగుమతులను తగ్గించు కోవడం లేదా నిలిపి వేయడం అసవరం. మధ్యప్రాచ్య దేశాలలో తరచూ యుద్ధ ఉద్రిక్తతలు నెలకొనడం పరిపాటి. ఈ దేశాల చమురు ఉత్పత్తులపై ఆధారపడ్డ దేశాలు, మరీ ముఖ్యంగా భారత్ యుద్ధ పరిస్థితులు తలెత్తిన ప్రతిసారీ తీవ్ర ఒడుదుడుకులు ఎదుర్కొంటుంది. ఇప్పుడూ అదే జరుగుతోంది. అరబ్ దేశాలు, ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలు ఉత్పన్నమైన ప్రతిసారీ చమురు ధరలు పెరుగుతాయి. వెనువెంటనే ద్రవ్యోల్బణం ముమ్మరమవుతుంది. భారత ఆర్థిక వ్యవస్థ పురోగతికి విఘాతం వాటిల్లుతుంది. రాజకీయ అంశాలకు తోడుగా సైనిక సమీకరణలు, దౌత్య వ్యవహారాల విభిన్న సవాళ్ళ మధ్య భారత్ ఆచితూచి అడుగులు వేస్తోంది. ఇప్పటి వరకు దౌత్యపరంగా భారత్ తడబాటు లేకుండా నెగ్గుకు వస్తోంది. ఎక్కడ తప్పటడుగు వేసినా భారత ఆర్థిక వ్యవస్థ భారీ మూల్యం చెల్లించు కోవల్సివస్తుంది. గోరుచుట్టుపై రోకటిపోటులా తాజా యుద్ధం కారణంగా చమురు ధరల పెరుగుదల, అలభ్యత వంటి ప్రతికూల పరిస్థితులలో భారత్ దెబ్బతింటోంది.. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం ఇప్పటికే దాడి చేస్తున్నాయి. ప్రస్తుతం ఇరాన్‌కు వ్యతిరేకంగా అమెరికా-ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధ పరిణామాలను గమనిస్తుంటే ఇదంతా ప్రపంచ వినాశనానికి దారితీసేలా ఉంది. మధ్యప్రాచ్యంలో యుద్ధ భయాలు చెలరేగిన ప్రతిసారీ చమురు ధరలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ప్రపంచంలో వస్తున్న ఒడిదుడుకుల దృష్ట్యా భారత ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలపై భారత ప్రభుత్వం దృష్టి పెట్టింది. అందులో భాగంగా బొగ్గు ఉత్పత్తిని పెంచింది. 1990వ దశకంలో సరళీకృత ఆర్థిక విధానాలతో పారిశ్రామికాభివృద్ధి ఇతోధికమయిన కారణంగా చమురు, సహజ వాయువు అవసరాలు మున్నెన్నడు లేని విధంగా పెరిగిపోయాయి. వాటి దిగుమతులపై ఆధారపడడమూ అనూహ్యంగా పెరిగిపోయింది. కీలకమైన విద్యుత్ ఉత్పత్తి రంగంలో కాలుష్యకారక వాయు ఉద్గారాలను నియంత్రించేందుకు బొగ్గు వినియోగాన్ని తగ్గిస్తూ క్రమేణా సహజవాయువు వినియోగాన్ని అధికం చేశారు. అయితే విద్యుదుత్పాదనకు వినియోగిస్తున్న సహజవాయువు విదేశాల నుంచి దిగుమతి చేసుకునేదే కావడం గమనార్హం. భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి అనేది దిగుమతి చేసుకుంటున్న చమురు ధరలపై ఆధారపడి ఉన్నది. రష్యా నుంచి దిగుమతి చేసుకున్న చమురును స్థానిక విపణిలో విక్రయించకుండా విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. అరేబియా సముద్ర తీరస్థ ఎనిమిది దేశాలు భారత్‌కు చమురు సరఫరా చేస్తున్నాయి. అదే అమెరికా నుంచి దిగుమతి చేసుకోవడానికి ప్రాధాన్యమిస్తే మార్కెట్ ఆధిపత్య ధోరణితో వ్యవహరించే ఆ ఒక్క దేశంపై మాత్రమే ఆధారపడవల్సి ఉంటుంది. అయితే ఇప్పట్లో ఈ యుద్ధం ముగిసినా ముప్పు తప్పేలా లేదు. రేపు మరెలాంటి ముప్పు వస్తుందో చెప్పలేం. అందువల్ల భారత్ స్వయం సమృద్ధి దిశగా అడుగుల వేయాలి. ప్రజలను అందుకు సన్నద్ధం చేయాలి.

## ప్రమాదాల నివారణకు ఎఐ చేయూత



యూరప్ దేశాల్లో విజయవంతంగా అమలవుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) ఆధారిత ప్రిడిక్టివ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ విధానాన్ని తెలంగాణలోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ సరికొత్త సాంకేతికతద్వారా నగరంలోని ట్రాఫిక్ నమూనాలను విశ్లేషించి ఎక్కడ రద్దీఏర్పడే అవకాశం ఉందో ముందుగానే గుర్తించవచ్చు. దీనివల్ల సిగ్నల్ వ్యవస్థను ఎప్పటికప్పుడు ఆటోమెటిక్‌గా నియంత్రించి వాహనాల రాకపోకలు సుగమం చేయడానికి వీలవుతుంది. రోడ్డు భద్రత మెరుగుపడడమే కాకుండా సిబ్బంది పనితీరు కూడా పెరుగుతుంది. ఇటీవల దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సమావేశంలో రోడ్డు ప్రమాదాల నివారణలో ఎఐ సాంకేతికత ఎంతవరకు ఉపయోగపడుతుందో చర్చకు వచ్చింది. 2024లో దేశవ్యాప్తంగా 4,87,705 రోడ్డు ప్రమాదాలు జరగ్గా తెలంగాణలో 25,986 వరకు ప్రమాదాలు పెరిగాయని పెరిగాయి. తెలంగాణలో రోజుకు సగటున 70 రోడ్డు ప్రమాదాలు జరగ్గా, 20మంది వరకు మరణిస్తుండడం బాధాకరం. తెలంగాణలో ఏటా రోడ్డు ప్రమాదాలు పెరుగుతుండడంతో మరణాలు సగటున 8000 వరకు ఉన్నాయని, సుమారు 15 వేల మంది తీవ్ర గాయాల పాలై కుటుంబానికి భారమై ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శివధర్ రెడ్డి ఆందోళన వెలిబుచ్చారు. దేశంలో హైవేల మీద జరిగే ప్రమాదాల్లో అధికశాతం.. రోడ్డుపక్కన ఆగి ఉన్న లేదా పాడైపోయిన వాహనాలను వెనుకనుండి వేగంగా వచ్చి ఢీకొట్టడం వల్లనే జరుగుతున్నాయి. ఇలాంటి ప్రమాదాలను అరికట్టడానికి ఎఐ కెమెరాలు, డ్రోన్లు ఉపయోగపడతాయి. హైవే పై ఎక్కడైనా వాహనం నిలబడి ఉంటే వెంటనే ఇవి గుర్తిస్తాయి. కంట్రోల్ రూమ్ ద్వారా వెనుక వచ్చే వాహనదారులకు ముందస్తు హెచ్చరికలు పంపుతాయి. దీనివల్ల డ్రైవర్లు అప్రమత్తమై వేగాన్ని అదుపు చేయడానికి వీలవుతుంది. చౌరస్తాలు, జంక్షన్లలో ఎఐ కెమెరాలు ఉపయోగించి వాహనాల మధ్య ఉండే దూరాన్ని, వాటి వేగాన్ని విశ్లేషిస్తారు. వాహనాలు ఎంత దగ్గరగా వస్తున్నాయి, ఎక్కడ ఎక్కువ ముప్పు పొంచి ఉందనే అంశాల ఆధారంగా ఒక మ్యాప్ రూపొందిస్తారు. ఇది ఆ జంక్షన్‌లో అత్యంత ప్రమాదకరమైన ప్రాంతాన్ని గుర్తించడంలో సహాయపడుతుంది. భవిష్యత్తులో వాహనాలే వాటంతట అవే డ్రైవర్ అజాగ్రత్తగా ఉన్నా వెంటనే బ్రేక్‌వేసి ఆపడం లేదా దారి మార్చుకోవడం వంటివి ఎఐ వల్ల సాధ్యమవుతాయని చెబుతున్నారు. డ్రోన్లు మన రోడ్లపై పహారా కాస్తే భవిష్యత్తులో రోడ్డు ప్రయాణం మరింత సురక్షితంగా మారుతుందనడంలో సందేహం లేదు. పుణె వంటి నగరాల్లో ప్రజారవాణా వ్యవస్థలు స్మార్ట్ కెమెరాలను వినియోగించడం ప్రారంభించాయి. డ్రైవర్లు మగతగా ఉన్నారా? పరధ్యానంలో ఉన్నారా? సిగ్నల్స్ దాటుకుని స్పీడుగా వెళ్తున్నారా? ఇలాంటి అపసవ్య విధానాలను ఈ స్మార్ట్ కెమెరాలు పట్టేస్తాయి. కెమెరాల నుంచి, స్టీరింగ్ నమూనాల నుంచి, బ్రేకుల ఒత్తిడినుంచి డేటా సేకరిస్తారు. అలాగే డ్రైవరు ఎన్నిసార్లు కనురెప్పలు మూస్తూ తెరుస్తున్నాడో, తరచుగా వాహనం ఎన్నిసార్లు అదుపు తప్పిందో, రెడ్‌లైట్ సిగ్నల్ వద్ద డ్రైవర్ ఎలా ప్రమాదకరంగా ప్రవర్తిస్తున్నాడో తెలిసిపోతుంది. అలాంటి సమయాల్లో హెచ్చరికలు వస్తాయి. కొన్నిసార్లు కీచుమని శబ్దంరూపం లోనూ, మరికొన్ని సార్లు స్టీరింగ్ వీల్ ప్రకంపించడం ద్వారానూ హెచ్చరికలు వస్తుంటాయి. డ్రైవర్ల జీవితం ఎక్కువగా రోడ్లపైనే సాగుతుంది. ఎఐ వ్యవస్థ డ్రైవింగ్ అవర్స్‌ను ట్రాక్ చేయడమే కాదు, వారు స్మార్ట్‌గా డ్రైవ్ చేయడానికి సహాయపడుతుంది. ఎప్పుడు కళ్లు మత్తుతోపడినా లేదా సిగ్నల్స్‌కకు స్పందించే సమయం జారిపోయినా, విపత్తును పసిగట్టి తక్షణం విశ్రాంతి తీసుకోవాలని డ్రైవర్లకు హెచ్చరిస్తుంది. ఓవర్ స్పీడ్‌తో వాహనం వెళ్తున్నప్పుడు స్వయం చాలకంగా నియంత్రించడం, ముందున్న వాహనానికి, ఈ వాహనానికి మధ్య దూరాన్ని గమనించి అవసరాన్ని బట్టి వేగాన్ని తగ్గించటం లేదా పెంచడం చేస్తుంది. డ్రైవర్లు ఒత్తిడికి గురికాకుండా సౌకర్యవంతంగా ఉండేవరకు ఏకాగ్రతను పెంచుతుంది. దేశంలో బస్సుల్లో డ్రైవర్లకు సహాయక హెచ్చరికల పైలట్ ప్రణాళికలను కొన్నిచోట్ల అమలు చేయగా, ప్రమాదాలు చాలావరకు తగ్గాయని తేలింది. రవాణా వ్యవస్థలో కృత్రిమమేధ సహాయాన్ని అందుబాటులోకి తీసుకురావడం ఏమంత కష్టం కాదు. ఇటీవల కృత్రిమ మేధ సాయంతో అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను ఢిల్లీ గురుగ్రామ్ ద్వారకా ఎక్స్‌ప్రెస్ హైవేపై అందుబాటులోకి కేంద్ర ప్రభుత్వం ప్రయోగాత్మకంగా తీసుకురావడం చెప్పుకోతగిన విశేషం. దీంతో దేశంలోనే మొట్టమొదటి ఎఐ ఆధారిత స్మార్ట్ ట్రాఫిక్ సిస్టమ్ కలిగిన డిజిటల్ హైవేగా ఈ రహదారి గుర్తింపు పొందింది. రోడ్డు భద్రత యాజమాన్య వ్యవస్థలో సాంకేతికత కీలకమైన పాత్ర వహిస్తుందని రోడ్ రవాణా, జాతీయ రహదార్ల మంత్రిత్వశాఖ (ఎంఒఆర్‌టిహెచ్) భాగస్వామ్య సంస్థ జార్జి ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ హెల్త్ సూచించింది. రోడ్డు భద్రతను మరింత పెంచడానికి ఐఆర్‌ఎడి/ ఇడిఎఆర్ వంటి డిజిటల్ వ్యవస్థలను సరిగ్గా వినియోగించకపోవడంతో సమగ్రంగా ట్రాఫిక్ నిర్వహించడం కానీ, ప్రమాదాలను అదుపు చేయడం కానీ జరగడం లేదనీ నివేదిక పేర్కొంది. వాహనాలు ఢీకొనడం వంటి ప్రమాదాల్లో 90% మానవ ప్రమేయం వల్లనే జరుగుతున్నాయని 2022 లోని రోడ్డు భద్రత నివేదిక వెల్లడించడం గమనార్హం. ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ వి. పట్టాభిరామ్ కూడా ఇదే అభిప్రాయాన్ని గతంలో వెలిబుచ్చడం ఈ సందర్భంగా ప్రస్తావించవలసి ఉంది. ఈ ప్రమాదాలను నివారించాలంటే ప్రజల ప్రవర్తనలో మార్పు రావాలని కేంద్ర రోడ్లు రవాణా మంత్రి నితిన్ గడ్కరీ పదేపదే హెచ్చరిస్తున్నారు. కృత్రిమ మేధ (ఎఐ) వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థల సాయం తీసుకుంటేనే కానీ ఈ ప్రమాదాల నివారణ అంతగా సాధ్యం కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు

## కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఖాళీ చేయండి

### అక్బర్ రోడ్డు కార్యాలయం ఖాళీకి నోటీసులు

న్యూఢిల్లీ,మార్చి25 : దేశ రాజధానిలోని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యాలయానికి అధికారులు నోటీసు అందించారు. ల్యుటియన్స్ జోన్ ఖాళీ చేయాలని అక్బర్ రోడ్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయానికి ఎగ్జిట్ నోటీసు ఇచ్చారు. అలాగే 5వ నెంబర్ రైసినా రోడ్‌లోని యూత్ కాంగ్రెస్ ఆఫీస్‌ని కూడా ఖాళీ చేయాలని ఆదేశించారు. మార్చి 28లోపు రెండు ప్రాంగణాలను ఖాళీ చేయాలని డెడ్‌లైన్ విధించారు అధికారులు. 1978 నుంచి అంటే దాదాపు 48 ఏళ్ల నుంచి అక్బర్ రోడ్‌లోని ప్రధాన కార్యాలయం కేంద్రంగా పార్టీ కార్యకలాపాలను కాంగ్రెస్ నిర్వహిస్తోంది. అయితే, బలవంతపు తొలగింపును అడ్డుకునేందుకు న్యాయపరమైన మార్గాలను పరిశీంచి కోర్టును ఆశ్రయించనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. మరోవైపు, గతేడాది కోట్లా మార్గ్‌లో తమ కొత్త ప్రధాన కార్యాలయం ఇందిరా భవన్‌ను కాంగ్రెస్ పార్టీ ప్రారంభించింది. అయినప్పటికీ అక్బర్ రోడ్ ప్రాంగణాన్ని ఇంకా ఖాళీ చేయలేదు. పార్టీ కార్యకలాపాలు అక్కడే కొనసాగుతున్నాయి. అక్బర్ రోడ్ కార్యాలయంతో తమకు ఎంతో భావోద్వేగ బంధం ఉందని పలువురు పార్టీ సీనియర్లు చెబుతున్నారు. ఈ భవనానికి చరిత్రలో అత్యంత ప్రాముఖ్యత ఉంది. ఒకప్పుడు బ్రిటిష్ పాలనలో వైస్రాయ్ లార్డ్ లిన్లిత్‌గో కార్యనిర్వాహక మండలి సభ్యుడైన సర్ రెజినాల్డ్ మాక్స్‌వెల్ ఇక్కడే నివసించారు. 1960ల ప్రారంభంలో భారతదేశంలో మయన్మార్ రాయబారి అయిన డా.ఖిన్ కీ నివాసంగా ఉండేది. ఆ తర్వాత నోబెల్ శాంతి బహుమతిని గెలుచుకున్న డా.ఖిన్ కీ కుమార్తె ఆంగ్ సాన్ సూకీ చాలా సంవత్సరాలు అక్కడే నివాసం ఉన్నారు. 1977 ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయం చెందింది. దీంతో పార్టీ చీలిపోయే పలిస్థితులు వచ్చాయి. ఇందిరాగాంధీ వర్గానికి పార్టీ కార్యకలాపాలు నిర్వహించేందుకు ఓ భవనం కావాల్సి వచ్చింది. ఇందిరా గాంధీకి విధేయుడైన అప్పటి రాజ్యసభ ఎంపీ జి.వెంకటస్వామి అక్బర్ రోడ్‌లోని తన బంగ్లాను ఇచ్చారు. ఇక, అప్పటి నుంచి కాంగ్రెస్ తరపున ప్రధానమంత్రులైన రాజీవ్ గాంధీ, పి.వి.నరసింహారావు, మన్మోహన్ సింగ్ సహా అందరూ దీన్ని ప్రధాన కార్యాలయంగా కొనసాగించారు.

## పార్టీ మారలేదన్న ఎమ్మెల్యల కేసు

### స్పీకర్‌తో సహా ఏడుగురికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్,మార్చి25 : పార్టీ మారలేదన్న ఏడుగురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు తెలంగాణ హైకోర్టు బుధవారం నోటీసులు జారీ చేసింది. అలాగే తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌కు సైతం కోర్టు నోటీసులు ఇచ్చింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని ఇటీవల అసెంబ్లీ స్పీకర్ తీర్పు ఇచ్చారు. ఈ నేపథ్యంలో స్పీకర్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హైకోర్టును ఆశ్రయించారు. ఈ అంశంపై ఈ రోజు విచారణ జరిగింది. దాంతో కౌంటర్ దాఖలు చేయాలంటూ ఎమ్మెల్యేలతోపాటు స్పీకర్‌కు కోర్టు నోటీసులు జారీ చేసింది. నోటీసులు జారీ చేసిన జాబితాలో ఎమ్మెల్యేలు దానం నాగేందర్, అరికేపూడి గాంధీ, కాలే యాదయ్య, ప్రకాష్ గౌడ్, పోచారం శ్రీనివాసరెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, తెల్లం వెంకట్ రావు ఉన్నారు. ఏప్రిల్ 16వ తేదీ ఈ కేసు విచారణను వాయిదా వేసింది.


## పశ్చిమాసియాలో తగ్గని ఉద్రిక్తతలు

### కువైట్ విమానాశ్రయంపై ఇరాన్ దాడి

టెహ్రాన్,మార్చి25 : పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు రోజు రోజుకీ భీకర స్థాయికి చేరుకుంటున్నాయి. యుద్ధం మొదలైనప్పటికి నుంచి గల్ఫ్ దేశాలపై ఇరాన్ డ్రోన్‌లతో విరుచుకుపడుతోంది. తాజాగా కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయం లక్ష్యంగా డ్రోన్ దాడికి పాల్పడింది. డ్రోన్ ఓ ఆయిల్ ట్యాంకర్‌ను ఢీ కొట్టడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. బుధవారం తెల్లవారుజామున ఇరాన్‌కు చెందిన ఒక డ్రోన్లు కువైట్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని లక్ష్యంగా దాడులకు దిగాయి. అందులో ఒక డ్రోన్ విమానాశ్రయ పరిసరాల్లోకి దూసుకువచ్చి అక్కడే ఉన్న ఆయిల్ ట్యాంకర్ ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదం దాటికి ట్యాంకర్ పేలిపోవడంతో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. విమానాశ్రమం పరిసర ప్రాంతమంతా దట్టమైన పొగ కమ్మేయడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇరాన్ డ్రోన్లతో గల్ఫ్ దేశాలపై విరుచుకుపడుతోంది. తాజా దాడి కువైట్ భద్రతా వ్యవస్థలను అప్రమత్తం చేసింది. ఈ ఘటనపై కువైట్ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. మంటలు అదుపు చేసేందుకు రెస్క్యూ టీమ్ తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఇదిలా ఉంటే.. ఇరాన్ నుంచి వచ్చిన పలు డ్రోన్లు, క్షిపణులను తమ రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయని కువైట్ దళాలు పేర్కొన్నాయి. ఈ ఘటనలో ప్రాణ నష్టం జరగలేదని, కేవలం ఆస్తి నష్టం జరిగిందని కువైట్ సివిల్ ఏవియేషన్ అథారిటీ ధ్రువీకరించింది.

## కష్టే ఫలి అన్నదే ఆదర్శ సూత్రం !

తిరుమల : సోమరితనం మనిషిని మరింత నాశనం చేస్తుంది.ఎదుటి వారిని చూసి ఏడవడం కాదు. ఆ విధంగా పైకి ఎదగడానికి కష్టపడి పని చేయాలి. అటువంటి ఆలోచన మనసులో బలంగా ఉండాలి..మంచి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. అంతే తప్ప కష్టపడడానికి సిగ్గు పడితేజీవితం నాశనం అవుతుంది. సోమరితనం మనిషిని మరింత చెడ్డ వ్యక్తిగా మారుస్తుంది... జీవితంలొ గొప్ప వ్యక్తి గా ఎదగడానికి కృషి చేయాలి. అలాగే సంతోషంగా ఉండేవాడిలో కక్షలు, కార్పణ్యాలు కనిపించవు. ఇతర ఏ పట్టింపులూ ఉండవు. డబ్బుతో అధికారంతో ప్రమేయం ఉండదు. నిజానికి వారికి శత్రువులే ఉండరు. కొందరు ఎన్ని కష్టాలనైనా అవలీలగా భరిస్తారు. అనారోగ్యం సంసార బాధ్యతలు ఒంటరితనం లాంటి ఎన్నో సమస్యలను ఎదుర్కొంటూనే ఉల్లాసంగా కనిపిస్తారు. మంచి అలవాట్లు జీవనశైలి సైతం సంతోషాన్నిస్తాయి. భూటాన్ రాజ్యం ధనిక దేశం కాదు. కానీ, అక్కడి ప్రజలు ఎప్పుడూ ఆనందంగా ఉంటారట. చాలావరకు వారంతా వజ్రయాన బౌద్ధులు. తొలి శతాబ్దంలో భారతదేశం నుంచి భూటాన్ వెళ్ళిన బౌద్ధ సన్యాసి పద్మసంభవుడు వారికి గురువు. ఆనందంగా జీవించడంలో దైవత్వం ఇమిడి ఉందని ఆయన చెప్పిన సూత్రాన్ని అక్కడి ప్రజలు ఇప్పటికీ నమ్ముతారు. అలాంటి జీవన విధానాలనే పాటిస్తారు. ఆనంద స్థితిని అందుకోవడం కష్టతరం కాదని బుద్ధుడి తొలి శిష్యుల్లో ఒకడైన ఆనందుడు రాసిన దమ్మమార్గం చెబుతోంది. ఆనందం అంతరాంతరాళాల్లోంచి ఉబికి వచ్చేది. అనుభవానికి మరే ఇతర లౌకిక ఊరటకు సంబంధం లేదు.



ఆధ్యాత్మికం

# రైతు శ్రేయస్సే లక్ష్యంగా పని చేయాలి

## ● జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** వ్యవసాయ శాఖ అధికారులు రైతు శ్రేయస్సే లక్ష్యంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో వ్యవసాయ శాఖ పని తీరు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, జిల్లాలో 79% ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తి చేశామని, దీనిని 85% వరకు పూర్తి చేసే విధంగా ఎం.ఏ.ఓ, ఏ.ఈ.ఓ సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధికి సంబంధించి రైతుల ఈ-కేవైసి పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.రైతు బీమా పథకం అమలు పై వ్యవసాయ అధికారులు శ్రద్ద పెట్టి రైతు మరణించిన తర్వాత త్వరగా సంబంధిత దరఖాస్తు ఫార్వార్డ్ చేస్తూ కుటుంబానికి సహాయం అందేలా చూడాలని అన్నారు. రాబోయే వానాకాలం సీజన్‌కు అవసరమైన యూరియా పంపిణీ సజావుగా జరిగేందుకు పక్కా ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ తెలిపారు.వ్యవసాయ శాస్త్రవేత్తలతో కూడిన బృందాలు గ్రామాలలో పర్యటిస్తూ రైతు నేస్తం కార్యక్రమం ద్వారా రైతులకు నూతన సాగు పద్దతులు, భూ సారం పెంపుకు చర్యలు, పంట మార్పిడి విధానం పై అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామాలలో పర్యటన సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల వివరాలు తెలియజేయాలని అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ తరపున సంపూర్ణ ఏర్పాట్లు పక్కాగా చేయాలని అన్నారు. రబీ సీజన్ సంబంధించి ధాన్యం కొనుగోలు ప్రణాళిక ప్రకారం జరిగేలా చూడాలని అన్నారు. కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యం తీసుకుని వచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, మండల వ్యవసాయ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం

**● నియోజకవర్గంలో 3500 మందికి ఇందిరమ్మ ఇల్లు ● 400 మందికి పిల్ల స్థలాల మంజూరు ● మొట్ట మొదటిసారిగా 53 మంది ట్రాన్స్ జెండర్స్‌కు ఇళ్ల పట్టాలు ఇవ్వడం జరిగింది ● మిగిలిన వారికి వైయస్సార్ ఇళ్లపట్టాలిస్తాం ● అసెంబ్లీలో రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ స్పష్టీకరణ**



**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రామగుండం నియోజకవర్గంలో నిరుపేదలను గుర్తించి 3500 మందికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చామని ఎమ్మెల్యే ఎం ఎస్ రాజ్ ఠాకూర్ బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశాలలో ప్రస్తావించారు. అంతేకాకుండా 400 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చామని, వారికి ఇల్లు కట్టుకునేందుకు 5 లక్షలు ఇస్తామన్నారు. అయితే గత ప్రభుత్వం 10 ఏళ్లలో డబుల్ బెడ్ రూమ్ నిర్మాణాల పేరిట అనవసరపు ఖర్చులు చేసిందని, వాటిని నిరుపయోగంగా వదిలేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా 53 మంది ట్రాన్స్ జెండర్స్ కు ఇళ్లపట్టాలిచ్చామని పేర్కొన్నారు. అదేవిధంగా వారికి ఇప్పటికే వివిధ విభాగాలలో ఉపాధి కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అయితే వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి ఉన్న సమయంలో సింగరేణి ప్రాంతంలో జెన్కో, సింగరేణి భూములలో ఇల్లు కట్టుకున్న వారికి వైఎస్ఆర్ పట్టాలు 18 వేల వరకు ఇచ్చామని గుర్తు చేశారు. అదేవిధంగా మరో 7 వేల మందికి ఇచ్చేది ఉందని గుర్తు చేశారు. ఇంకా 11 వేల మంది నిరుపేదలను గుర్తించామని, వారికి ఖాళీ స్థలాలలో ఇందిరమ్మ ఇళ్ళను నిర్మించి ఇందిరమ్మ కాలనీగా ఏర్పాటు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

# కౌన్సిల్లో ప్రజా సమస్యల గొంతుకైనా సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య




**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రామగుండం నగరపాలక సంస్థ మొదటి కౌన్సిల్ సమావేశం బుధవారం రోజు జరగగా ఈ సమావేశంలో సిపిఐ ఫ్లోర్ లీడర్ 41 డివిజన్ కార్పొరేటర్ మార్కపురి సూర్య హాజరై ప్రజా సమస్యలను కౌన్సిల్లో సిపిఐ, ప్రజల పక్షాన వినిపించడం జరిగింది. 41వ డివిజన్లో ఉన్న నాలా పూడికతీత సంబంధించి ప్రజా పాలనలో భాగంగా రానందున తొందరలోనే 41 డివిజన్ సందర్శనగ వచ్చి నాలా పూడికతీతకు శానిటేషన్ విభాగాన్ని ఆదేశించాలని అలాగే డివిజన్లో ఉన్న యూజీడీల మరమ్మత్తుల కోసం అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈరోజు వరకు కార్మికులకు జీతాలు ఇంకా పడలేదని ప్రశ్నించగా ఈరోజు కార్మికులకు జీతాలు వేయడం జరిగిందని మేయర్ సమాధానం చెప్పడం జరిగింది. వాస్తవానికి 100 కోట్ల రూపాయల ఫండ్స్ ఉన్నాయి అభివృద్ధి పనులు జరుగుతున్నయని చెప్తున్న కనీసం కార్మికులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో మనం ఉన్నామని, అభివృద్ధికి నిధులు ఉన్నప్పటికీ కార్మికులకు డిపాజిట్ చేయాల్సిన ట్రాన్స్ఫర్ డ్యూటీ నిధులను అభివృద్ధికి మళ్ళించారని సూర్య దుయ్యబట్టారు. అలాగే పేద మధ్యతరగతి కుటుంబాలకు ఉపయోగపడే ఒక్క రూపాయి అంత్యక్రియలు ప్రారంభించాలని దాంట్లో డప్పు కూడా చేర్చాలని అలాగే వైకుంఠ రథాలు సాధ్యమైనంతవరకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని అన్నారు. ఈ ఈ ఎస్ ఎల్ కింద పనిచేస్తున్న ఆరుగురు ఎలక్ట్రీషియన్లను ఈ సంవత్సరం కూడా కొనసాగించాలని మధ్యతరగతి చెందిన కుటుంబాలు ఒకేసారి ఉద్యోగం తీసివేస్తే ఇబ్బందులకు గురవుతారని ఇప్పటికే గత నాలుగు నెలలుగా జీతాలు లేకపోయినా వారు సేవలందిస్తున్నందున వారిని కొనసాగించడానికి చర్యలు తీసుకోవాలని కోరగా మేయర్ కమిషనర్ కి ఆ విషయమై చూడాలని ఆదేశించారు. కార్పొరేషన్ ప్రాంతంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని దీనిపైన సీరియస్ యాక్షన్ ప్లాన్ తీసుకోవాలని సూర్య కోరారు. గత పాలకవర్గానికి సంబంధించి వాహనాల గోల్మాల్ మనం చూసామని కనీసం ఈ పాలకవర్గమైన పాత వాహనాలకు సంబంధించి ఒక అంచనాల కమిటీని వేసి వాటికి కావాల్సిన రిపేర్లు ఏమేమి ఉన్నాయి ఎన్ని నిధులు అయితే ఆ వాహనాలన్నీ అందుబాటులోకి వస్తాయి అని ఒక రిపోర్ట్ తయారు చేసి ప్రతి వాహనాన్ని మున్సిపల్ కార్పొరేషన్ కి అందుబాటులోకి తీసుకొచ్చే విధంగా మేయర్ చర్యలు తీసుకోవాలని కోరగా వారు కచ్చితంగా దీనిపైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే 1998 2004 తర్వాత గోదావరిఖని ప్రాంతంలో ఇంటి పనులకు సంబంధించి రి అసెస్మెంట్ జరగలేదు నూతన ఆదాయ వనరులు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం కార్పొరేషన్కు ఎంతైనా ఉన్నదని కనుక కార్పొరేషన్ ప్రాంతాన్ని మరోసారి అసెస్మెంట్ చేసి ఇంటి పన్నులు సడలించడంతోపాటు మేకల మండి లాంటి వ్యాపార కేంద్రాలను మున్సిపల్ తై బజార్ కిందికి తీసుకురావడం ద్వారా ఆదాయ వనరులు పెరిగే అవకాశం ఉంటుందని మేయర్ కి సూచన చేయడం జరిగింది.

# పుకార్లను నమ్మవద్దు

## అనవసరపు కొనుగోలు చేయవద్దు

### సమృద్ధిగా పేట్రోల్, డిజిల్ స్టాక్ - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** జిల్లాలో సమృద్ధిగా పేట్రోల్, డిజిల్ స్టాక్ ఉందని, ప్రజలు అనవసర భయాందోళనకు గురి కావద్దని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఒక ప్రకటనలో కోరారు.పెట్రోల్, డిజిల్ స్టాక్ పట్ల కొంతమంది అనవసరపు ప్రచారాలు చేయడం వల్ల ప్రజలలో కొంత భయాందోళన ఉందని, మన జిల్లా పరిధిలో పెట్రోల్ డీజిల్ కు ఎటువంటి కొరత లేదని, ప్రతి పెట్రోల్ బంకు దగ్గర అవసరమైన మేర స్టాక్ అందుబాటులో ఉందని అన్నారు. జిల్లాలో ఉన్న పెట్రోల్ డీజిల్ స్టాక్ పై ఎప్పుటికప్పుడు సంబంధిత ఐఓసిఎల్, బిపిసిఎల్, హెచ్ పి సిఎల్ ఏజెన్సీ లతో సమీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు భయాందోళనతో అధికంగా పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయడం వల్ల పెట్రోల్ బంకుల వద్ద స్టాకు త్వరగా ముగుస్తుందని కలెక్టర్ తెలిపారు.పెట్రోల్ బంకుల దగ్గర అవసరమైన మేర పెట్రోల్ డీజిల్ ఎప్పటికప్పుడు రీ ఫిల్ చేసేందుకు చర్యలు చేపట్టామని, జిల్లాకు సరఫరా రెగ్యులర్ గా జరుగుతుందని, మన రామగుండం లో ఉన్న ఐఓసిఎల్, హెచ్.పి.సి.ఎల్ డిపోల నుంచి పెట్రోల్ బంక్ లకు ఎప్పటికప్పుడు రీఫిల్ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఎవరు అనవసరపు భయాందోళనలకు గురికావద్దని, జిల్లాలు సమృద్ధిగా పెట్రోల్ డీజిల్ స్టాక్ ఉందని కలెక్టర్ ప్రకటనలో స్పష్టం చేశారు.

# వదంతులను నమ్మకండి పెట్రోల్, డీజీల్ నిల్వలు పుష్కలంగా ఉన్నాయి


### - పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం స్పష్టీకరణ



**కరీంనగర్ టౌన్, మార్చ్25(ది క్రైమ్ న్యూస్):** పశ్చిమ ఆసియాలో నెలకొన్న ప్రస్తుత యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ఇంధన కొరత ఏర్పడుతుందంటూ వస్తున్న వార్తలపై కరీంనగర్ పోలీస్ కమిషనర్ స్పందించారు. ఈ మేరకు ప్రజలకు పలు సూచనలు చేస్తూ ప్రకటన విడుదల చేశారు. కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని అన్ని పెట్రోల్ బంకుల్లో సరిపడినంత పెట్రోల్, డీజిల్ నిల్వలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇంధన సరఫరా వ్యవస్థ ఎప్పటిలాగే సక్రమంగా కొనసాగుతోంది. ఎక్కడా ఎటువంటి కొరత లేదు. సోషల్ మీడియాలో లేదా ఇతర మార్గాల్లో వచ్చే తప్పుడు సమాచారాన్ని, పుకార్లను నమ్మి ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. కొరత ఏర్పడుతుందనే భయంతో అవసరానికి మించి ఇంధనాన్ని కొనుగోలు చేయవద్దని, ఇళ్లలో నిల్వ చేయడం ప్రమాదకరమని కమిషనర్ హెచ్చరించారు.ప్రజలు శాంతంగా ఉండాలి. ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం ఇచ్చే అధికారిక సమాచారాన్ని మాత్రమే నమ్మాలి. అత్యవసర పరిస్థితులు ఏవీ లేవు, కావున ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా సీపీ హెచ్చరించారు .

# తన పిల్లల నుండి రక్షణ కోసం వినతి

### కరీంనగర్ జిల్లా కలెక్టర్‌కి ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించిన భాషా బేగం



**కరీంనగర్ టౌన్ ,మార్చ్25(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్లోని షాషాహేబ్ స్ట్రీట్, అమీర్నగర్ చెందిన పాషాబేగం భర్త సయ్యద్ మీర్ హసన్ అను నేను తమరికి విన్నవించువిషయం, నాకు ముగ్గురు మగ పిల్లలు, ఆరుగురు ఆడపిల్లలు అందరికి వివాహాలు జరిపించినాము. నా భర్త ఒక్క రెండవ కొడుకుకు కాకుండా మిగతా పిల్లలకు ఆస్తి పంచి ఇచ్చినాను. నా సొంత ఆస్తి అయిన షాషాహేబ్ స్ట్రీట్లో ఉన్న నా ఇంటిని నా రెండవ కుమారునికి గిఫ్ట్ రిజిష్టర్ చేశాను, కాని నా చిన్న కూతురు కాకుండా మిగతా ఏడుగురు పిల్లలు నాతో నా రెండవ కుమారుడైన సయ్యద్ సాదుల్లా హుస్సేన్ పై నేను చేసిన గిఫ్ట్ రిజిస్ట్రేషన్ రద్దు చేయమని నాచే కోర్టులో కేసు వేయించారు. చివరికి ఎవరికి లొంగకుండా నాకు నేనుగా ఆ కేసును వాపను తీసుకున్నాను కాని నా పిల్లలు మళ్ళీ అట్టి నా ఇల్లును వారసత్వ ఇల్లు అని మళ్ళీ నాపై నా రెండవ కొడుకు సాదుల్లా హుస్సేన్ పై చిన్న కూతురు ఆర్ట్రీన్ల పై పార్టీషన్ దావా వేసినారు. నేనుకేసు వాపస్ తీసుకున్న నుండి నా పెద్ద కుమారుడు నయ్యద్ అనదుల్లా హుస్సేన్, చిన్నకుమారుడు అర్షదుల్లా హుస్సేన్ మరియు ఐదురుగు కూతుర్లు రఫత్ సుల్తానా, ఫర్హత్ సుల్తానా, నుజత్ సుల్తానా, నిఖత్ సుల్తానా, ఇస్రత్ సుల్తానాలు నన్ను బెదిరిస్తున్నారు. బాదపెడుతున్నారు. తమ వైపు రావాలని, వారికి అనుకూలంగా బయానా, జవాబు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నారు. నన్ను నా రెండవ కొడుకు ఇంట్లో నుండి ఎత్తుకపోయే ప్రయత్నాలు చేయించుచున్నారు. నా వయస్సు 87 సంలు పైన తెలిపిన న్నా పిల్లలు నన్ను మానసికంగా బాధ పెడుతున్నారు. నాకు వారితో ప్రాణ భయం ఉంది. కావున దయామయులైన తమరు ఈ విషయం పరిశీలించి నన్ను కాపాడమని, నాకు తగు రక్షణ ఇవ్వాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించగలరని మనవి చేసుకున్నారు.

# నిరుద్యోగ యువత జాబ్ మేళాను వినియోగించుకోవాలి

### - టాస్క్ సెంటర్‌లో జరుగుతున్న జాబ్ మేళాను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష





**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** నిరుద్యోగ యువత జాబ్ మేళా ద్వారా వచ్చే ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని టాస్క్ సెంటర్‌లో జరుగుతున్న జాబ్ మేళాను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం అనేక చర్యలు చేపట్టిందని అన్నారు. టాస్క్ సెంటర్ ద్వారా అనేక నైపుణ్యం కోర్సులలో శిక్షణ అందిస్తూ వెంటనే మంచి ఎం.ఎన్.సి కంపెనీలలో ఉపాధి లభించేలా కూడా చర్యలు చేపట్టామని అన్నారు.టాస్క్ సెంటర్లో రిజిస్టర్ అయిన నిరుద్యోగులకు తప్పనిసరిగా ఉపాధి అందే విధంగా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. జాబ్ మేళా కార్యక్రమాలను టాస్క్ సెంటర్లో రెగ్యులర్ గా నిర్వహిస్తున్నామని అన్నారు. నేడు వివిధ కంపెనీల ద్వారా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, ఇందులో ఎంపికైన అభ్యర్థులకు శిక్షణతో పాటు ఉపాధి కూడా కల్పించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. జాబ్ మేళా వంటి కార్యక్రమాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట టాస్క్ సెంటర్ కౌసల్య, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సోమనపల్లిలో ఉపాధి హామీ కూలీలను కలిసిన మనాలి ఠాకూర్



**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు మనాలి ఠాకూర్ బుధవారం రోజు అంతర్గాం మండలం సోమనపల్లి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలోని ఆంజనేయస్వామి గుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడి పూజారులు, భక్తులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. గ్రామాభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తామని తెలిపారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని మభ్యపెట్టిన బిఆర్ఎస్

**● పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిన ఘనత మాది ● ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణ రావు..**

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని గతంలో బిఆర్ఎస్ మోసం చేస్తే, పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని, ఉపాధి కోసం ట్రాక్టర్లు వినియోగిస్తున్న కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు చెల్లించేందుకు మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణరావు అన్నారు. బుధవారం తెలంగాణ అసెంబ్లీలో ఆయన ఇందిరమ్మ ఇండ్ల అంశంపై ప్రసంగించారు. గతంలో 2004 నుండి 2014 వరకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదలకు, మధ్యతరగతి కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తామని చెప్పి 10 సంవత్సరాల పాటు ప్రజలను మభ్యపెట్టి మోసం చేసిందన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మొదటి విడతగా ఐదు లక్షల ఇళ్లను మంజూరి చేసిందన్నారు. ఇందులో నాలుగున్నర లక్షల ఇండ్లలో 25 శాతం పూర్తి కాగా, మిగతావి వివిధ దశల్లో ప్రగతి దశలో ఉన్నాయని చెప్పారు. అయితే బేస్మెంట్ పూర్తి చేసుకున్న కొంతమంది లబ్ధిదారులకు సాంకేతిక ఇబ్బందుల వల్ల బిల్లులు చెల్లింపులో ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని ఎల్3 కేటగిరిలో లబ్ధిదారులకు గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇందిరమ్మ ఇండ్లు కేవలం సిమెంటు డ్రా చేసుకున్న వారికి, ఉపాధి కోసం ట్రాక్టర్లు వాడుతున్న వారికి బిల్లులు రావడం లేదన్నారు. పేద



మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వీరికి ఆయా నిబంధనలను సవరించి బిల్లులు చెల్లించే విధంగా మినహాయింపు కల్పించాలని ఆయన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ ద్వారా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి మరియు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## సైన్స్ టాలెంట్ పరీక్షల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులు

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** యూనిఫైడ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నేషనల్ సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్ (2025--26) జనవరి నెలలో నిర్వహించబడింది. ఈ పరీక్షలో గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులు ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయిలో విశిష్ట ర్యాంకులు సాధించి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. ఫస్ట్ క్లాస్‌కు చెందిన టి. అభ్యన్ సాయి రాష్ట్ర స్థాయిలో 27వ ర్యాంక్ సాధించి గోల్డ్ మెడల్ మరియు సర్టిఫికెట్ అందుకున్నారు. అలాగే మనిశ్వర్ సాయి రాష్ట్ర స్థాయిలో 28వ ర్యాంక్ సాధించి గోల్డ్ మెడల్ మరియు సర్టిఫికెట్ పొందారు. అదేవిధంగా జి. ఆద్యశ్రీ, ఏ. సాయి నిహాల్, బి. జశ్వంత్ విద్యార్థులు గోల్డ్ మెడల్స్ మరియు సర్టిఫికెట్లు సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థి జశ్వంత్ మాట్లాడుతూ, ఇటువంటి పరీక్షలు నిర్వహించడం ఎంతో ఆనందకరమని, ఇవి తమలో విజ్ఞానాన్ని పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ విజయాల సందర్భంగా గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లంకి శ్రీనివాస్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందించేందుకు ఒలింపియాడ్స్ మరియు నేషనల్ లెవెల్ పరీక్షలు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఇటువంటి పరీక్షల ద్వారా విద్యార్థులు విశ్లేషణాత్మకంగా ఆలోచించడం నేర్చుకొని ప్రతిభావంతులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. గోల్డ్ మెడల్స్ విద్యార్థులకు గుర్తింపు మరియు ప్రోత్సాహాన్ని తీసుకువస్తాయని తెలిపారు. ఈ



సందర్భంగా చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, కరెస్పాండెంట్ రజినీ దేవీ , ప్రిన్సిపాల్ విజయ్ విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ మరియు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ పరీక్షను సమర్థవంతంగా నిర్వహించిన కోఆర్డినేటర్ ఉపాధ్యాయురాలు నవ్య గారికి పాఠశాల యాజమాన్యం ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. విద్యార్థుల ఈ విజయాలతో గాయత్రి విద్యానికేతన్ మరోసారి తన విద్యా ప్రతిభను చాటుకుంది.

# మున్సిపల్ కార్మికుల ప్రాణాలతో చెలగాటమా

**● విధి నిర్వహణలో ప్రమాదం లైన్ మెన్‌కు తీవ్ర గాయాలు ● కరీంనగర్ మాజీ మేయర్, రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ డిమాండ్**

**కరీంనగర్ టౌన్,మార్చ్ 25(ది క్రైమ్ న్యూస్):** విధి నిర్వహణలో భాగంగా మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ ఘాతానికి గురై తీవ్రంగా గాయపడిన మున్సిపల్ విద్యుత్ లైన్ మెన్ శివకృష్ణను కరీంనగర్ మాజీ మేయర్, రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ మాజీ చైర్మన్, 58వ డివిజన్ కార్పొరేటర్ సర్దార్ రవీందర్ సింగ్ పరామర్శించారు. జిల్లాలోని బొమ్మకల్ ప్రాంతానికి చెందిన శివకృష్ణ నేడు అల్గునూరు ప్రాంతంలో విధులు నిర్వహిస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న వెంటనే నగర మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలగని శ్రీనివాస్ తో కలిసి సర్దార్ రవీందర్ సింగ్ సురక్ష ఆసుపత్రికి చేరుకుని బాధితుడిని పరామర్శించారు. లైన్ మెన్ శివకృష్ణ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, అతనికి మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆసుపత్రి సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా సర్దార్ రవీందర్ సింగ్ గారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నారని, అయితే వారికి సరైన రక్షణ పరికరాలు, భద్రతా ప్రమాణాలు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా మంది లైన్ మెన్‌లు ఇన్సూరెన్స్ సౌకర్యం లేకుండా పనిచేయడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. “మున్సిపల్ కార్మికుల ప్రాణాలకు విలువ లేదా రోజూ ప్రాణాల మీదకు తెచ్చుకుని పనిచేస్తున్న లైన్ మెన్‌లకు కనీస భద్రతా పరికరాలు కూడా అందించకపోవడం తీవ్ర నిర్లక్ష్యం” అని విమర్శించారు. మున్సిపల్ కార్మికులందరికీ తక్షణమే నాణ్యమైన భద్రతా పరికరాలు (సేఫ్టీ కిట్లు, గ్లవ్స్, హెల్మెట్లు) అందించాలని, ప్రతి కార్మికుడికి సమగ్ర ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని సర్దార్ రవీందర్ సింగ్ గారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విధి




నిర్వహణలో ప్రమాదాలకు గురైన కార్మికులకు తక్షణ ఆర్థిక సహాయం అందించేందుకు ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని కూడా ఆయన కోరారు. పేద కుటుంబాలకు చెందిన ఈ కార్మికులు ప్రమాదాలకు గురైతే వారి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. గాయపడిన శివకృష్ణ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, బాధిత కుటుంబానికి అవసరమైన సహాయం అందిస్తానని సర్దార్ రవీందర్ సింగ్ హామీ ఇచ్చారు.

# అల్ఫోర్స్‌లో 9 తెలంగాణ బెటాలియన్ ఎన్‌సీసీ

**కరీంనగర్ ఆధ్వర్యంలో యువ ఆపద మిత్ర పథకం శిక్షణ శిబిరంలో భాగంగా విపత్తు నిర్వహణ అవగాహన కార్యక్రమం**

**కరీంనగర్ టౌన్, మార్చ్25(ది క్రైమ్ న్యూస్):** అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి మరియు 9 తెలంగాణ బెటాలియన్ ఎన్‌సీసీ కరీంనగర్ కమాండింగ్ ఆఫీసర్ కర్నల్ ఏ.కే. జయంత స్థానిక కొత్తపల్లి అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాల వేదికగా నిర్వహించిన యువ ఆపద మిత్ర పథకం శిక్షణ శిబిరంలో పాల్గొని కెడెట్లను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విపత్తు నిర్వహణ చాలా కీలకమైన అంశమని, ప్రతి ఒక్కరికీ దీనిపై సమగ్ర అవగాహన ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విపత్తులు అనేక రకాలుగా సంభవిస్తాయని, వాటి నియంత్రణకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని సూచించారు. కమాండింగ్ ఆఫీసర్ కర్నల్ ఏ.కే. జయంత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విపత్తు నిర్వహణ పద్ధతులను తెలుసుకొని, విపత్తు సమయంలో మానవాళికి చేయూతనివ్వాలని తెలిపారు. అవసరమైన వనరులను సమకూర్చి బాధితులకు అండగా నిలవాలని సూచించారు. విపత్తు నిర్వహణపై అవగాహన కలిగిన వారు ఇతరులకు కూడా తెలియజేసి, సమాజంలో చైతన్యం తీసుకురావాలని, తద్వారా ప్రజలు విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొని తమ కార్యకలాపాలను సక్రమంగా నిర్వహిస్తూ జాతీయ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రయోగాత్మకంగా ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా కెడెట్లు నిర్వహించిన విపత్తు నిర్వహణ కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక అధికారి రాజ్‌కుమార్ , ఏఎస్ఐ మహేందర్ , డీవీఆర్ ఆపరేటర్ లక్ష్మారెడ్డి ఇతరులు పాల్గొన్నారు. అగ్నిమాపక సిబ్బంది విపత్తు సమయంలో చేపట్టాల్సిన చర్యలను విన్యాసాల ద్వారా



ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. చివరగా, విపత్తు సమయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ప్రతిజ్ఞ చేయించారు.



## సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడిగా బందు క్రాంతి

**భూపాలపల్లి, మార్చి -25:(ది క్రైమ్ న్యూస్):** సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శిమారపల్లి మల్లేష్ మాట్లాడుతూ భూపాలపల్లి జిల్లా కమిటీ సభ్యుడిగా బంధు క్రాంతి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్కూరీ శ్రీకాంత్, బందు సుజాత, స్వాతితోపాటు తదితరులు పాల్గొన్నారు.



## కొత్తగా ఎస్ బి ఐ బ్యాంక్‌ను ఓపెన్ చేసిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాలపల్లి, మార్చి -25:(ది క్రైమ్ న్యూస్):** బ్యాంకింగ్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో మంజూరు నగర్‌లో కొత్తగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్ ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం మంజూరు నగర్‌లో ఎస్బీఐ బ్రాంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో భాగంగా గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ సేవల విస్తరణ అత్యంత అవసరమని తెలిపారు. ఈ కొత్త బ్రాంచ్ ప్రారంభం ద్వారా స్థానిక ప్రజలకు సులభంగా బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి వస్తాయని, ముఖ్యంగా రైతులు, చిన్న వ్యాపారులు మరియు మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అలాగే, డిజిటల్ బ్యాంకింగ్ సేవలను ప్రజలు విస్తృతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఆధునిక సాంకేతికతతో కూడిన సేవలు అందించడం ద్వారా సమయం ఆదా అవుతుందని, పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. సేవల్లో ప్రజల మన్ననలు పొందాలని ఈ బ్రాంచ్‌లో సేవింగ్స్ ఖాతాలు, రుణ సదుపాయాలు, డిజిటల్ లావాదేవీలు, ఏటీఎం సేవలు వంటి అన్ని రకాల బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రజల ఆర్థిక అవసరాలను తీర్చడంలో ఈ బ్రాంచ్ కీలక పాత్ర పోషిస్తుందని అయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్డియం తిరుపతి, డిజిఎం గన్ శ్యాం సోలంకి, ఆర్ ఎం సుబ్బారావు, సింగరేణి జీఎం రాజేశ్వర రెడ్డి, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల భర్తీకి వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహణ

**- జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శ్రీధర్**

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్య పోస్టుల భర్తీకి మార్చి 28న వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని, ఆసక్తి అర్హత గల అభ్యర్థులు హాజరుకావాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో గల తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న గైనకాలజీ, ఆప్తామాలజిస్ట్, రేడియాలజీ, ఆర్థోపెడిషియన్, సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ (ఎంబిబిఎస్) పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు మార్చి 28న జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆసక్తి గల వైద్యులు తమ యొక్క దరఖాస్తు



బయోడేటా తో పాటు అన్ని విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్ల తో పాటు జిరాక్స్ ప్రతులు ఒక సెట్ తో హాజరు కావాలని, సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులకు నెలకు లక్ష రూపాయలు, సివిల్ అసిస్టెంట్ సర్జన్లకు నెలకు 52,351 రూపాయల వేతనం ఉంటుందని, ఇతర వివరాలకు 8499061999,9492457809 నెంబర్ నందు సంప్రదించాలని జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రకటనలో పేర్కొన్నారు.

## కరీంనగర్‌లో డాల్ఫిన్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ హాస్పిటల్ గ్రాండ్ ఓపెనింగ్

**- ముఖ్య అతిథిగా సినీ నటి మెహ్రీన్ పిర్జాదా**




**కరీంనగర్ టౌన్, మార్చ్ 25(ది క్రైమ్ న్యూస్):** స్థానిక ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో, అత్యాధునిక వసతులతో ఏర్పాటు చేసిన డాల్ఫిన్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ హాస్పిటల్ బుధవారం రోజు అత్యంత వైభవంగా ప్రారంభించబడింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటి మెహ్రీన్ పిర్జాదా ముఖ్య అతిథిగా విచ్చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ఆసుపత్రిని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మెహ్రీన్ పిర్జాదా మాట్లాడుతూ: “మహిళలు, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించే ఇలాంటి మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి కరీంనగర్‌లో ప్రారంభం కావడం సంతోషకరం. అత్యాధునిక సాంకేతికత నిపుణులైన వైద్యులు ఇక్కడ అందుబాటులో ఉండటం స్థానికులకు ఎంతో మేలు చేకూరుస్తుంది” అని పేర్కొన్నారు. ఆసుపత్రి యాజమాన్యం ప్రతినిధులు మాట్లాడుతూ: తల్లి, బిడ్డల సంరక్షణే ధ్యేయంగా ఈ ఆసుపత్రిని తీర్చిదిద్దినట్లు తెలిపారు. గైనకాలజీ, పీడియాట్రిక్స్, నియోనాటాలజీ (నవజాత శిశువుల సంరక్షణ) వంటి విభాగాల్లో 24 గంటల అత్యవసర సేవలు ఇక్కడ లభిస్తాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రముఖ వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# మెడికల్ బోర్డు పైన విజిలెన్స్ కేసు

● ఏసిబి కేసులు పెట్టిన రాష్ట ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నాం ● ఓపెన్ కాస్ట్ ల్లో జరిగిన టెండర్ల అవినీతి పైన విజిలెన్స్, ఏసిబి కేసులు ఎందుకు పెట్టరు ● మార్చి 24న అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మెడికల్ బోర్డు పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం ● సేవ్ సింగరేణి పోరు జాత గేట్ మీటింగ్ లలో ఏఐటియుసి నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, కోరిమి రాజ్ కుమార్




**గోదావరిఖని ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఓపెన్ కాస్టుల్లో జరుగుతున్న అవినీతి, టెండర్లలో ఉన్న అక్రమాలపై చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం, యాజమాన్యం వాటిని పక్కనపెట్టి, ఎలాంటి విజిలెన్స్ కేసులు గాని, ఏసిబి కేసులు గాని బాధ్యులపై నమోదు చేయకుండా నిర్లక్ష్యం చేస్తూ వారికి వత్తాసు పలుకుతున్న, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం, కష్టపడి పని చేసి బొగ్గు తీసిన కార్మికుల పట్ల పక్షపాత ధోరణి అవలంబించడం తీవ్రంగా ఖండిస్తున్నామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ లు పేర్కొన్నారు. బుధవారం సింగరేణి ఆర్జీ త్రీ ఏరియా లోని వివిధ గనులు, డిపార్ట్మెంట్ ల పై సేవ్ సింగరేణి పోరు జాత కార్యక్రమం లో భాగంగా జరిగిన గేట్ మీటింగ్ లలో వారు పాల్గొని మాట్లాడుతూ సింగరేణి లో కార్మికులు అనారోగ్య కారణాల చేత ఏర్పాటు చేసిన మెడికల్ బోర్డుపై గతంలో అవినీతి జరిగిందనే కారణంతో ప్రస్తుతం విజిలెన్స్, ఏసీబీ కేసుల పేరుతో మెడికల్ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయడం దుర్మార్గమైన చర్య అని వారు పేర్కొన్నారు. గతంలో అవినీతి జరిగి ఉంటే, అందుకు బాధ్యులైన అధికారులు ఎవరైతే ఉన్నారో వారిపై కఠిన చర్యలు తీసుకోకుండా కష్టపడి బొగ్గు తీసి దేశానికి వెలుగు నిచ్చే కార్మికులపై ఈ విధంగా మెడికల్ బోర్డును నిలిపివేసి అన్యాయం చేయడం సరికాదని వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. మార్చి 24 న అసెంబ్లీలో మెడికల్ బోర్డు విషయమై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలను గుర్తింపు సంఘం ఏఐటియుసి తీవ్రంగా ఖండిస్తుందని వారు పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూల దృక్పథంతో వ్యవహరించాల్సిన సమయంలో ఇలాంటి కార్మిక వ్యతిరేక వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని వారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మూడు సార్లు మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి నేడు అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి పై, కార్మికుల పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడితుందని వారు విమర్శించారు. కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని వెంటనే మెడికల్ బోర్డును పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని, యాజమాన్యాన్ని వారు డిమాండ్ చేశారు. లేకుంటే యాజమాన్యం, ప్రభుత్వం పై ఏఐటియుసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు.

# అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో ఘనంగా ముందస్తు శ్రీరామనవమి వేడుకలు





**కరీంనగర్ టౌన్,మార్చ్25(ది క్రైమ్ న్యూస్):** శ్రీరాముడు ధర్మానికి ప్రతీక అని మరియు ప్రేమ ఆప్యాయతకు గొప్ప నిర్వచనమని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లి లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడేలా ఏర్పాటు చేసినటువంటి ముందస్తు శ్రీరామనవమి వేడుకలకు ఆత్మీయ అతిథిగా హాజరై వారు మాట్లాడారు.ప్రారంభానికి ముందు వారు ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి శ్రీరాముని చిత్రపటానికి పూజా కార్యక్రమాన్ని నిర్వహించి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని శోభయమానంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీరాముడిని కొలిచిన వారికి కష్టాలు తొలగిపోతాయని మరియు విజయాలు కలుగుతాయని తెలిపారు. శ్రీరాముని గురించి తెలిపేటువంటి రామాయణ గ్రంధాన్ని పఠించినట్లయితే ఉజ్వలమైన భవిష్యత్తు లభిస్తుందని అభిప్రాయపడ్డారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని భారత దేశంలో గొప్ప పండుగగా నిర్వహించు కుంటారని ప్రధానంగా మన దేశ రాజధాని లోని ఢిల్లీలో గల రాం లీల మైదానంలో చాలా గొప్పగా ఈ వేడుకను వేడుకగా నిర్వహించడం భారత దేశ ప్రజలకు గొప్ప అనుభూతినిస్తుందని చెప్పారు. భారతదేశ సంస్కృతి ఉట్టిపడేలా ఈ వేడుకలను చాలా ఉత్సాహంతో భక్తిశ్రద్ధలతో యావత్ భారతదేశం లోనే కాకుండా వివిధ దేశాలలో సైతం శ్రీరామనవమిని చాలా పవిత్రమైన పండుగగా జరుపుకుంటానని చెప్పారు. శ్రీరామ నవమిని పరిష్కరించుకుని విద్యార్థులు ప్రదర్శించినటువంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రధానంగా "శ్రీరామ చరిత్ర" ను లవకుశల వేషధారణలో విద్యార్థులు చాలా చక్కగా వర్ణించారు.రామాయణంలోని ప్రధాన ఘట్టాలు తెలిపే సమయాన విద్యార్థులందరూ జైశ్రీరామ్ జైశ్రీరామ్ నినాదాలు చేసి పండుగ వాతావరణాన్ని రెట్టింపు చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ







**భూపాలపల్లి/కాటారం/మార్చి -25: (ది క్రైమ్ న్యూస్):** కాటారం మండలం, మేడిపల్లి గ్రామంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను బుధవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణ, తరగతి గదులు, విద్యార్థుల వసతి గృహం మరియు భోజన శాలను సమగ్రంగా పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు, మౌలిక వసతులు, పరిశుభ్రత, ఆహార నాణ్యత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థుల హాజరు శాతం పెంపు, బోధన నాణ్యత మెరుగుదల, వసతి గృహాల్లో శుభ్రత పాటించడం, పోషకాహారం సమయానికి అందించడం వంటి విషయాల్లో సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. పాఠశాలల్లో గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని, చిన్న చిన్న సమస్యలను వెంటనే పరిష్కరించేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఎంపిడిఓ బాబు, నాయబ్ తహసీల్దార్ రామ్మోహన్, పంచాయతీ కార్యదర్శి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి కుంచాల సునీత



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం కోసం ఈ నెల 28న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ ను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి , జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కుంచాల సునీత కోరారు. బుధవారం తన ఛాంబర్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ భవానితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులు సత్వర న్యాయం పొందవచ్చని తెలిపారు. లోక్ అదాలత్ సేవలు ప్రజలకు పూర్తిగా ఉచితంగా అందుతాయని పేర్కొన్నారు. ఈ నెల 28న న్యాయస్థాన ప్రాంగణంలో లోక్అదాలత్ జరుగుతుందని తెలిపారు. రాజీ పద్ధతిలో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, అన్నిరకాల సివిల్ కేసులు జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని వివరించారు.లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకుని తమ సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవాలని సూచించారు. రాజీ కుదిరితే, చెల్లించిన కోర్టు రుసుము, కోర్టు ఫీజు తిరిగి చెల్లిస్తామని పేర్కొన్నారు. క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదా కేసులు, ఆస్తి విభజన కేసులు, కుటుంబపరమైన కేసులు, వైవాహిక జీవితం సంబంధిత కేసులు, బ్యాంకు రికవరీ, చెక్ బౌన్స్ కేసులు,రోడ్డు ప్రమాదాలు ఇతర కేసులపై సంబంధించిన కేసులను ఇరుపక్షాల సమ్మతితో రాజీతో పరిష్కారమయ్యే కేసులన్నింటినీ పరిష్కరిస్తామని తెలిపారు. రాజీ మార్గం రాజమార్గమని, చిన్న చిన్న కేసులతో కక్షలు పెంచుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, డబ్బులను వృథా చేసుకోవద్దని సూచించారు. ప్రజలు తమ సమస్యలను జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ద్వారా సంప్రదించవచ్చని తెలిపారు.

## తిమ్మాపూర్‌లో బిఎల్‌ఓలకు శిక్షణా తరగతులు



**తిమ్మాపూర్, మార్చి25(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో స్థానిక తహసిల్దార్ ఆధ్వర్యంలో బిఎల్ఓలు, బిఎల్ఓ సూపర్వైజర్లకు బుధవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. మండలంలోని బిఎల్ఓలందరూ విధినిర్వహణలో తీసుకోవలసిన జాగ్రత్తలు,ఓటర్ నమోదు ప్రక్రియలో దరఖాస్తుల సేకరణ, జాబితా సవరణలపై మాస్టర్ ట్రైనర్ అవగాహన కల్పించారు. తహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, బిఎల్ఓలు, బిఎల్ఓ సూపర్వైజర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన జిల్లా అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్





**ధర్మపురి, మార్చి 25, (ది క్రైమ్ న్యూస్):** జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లను జిల్లా అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్. పరిశీలించారు. బుధవారం ధర్మపురి మండలంలో నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించి, పనులను నాణ్యతతో పాటు వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆయన సూచనలు చేశారు. అలాగే లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ పనులు కొనసాగించాలని ఆదేశించారు. తదుపరి ధర్మపురి ఎం.పి.డి.ఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆస్తి పన్ను వసూళ్లు మరియు గ్రామాలలో జరుగుతున్న ఇంజనీరింగ్ పనులపై సమీక్ష నిర్వహించారు. ఆస్తి పన్ను వసూళ్లలో శాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, పెండింగ్ బకాయిలను వెంటనే వసూలు చేయాలని సూచించారు. ఇంజనీరింగ్ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా సమయానికి పూర్తి చేయాలని, గ్రామీణాభివృద్ధికి సంబంధించిన పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని అధికారులను ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో రవీందర్, సంబంధిత శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## రోహిత్ వేముల చట్టాన్ని అడ్డుకుంటాం

- రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంధి తిరుపతి రెడ్డి



**కరీంనగర్ టౌన్, మార్చ్ 25(ది క్రైమ్ న్యూస్):** అగ్రవర్ణ విద్యార్థులను వేదింపులకు గురి చేసి, మానసికంగా కుంగతీయలని విద్య సంస్థలలో రోహిత్ వేముల చట్టాన్ని అడ్డుకొని తీరుతామని రెడ్డి ఐక్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంధి తిరుపతి రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. రోహిత్ వేముల చట్టం తీసుకువచ్చి అగ్రవర్ణ విద్యార్థులను తెలంగాణ రాష్ట్రంలో చదవకుండా చెయ్యాలనేది ఒక కుట్రపూర్తంగా ప్రభుత్వం ఆడుతున్న నాటకం అని సంధి తిరుపతి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే తరగతి గదిలో ఎస్సీ ఎస్టీ బీసీ ఓసి విద్యార్థులు ఇప్పటివరకు చదువుకోవడం జరిగింది, కానీ రోహిత్ వేముల చట్టం వచ్చిన తర్వాత అగ్రవర్ణ విద్యార్థులు క్లాస్ రూమ్ లో ఒకే బెంచ్ లో కూర్చోవాలన్నా భయభ్రాంతులకు గురి అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ చట్టం ఎక్కువగా అగ్రవర్ణ విద్యార్థులపై అక్రమంగా కేసులు పెట్టి అగ్రవర్ణ విద్యార్థులను చదువుకు దూరం చేసే ప్రభావం చూపుతుంది. రోహిత్ వేముల చట్టం ద్వారా అగ్రవర్ణం విద్యార్థులను బ్లాక్ మెయిల్ చేసి లేనిపోని కేసుల్లో ఇరికించి చదవకుండా చేయాలనేదే కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర అని ఆయన అన్నారు. ముఖ్యంగా అగ్రవర్ణ అమ్మాయిలను టార్గెట్ గా చేసి వారికి నచ్చినట్టుగా ప్రవర్తించి బ్లాక్ మెయిల్ ద్వారా లొంగదీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ చట్టం ప్రభుత్వం అగ్రవర్ణాలపై ఒక పథకం ప్రకారం కుట్రలు పన్నుతుంది అగ్రవర్ణ ప్రజలను బతకకుండా చేస్తుందని అన్నారు. తాజాగా ఈ చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేసేందుకు విధి విధానాలను రూపకల్పన క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. రెడ్డి సామాజిక వర్గం అనుకున్నది ఒక్కటి అయ్యింది ఒక్కటి, కక్షగట్టి రెడ్డి సామాజిక వర్గాన్ని అనుగదొక్కడం జరుగుతుంది. ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసిన ఈ ప్రభుత్వాన్ని వాళ్ళు తీసుకునే నిర్ణయాలను చట్టాల ద్వారానే ఎదుర్కొంటాం అని సంధి తిరుపతి రెడ్డి అన్నారు.

## అలుగునూరు కోతులను జన్నారంకు తరలించిన కార్పోరేటర్ కాల్వ మల్లేశం



**తిమ్మాపూర్, మార్చి25(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగునూరులో బుదవారం మున్సిపల్ అధికారులు కోతుల పట్టివేత కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక కార్పొరేటర్ కాల్వ మల్లేశం కోరిక మేరకు సుమారు 500 కోతులను పట్టి జన్నారం అటవీ ప్రాంతంలో వదిలేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కోతులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు కొంత ఉపశమనం కలిగిందని, విడతల వారీగా కోతుల పట్టివేత కొనసాగుతుందని కాల్వ మల్లేశం హామీ ఇచ్చారు. కోతుల సమస్యపై కార్పొరేటర్ కాల్వ మల్లేశం స్పందించడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. స్థానికులు సల్ల మహేందర్, తొర్తి ప్రశాంత్, సర్వేశ్, ముత్తమల్ల నిఖిల్ తదితరులు కోతుల పట్టివేతలో పాల్గొన్నారు.

# పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 6,200 మంది

# గిరిజనులకు ఉచిత వైద్య సేవలు

## ● అభినందించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ





**భూపాలపల్లి, మార్చి -25:(ది క్రైమ్ న్యూస్):** మారుమూల ప్రాంతాల ప్రజల ఆరోగ్య పరిరక్షణకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరం అభినందనీయమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ నేతృత్వంలో బుధవారం అడవి ముత్తారం పోలీస్ స్టేషన్ పరిధిలోని పెగడపల్లి ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన మెగా మెడికల్ క్యాంప్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ మెగా వైద్య శిబిరం ద్వారా సుమారు 6200 మంది గిరిజనులకు ఉచిత వైద్య సేవలు అందించడం ఎంతో గొప్ప విషయమన్నారు. ఇలాంటి శిబిరాల ద్వారా ప్రజల ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి తక్షణ చికిత్స అందించడం వల్ల ప్రాణాంతక వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ఆరోగ్యంపై అవగాహన పెంపుతో పాటు గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు చేరువ కావడం ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యమని పేర్కొన్నారు. మెగా ఉచిత వైద్య శిబిరం విజయవంతం కావడం పట్ల జిల్లా కలెక్టర్ పోలీస్ శాఖను అభినందించారు. ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో ఆరోగ్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం పోలీస్ శాఖ సామాజిక బాధ్యతలో భాగమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ...ప్రగతి ప్రణాళికలో పోలీస్ శాఖ ద్వారా (ఎరైవ్ .. ఎలైవ్) "ూతీతీఱవ-ూశ్రీఱవ" కార్యక్రమంలో భాగంగా డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు కూడా నిర్వహించినట్లు తెలి పారు. భవిష్యత్తులో ఇలాంటి మెగా వైద్య శిభిరాలను నిర్వహించి ప్రజలకు ఉచిత వైద్య సేవలు కొనసాగిస్తామని ఆయన స్పష్టంచేశారు. ఈ మెగా క్యాంపులో మొత్తం 34 మంది నిపుణులైన వైద్యులు 9 విభాగాల్లో సేవలు అందించారని తెలిపారు. వాటిలో గుండె, మూత్రపిండాలు, జనరల్ మెడిసిన్, స్త్రీల వ్యాధులు, కంటి, చర్మ, చెవి-ముక్కు-గొంతు, ఎముకలు మరియు కీళ్ల వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారని తెలిపారు. అదనంగా రక్తపరీక్షలు, 2డి ఎకో, ఈసిజి వంటి ముఖ్య పరీక్షలను ఉచితంగా చేసి అవసరమైన మందులను పంపిణీ చేశామని తెలిపారు. ఈ ఉచిత మెగా వైద్య శిభిరం కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్ (హైదరాబాద్), ఏకశిల హాస్పిటల్ (హనుమకొండ), సిగ్మా హాస్పిటల్, కూరపాటి హాస్పిటల్స్, శరత్ లేజర్ ఐ కేర్ (హనుమకొండ), భూపాలపల్లి ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌కు చెందిన వైద్యులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ నవీన్ రెడ్డి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు ఎస్పీ నరేష్ కుమార్, డిప్యూటీ డిఎంహెచ్ఓ శ్రీదేవి, కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

**● గ్రామాలలో 4 రోజుల పాటు ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహణ ● ప్రతి మండలంలో కనీసం 100 ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశానికి సిద్ధం చేయాలి ● పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ పై సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఏప్రిల్ 2న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభ నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, రాజీవ్ రహదారి పక్కన ఉన్న గ్రామాలలో 4 రోజుల పాటు ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించి ప్లాస్టిక్, చెత్త ఎక్కడ ఉండకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల లోని ఖాళీ స్థలాలలో, రోడ్ల పై ఎవరు చెత్త వేయకుండా చూడాలని అన్నారు. గ్రామపంచాయతీ పరిధిలో పెండింగ్ ఫైల్స్ డిస్పోజ్ చేయాలని అన్నారు. ఏప్రిల్ 2న జరిగే గ్రామ సభ లో కనీసం 200 మంది గ్రామస్థులు పాల్గొనేలా చూడాలని, గత 2 సంవత్సరాల కాలంలో చేపట్టిన పనులు, ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల వివరాలు తెలియజేయాలని అన్నారు.గ్రామంలో రైతు భరోసా, రైతు రుణమాఫీ, నూతన రేషన్ కార్డులు ,ఇందిరమ్మ ఇండ్లు, గృహ జ్యోతి వంటి పథకాల వల్ల ఎంతమంది లబ్ధి జరిగిందో స్పష్టంగా ప్రజలకు తెలియాలని, గ్రామ పంచాయతీకి వచ్చిన ఆర్థిక సంఘం నిధులు వాటిని వినియోగిస్తున్న తీరు వివరించాలని అన్నారు. గ్రామసభ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొనేలా చూడాలని అన్నారు.ఏప్రిల్ 16 మండల స్థాయిలో జరిగే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో నూతనంగా మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ పంపిణీ, స్వశక్తి మహిళా సంఘాల బ్యాంకు లింకేజీ రుణాల పంపిణీ చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని, మండల స్థాయి కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే హాజరయ్యే విధంగా ఆహ్వానించాలని అన్నారు.ఏప్రిల్ నెలాఖరు నాటికి ప్రతి మండలం నుంచి కనీసం 100 ఇందిరమ్మ ఇండ్లు గృహ ప్రవేశాలు జరిగేలా చూడాలని అన్నారు. నరేగా పనులకు సంబంధించి మెటీరియల్ కాంపోనెంట్ 14 కోట్ల నిధులు అందుబాటులో ఉన్నాయని, క్షేత్రస్థాయిలో పనులు పూర్తి చేసే బిల్లులు ఎవరు ముందు సమర్పిస్తారో వాటిని వెంటనే చెల్లించడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామాలలో పన్ను వసూలు పై ప్రత్యేక శ్రద్ధ వహించి పన్ను వసూలు లక్ష్యాలను 100% చేరుకోవాలని అన్నారు. ప్రతి వారం ప్రభుత్వ విద్యాసంస్థలు గురుకులాలను సందర్శిస్తూ అక్కడ భోజన నాణ్యతను చెక్ చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జెడ్పి సీఈఓ నరేందర్ జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య, డి ఆర్ డి ఓ కాళిందిని, పిడి హౌసింగ్ రాజేశ్వర్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# దివంగత ఎస్సై చంద్రశేఖర్‌కు కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో ఘన నివాళి






**కరీంనగర్ టౌన్, మార్చ్25(ది క్రైమ్ న్యూస్):** ఇటీవల అకాల మరణం చెందిన సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్సై చంద్రశేఖర్‌కి నివాళిగా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం పాల్గొని, ఇతర పోలీస్ అధికారులతో కలిసి దివంగత ఎస్సైకి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా కమిషనరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పోలీస్ అధికారులందరూ కలిసి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. విధి నిర్వహణలో ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఎస్సై చంద్రశేఖర్ మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుతూ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలువురు ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మానకొండూర్ నూతన కార్యదర్శిగా ఈరాల వేణు



**మానకొండూర్, మార్చి25(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా ఈరాల వేణు బుదవారం బాధ్యతలు చేపట్టారు. అధికార పార్టీ నాయకుల ఆగ్రహానికి గురైన గత పంచాయతీ కార్యదర్శి జున్నుతుల రేవంత్ రెడ్డిపై బదిలీ వేటు పడిన సంఘటన తెలిసిందే. ఈ నేపథ్యంలో చాలారోజుల తరువాత పంచాయతీ నూతన కార్యదర్శిగా ఈరాల వేణును నియమిస్తూ ఉన్నదాదికారులు ఉత్తర్వులు జారీ చేశారు.దీంతో ఈరాల వేణు బుధవారం కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు.

## ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు గడువు పొడిగింపు



**భూపాలపల్లి, మార్చి - 25:(ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ షెడ్యూల్డ్ కులాల సహకార అభివృద్ధి సంఘం లిమిటెడ్, హైదరాబాద్ ద్వారా 2025- 2026 ఎస్సీ యాక్షన్ ప్లాన్ కింద జిల్లాలోని అర్హులైన అభ్యర్థుల నుండి వివిధ ఆర్థిక సహాయ పథకాలకు దరఖాస్తు చివరి తేదీ 24.03.2026 నుండి తేదీ 02.04.2026 వరకు పొడిగిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంఘం చైర్మన్ జయశంకర్ భూపాలపల్లి గారు ఒక ప్రకటనలో తెలిపారు. తేదీ 24.03.2026 వరకు జిల్లాలో 671 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. బ్యాంకు అనుసంధానంతో రవాణా రంగం కింద ఈవీ టూ వీలర్ మరియు ఈవీ త్రీ వీలర్ వాహనాలకు, అలాగే వ్యవసాయ పథకాల కింద సోలార్ యూనివర్సల్ పంపు కంట్రోల్ యూనిట్లకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ పథకాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయస్సు వ్యవసాయతర పథకాలకు 21 నుండి 50 ఏళ్ల వరకు, వ్యవసాయ ఆధారిత పథకాలకు 21 నుండి 60 ఏళ్లలోపు ఉండాలి. వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1,50,000 మరియు పట్టణ ప్రాంతాల వారికి రూ.2,00,000 మించకూడదు. సోలార్ పంప్ సెట్ల కోసం కనీసం రెండు ఎకరాల భూమి కలిగి ఉండాలి. ఈవీ ద్విచక్ర వాహనాల కోసం జొమాటో, స్విగ్గి, రాపిడో వంటి సంస్థల్లో పనిచేసే గిగ్ కార్మికులకు ప్రాధాన్యత ఉంటుందని, వారు సంబంధిత సర్టిఫికెట్లు సమర్పించాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, మీసేవ ద్వారా పొందిన కుల మరియు ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్, పాస్ పోర్ట్ సైజ్ ఫోటో మరియు దివ్యాంగులు అయితే సదరం సర్టిఫికెట్లతో 02.04.2026 వరకు ఆన్లైన్ వెబ్సైట్ ద్వారా లేదా మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని అన్ని మండలాలు మరియు మునిసిపాలిటీ పరిధిలోని ఎస్సి అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## మానకొండూర్ లో బిఎల్ఓలకు శిక్షణా కార్యక్రమం



**మానకొండూర్, మార్చి 25(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలోని రైతు వేదికలో బిఎల్ఓలు, బిఎల్ఓ సూపర్వైజర్లకు ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం ఏర్పాటు చేశారు.ఓటరు జాబితా సవరణల ప్రక్రియ, డోర్ టు డోర్ వెరిఫికేషన్, సరైన పత్రాల వినియోగం, డేటా నమోదు విధానాలపై మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ అవగాహన కల్పించారు. తహసిల్దార్ నరేందర్, నాయబ్ తహసిల్దార్ (ఎన్నికల) భావన, సీనియర్ అసిస్టెంట్ సమీన, గిర్దావర్ ప్రీతీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఇళ్ళంతకుంట రాములోరికి పట్టువస్త్రాలు ముత్యాల తలంబ్రాలు సమర్పించిన ధర్మపురి ఆలయ ఇఓ శ్రీనివాస్





**ధర్మపురి, మార్చి 25 (ది క్రైమ్ న్యూస్):** శ్రీరామ నవమి కల్యాణోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం వలే కరీంనగర్ జిల్లాలో అపర భద్రాద్రి గా పేరు గాంచిన ఇళ్ళంతకుంట రామాలయముకు ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం పక్షాన స్వామి వార్లకు పట్టువస్త్రాలు ముత్యాల తలంబ్రాలు ఆలయ ఇఓ శ్రీనివాస్ బుధవారం సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్, దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు నంభి శ్రీనివాసాచార్యులు, అర్చకులు నంబి అరుణ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ అడ్లూరి పురుషోత్తం రాజు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గ ఏర్పాటు



**ధర్మపురి, మార్చి 25, (ది క్రైమ్ న్యూస్):** తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం జగిత్యాల జిల్లా ఆధ్వర్యంలో ధర్మపురి యూనిట్‌కు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షురాలు కె. అరుణ, ప్రధాన కార్యదర్శి యు. నారాయణ తెలిపారు. జిల్లా సంఘ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో నాల్గవ తరగతి ఉద్యోగులు పాల్గొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సంఘ నిబంధనావళి మరియు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్వహించిన ఈ సమావేశంలో నూతన కమిటీని ఏర్పాటు, సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సి కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా సంఘ బలోపేతానికి, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నిర్ణయించారు. నూతనంగా ఎన్నుకున్న ధర్మపురి కార్యవర్గం సంఘ అభివృద్ధికి కట్టుబడి పనిచేయాలని సూచించారు. ధర్మపురి యూనిట్ అధ్యక్షులుగా కొమ్ము ప్రకాష్ నీటిపారుదల శాఖ, ఉపాధ్యక్షురాలు దికొండ రజిత వ్యవసాయ శాఖ, కార్యదర్శి తోకల అంజయ్య నీటిపారుదల శాఖ, సహాయ కార్యదర్శి అప్పల మహేష్ రెవెన్యూ శాఖ, సభ్యురాలు కుక్కల శ్రీనిధి విద్యాశాఖ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి జిల్లా బాధ్యులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణ, కోశాధికారి సతీష్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ తదితర నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## బెజ్జెంకి జాతర పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి



**బెజ్జెంకి, మార్చి25(ది క్రైమ్ న్యూస్):** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలకేంద్రంలో గల శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయ అర్చకులు, ధర్మకర్తలతో కలిసి ఆలయ చైర్మన్ జెల్ల ప్రభాకర్ టిపిసిసి ఎస్సీ సెల్ చైర్మన్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను బుదవారం హైదరాబాద్ లో కలిసి స్వామి బ్రహ్మోత్సవాలకు ఆహ్వాన పత్రికను అందించగా బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ..... ఎంతో ప్రాశస్యత గల స్వామిని కోరికలు తీర్చే ఇలవేల్పుగా భావిస్తూ పక్క జిల్లాల నుండే కాక నాగపూర్, నాందేడ్, గుల్బర్గా, ముంబాయి నుండి భారీగా తరలి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సదుపాయాలు కల్పించి జాతర నిర్వహణకు సహకారం అందించాలని ధర్మకర్తలను కోరారు.బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్,పార్టీ మండలాధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, ఆలయ పూజారి శేష మధుసూదనచారి,ధర్మకర్తలు, నాయకులు ఎమ్మెల్యేకు ఆహ్వానం అందించిన వారిలో ఉన్నారు.

## సిసి రోడ్డు పనులను ప్రారంభించిన బత్తిని శ్రీనివాస్ గౌడ్



**కేశవపట్నం, మార్చి 25(ది క్రైమ్ న్యూస్):** కరీంనగర్ జిల్లా కేశవపట్నం మండలకేంద్రంలోని మూడో వార్డులో నూతనంగా నిర్మించే సిసి రోడ్డు పనులను టిపిసిసి సభ్యుడు, మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్ గౌడ్ బుధవారం టెంకాయ కొట్టి ప్రారంభించారు.కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్,స్థానిక సర్పంచ్ గోదారి రాజేంద్రప్రసాద్, కార్యదర్శి డి.నరసయ్య, ఉపసర్పంచ్ ఆకుపత్తిని విజయకుమార్, వార్డు సభ్యులు కళ్ళపల్లి కిరణ్, పంజాల సంపత్, గుర్రం కళావతి గ్రామస్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఐపీఎల్ 19వ సీజన్‌కు అంతా సిద్ధం..



ఐపీఎల్ ట్రోఫీ సాధనకు ఇరుజట్లలో తొలి అడుగు ఎవరు వేస్తారోనని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఐపీఎల్ కొత్త సీజన్ ఆరంభ మ్యాచ్ లో అదరగొట్టేదెవరు? బెదిదేరి ఎవరు? ఐపీఎల్ లో ఈ రెండు జట్లు ఎన్ని సార్లు తలపడ్డాయి? ఏ జట్టు ఎన్నిసార్లు గెలిచిందనేది అభిమానులు లెక్కలు వేసుకుంటున్నారు. ఇక ఐపీఎల్ అంటే బౌండరీల మోత... సిక్సర్ల హోరుతో బ్యాటర్ల విన్యాసాలు... ప్రమాదకర బంతుల్ని సంధించే బౌలర్లు పడగొట్టే వికెట్లు... చూసే అభిమానుల్ని కేరింతలు కొట్టించబోతున్నాయి. ఒక్కో జట్టుది ఒక్కో ప్రత్యేకత... ఆటగాళ్లది ప్రత్యేక శైలి. ఐపీఎల్ 18 ఏళ్ల చరిత్రలో రికార్డుల సృష్టిలో ఏ జట్టుకు ఆజట్టే ప్రత్యేకమని చెప్పవచ్చు. ఆటగాళ్లు మారిపోయినా.. ఆయా జట్ల తరపున ఆడినపుడు సాధించిన రికార్డులు చెక్కుచెదరని రికార్డులుగా నిలిచిపోయాయి. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు తరఫున 18 ఏళ్లు పూర్తి చేసుకుని 19వ సీజన్లో ఆడే ఒకే ఒక ఆటగాడిగా విరాట్ కోహ్లీ ఎవరగ్రీన్ ఐపీఎల్ రికార్డు సొంతం చేసుకున్నారు. సుధీర్ఘకాలం ఒకే జట్టు తరఫున... ఆడటమే కాదు... అన్ని సీజన్లలో కలిపి అత్యధిక పరుగులు సాధించిన బ్యాటర్ గా విరాట్ కోహ్లీ నిలిచాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ 18 సీజన్లను పూర్తి చేసుకుంది. ఈ అన్ని సీజన్లలో ప్రాతినిధ్యం వహించిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు – డెక్కన్ ఛార్జర్స్ హైదరాబాద్ పేరు మార్చుకుని ఐపీఎల్ లో స్థిరపడి సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు ఇప్పటిదాకా ఐపీఎల్ లో అత్యధిక స్కోర్లు, అతి తక్కువ పరుగులు చేసిన సందర్భాలున్నాయి. ఐపీఎల్ రికార్డ్స్ ప్రకారం రాయల్ ఛాలెంజర్స్ జట్టు 273 మ్యాచులు ఆడి 133 మ్యాచుల్లో విజయం సాధించింది. సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు 197 మ్యాచులను ఆడి 93 విజయాలను సొంతం చేసుకుంది. పేరు మారినా... డెక్కన్ ఛార్జర్స్ హైదరాబాద్ జట్టు .... సన్ రైజర్స్ హైదరాబాద్.. వేర్వేరు పేర్లతో ఐపీఎల్ లో ట్రోఫీలను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుపై విజయం సాధించి చేజిక్కించుకున్నాయి. రెండు సందర్భాల్లోనూ ప్రత్యర్థి జట్టుగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు పరాజయాన్ని చవిచూసింది. 2009 ఐపీఎల్ సీజన్ ఫైనల్లో రాయల్ ఛాలెంజర్స్ పై రోహిత్ శర్మ సారథ్యంలో డెక్కన్ ఛార్జర్స్ హైదరాబాద్ అదరగొట్టింది. 2016లో రాయల్ ఛాలెంజర్స్ పై డేవిడ్ వార్నర్ సారథ్యంలో సన్ రైజర్స్ ట్రోఫీని కైవసం చేసుకుంది. 2025 ఐపీఎల్ సీజన్ ఫైనల్లో పంజాబ్ కింగ్స్ జట్టు పై రజత్ పాటిదర్ సారథ్యంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్ ట్రోఫీని తొలిసారిగా ముద్దాడింది.సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు ఐపీఎల్ మ్యాచుల్లో బెంగళూరు జట్టుతో పోటీపడి చారిత్రక పరుగుల రికార్డును సొంతం చేసుకుంది. బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వేదికగా 2024 ఐపీఎల్ సీజన్లో మార్చి 30వ తేదీన హైదరాబాద్ చారిత్రక రికార్డు సృష్టించింది. మూడు వికెట్లను కోల్పోయిన హైదరాబాద్ జట్టు ఐపీఎల్ లోనే అత్యధికగంగా 287 పరుగులు సాధించి సరికొత్త రికార్డును క్రియేట్ చేసింది. ఆ మ్యాచులో హైదరాబాద్ ఆటగాడు... ట్రావిస్ హెడ్ 41 బంతుల్లో అద్భుతమైన సెంచరీ చేసి ఆ మ్యాచులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు ఏడు వికెట్ల నష్టానికి 262 పరుగులతో సరిపెట్టుకుంది. ఐపీఎల్ లో గడిచిన 24 మ్యాచుల్లో విన్నింగ్ హిస్టరీని పరిశీలిస్తే... రాయల్ చాలెంజర్స్ పై సన్ రైజర్స్ హైదరాబాద్ దే పైచేయిగా ఉంది. ఫస్ట్ బ్యాటింగ్ అయినా... లక్ష్యాన్ని ఛేదించే సమయంలోనూ బెంగళూరు జట్టుపై హైదరాబాద్ జట్టే విజయవకాశాలను చేజిక్కించుకుంది. 24 మ్యాచుల్లో 13 మ్యాచులను సన్ రైజర్స్ హైదరాబాద్ పైచేయి సాధిస్తే... 11 మ్యాచులను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు విజయం సాధించింది. సన్ రైజర్స్ 166 సగటు పరుగులు కాగా... బెంగళూరు జట్టు సగటు పరుగులు 162గా నమోదైంది. జట్టు పరంగా అత్యధిక స్కోరు సాధనలోనూ సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టే 287 పరుగులతో అగ్రస్థానంలో నిలించింది. 262 పరుగులతో బెంగళూరు జట్టు తర్వాత స్థానంలో నిలిచింది. అత్యల్ప స్కోరు సాధనలోనూ 72 పరుగులతో సన్ రైజర్స్ హైదరాబాదే పైచేయిగానిలిచింది. బెంగళూరు జట్టు 68 పరుగులు చేసి రెండో స్థానంలో నిలిచింది.

# స్పోర్ట్స్



## ధోనీతో పర్సనల్‌గా మాట్లాడతా

### టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ

ఐపీఎల్ 2026 సీజన్ కౌంట్ డౌన్ కొనసాగుతున్న వేళ క్రికెట్ ప్రపంచంలో అభిమానులను ఓ ప్రశ్న వెంటాడుతోంది. అదే 'ఎంఎస్ ధోనీకి ఇదే చివరి ఐపీఎల్ సీజనా?' అనే ప్రశ్న ప్రతి ఒక్కరి మదిలో మెదులుతోంది. 44 ఏళ్ల వయస్సులో తన 19వ ఐపీఎల్ సీజన్‌కు సిద్ధమవుతున్న నేపథ్యంలో ధోనీ రిటైర్మెంట్‌పై గత కొన్నాళ్లుగా ఊహాగానాలు వస్తున్న సంగతి తెలిసిందే. అయితే తాజాగా టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ ఈ విషయంపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు.ధోనీ భవిష్యత్తు గురించి మీడియా ప్రతినిధులు సౌరవ్ గంగూలీని ప్రశ్నించగా.. ఆయన చాలా వ్యూహాత్మకంగా సమాధానమిచ్చాడు. "ధోనీ ఏం చేయాలో నేను ధోనీకే చెబుతాను కానీ మీడియాకు కాదు' అంటూ గంగూలీ స్పష్టం చేశారు. దీనిపై తానే స్వయంగా ఎంఎస్ ధోనీతో పర్సనల్‌గా మాట్లాడతానని దాదా సంకేతాలిచ్చాడు. దీంతో ధోనీ రిటైర్మెంట్ ప్లాన్ పై గంగూలీకి ముందే తెలుసా.. అనే చర్చ మొదలైంది.ప్రముఖ వ్యాఖ్యాత ఆకాష్ చోప్రా మాత్రం ఈ సీజనే ధోనీకి ఆఖరిదని బలంగా నమ్ముతున్నాడు. దీనికి ప్రధాన కారణం సంజూ శాంసన్ సీఎస్కేలోకి రావడం. సీఎస్కే రవీంద్ర జడేజా, సామ్ కరన్‌లను ఇచ్చి రాజస్థాన్ రాయల్స్ నుంచి సంజూ శాంసన్‌ను రూ.18 కోట్లకు కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. సంజూ శాంసన్ ఇప్పుడు ధోనీ వారసుడిగా సిద్ధంగా ఉన్నాడని.. వికెట్ కీపింగ్ బాధ్యతలు కూడా సంజూనే తీసుకునే అవకాశం ఉందని ఆకాష్ చోప్రా విశ్లేషించాడు. ఎంఎస్ ధోనీ కేవలం ఇంపాక్ట్ ప్లేయర్ గా మాత్రమే కనిపిస్తే.. ఇదే ఆయనకు వీడ్కోలు పలకడానికి సరైన సమయమని ఆకాష్ చోప్రా పేర్కొన్నాడు.ప్రస్తుతం చెన్నై సూపర్ కింగ్స్ పూర్తి స్థాయిలో రుతురాజ్ గైక్వాడ్ టీంగా మారిపోయింది. జట్టు యాజమాన్యం కూడా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఆయుష్ మాత్రే, ప్రశాంత్ వీర్ వంటి యువ ఆటగాళ్లను జట్టులోకి తీసుకుంది. ఇటీవల జరిగిన '=ూ= 26' ఈవెంట్‌లో ధోనీ స్వయంగా సంజు శాంసన్, శివమ్ దూబేలను గౌరవించడం చూస్తుంటే.. నాయకత్వ బాధ్యతలను తన వారసులకు అప్పగించే ప్రక్రియ మొదలైందని స్పష్టమవుతోంది. ఎంఎస్ ధోనీ ఈ సీజన్ లో మెంటర్-కమ్-ప్లేయర్ పాత్రలో కనిపిస్తారా? లేదా తనదైన శైలిలో హెలికాప్టర్ షాట్లతో కెరీర్‌ను ఘనంగా ముగిస్తారా? అనేది మరికొద్ది రోజుల్లో తేలిపోనుంది.

## రాజస్థాన్ రాయల్స్ వాటా దక్కించుకున్న షేన్ వార్న్

రాజస్థాన్ రాయల్స్ విక్రయంతో ఆస్ట్రేలియా దిగ్గజం, దివంగత క్రికెటర్ షేన్ వార్న్ కుటుంబానికి భారీ జాక్?పాట్ తగిలింది. ఫ్రాంచైజీ విక్రయించగా వచ్చిన మొత్తంలో వార్న్ ఫ్యామిలీకి 3 శాతం వాటా దక్కనుంది. దీంతో అతడి కుటుంబానికి రూ.400ం కోట్లు దక్కనున్నాయి. 2008 ఐపీఎల్ తొలి సీజన్?కుగానూ రాజస్థాన్? రాయల్స్ షేన్ వార్న్?ను దక్కించుకుంది. అతడు 2008-2011 మధ్య కాలంలో నాలుగు సీజన్లపాటు రాజస్థాన్?కు ఆడాడు. ఈ సమయంలో వార్న్ మొత్తం రూ.9.35 కోట్ల శాలరీ అందుకున్నాడు. అయితే శాలరీతోపాటు రాజస్థాన్?కు ఆడినన్ని రోజులు ఫ్రాంచైజీ నుంచి ఏటా 0.75 శాతం వాటా దక్కించుకున్నాడు. అలా ఆర్ఆర్ తరఫున నాలుగు సీజన్లు ఆడిన వార్న్?కు మొత్తం 3 శాతం వాటా దక్కింది. గత 18ఏళ్లుగా వాటా అలాగే కొనసాగుతూ వచ్చింది. తాజాగా రాజస్థాన్ ఫ్రాంచైజీని విక్రయించారు. ఈ మొత్తం ఫ్రాంచైజీని అమెరికాకు చెందిన వ్యాపారవేత్త కల్ సొమానీకు చెందిన కన్సార్షియం రూ.15,300 కోట్ల ధరకు ఈ ఫ్రాంఛైజీని దక్కించుకుంది. దీంతో ఈ 3 శాతం వాటా విలువ కూడా అమాంతం పెరిగింది. అందులో సుమారు రూ.460 కోట్ల దాకా వార్న్ కుటుంబానికి అందుతాయని ప్రచారం సాగుతోంది. అయితే రాజస్థాన్ విక్రయం డీల్?కు బీసీసీఐ ఆమోదం తెలుపాల్సి ఉంది.ఐపీఎల్ టైటిల్ అందుకున్న తొలి కెప్టెన్?గా వార్న్? పేరిట అరుదైన రికార్డు ఉంది. తొలి సీజన్ (2008)?లోనే రాజస్థాన్ రాయల్స్?కు కెప్టెన్?గా వ్యవహరించిన అతడు జట్టును ఛాంపియన్?గా నిలిపాడు. ఫైనల్?లో చెన్నై సూపర్? కింగ్స్?పై రాజస్థాన్ విజయం సాధించింది. ఆ సీజన్?లో అతడు 15 మ్యాచ్?ల్లో 19 వికెట్లతో రాణించాడు. ఆ తర్వాత మూడు సీజన్లపాటు ఐపీఎల్? ఆడాడు. 2011 తర్వాత ఐపీఎల్?కు రిటైర్మెంట్ ఇచ్చేశాడు. ఓవరాల్?గా వార్న్ ఐపీఎల్?లో 54 మ్యాచ్?ల్లో 57 వికెట్లు పడగొట్టాడు.వార్న్?కు ముగ్గురు పిల్లలున్నారు. ఒకవేళ రాజస్థాన్ నుంచి ఈ షేర్ దక్కితే అది తమ పిల్లలకు చేరే అవకాశం ఉంది. వార్న్ తన భార్య సిమోన్ కల్లహన్?కు 2005లో విడాకులు ఇచ్చాడు. దీంతో వాళ్ల 10ఏళ్ల వివాహ బంధానికి తెరపడింది. ఇక 52ఏళ్ల వయసులో వార్న్ 2022 మార్చి 04న గుండెపోటుతో మరణించాడు.




## రెండో ట్రోఫీపై సన్‌రైజర్స్ కసరత్తు

ఐపీఎల్ 19వ సీజన్ సమరం ఇంకో మూడు రోజుల్లోనే మొదలవ్వనుంది. మార్చి 28న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీతో జరిగే తొలి మ్యాచ్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ా=ు) తన ప్రయాణాన్ని ప్రారంభించనుంది. అయితే 2013లో వచ్చిన సన్?రైజర్స్? తొలిసారి 2016లో ఛాంపియన్?గా నిలిచింది. వార్నర్ కెప్టెన్సీలో సన్?రైజర్స్? టైటిల్ ముద్దాడింది. ఇక 2018, 2024లో రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఈ మూడు సీజన్లు మినహా ఆరెంజ్ ఆర్మీ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. గత సీజన్‌లో అద్భుతమైన బ్యాటింగ్ లైనప్‌తో బరిలోకి దిగినా, కీలక సమయాల్లో తడబడి ప్లేఆఫ్స్‌కు చేరడంలో విఫలమైంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకు ఉన్న అతిపెద్ద బలం బ్యాటింగ్ ఆర్డర్. ముఖ్యంగా ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ ఓపెనింగ్ జోడీ పవర్‌ప్లేలో ప్రత్యర్థి బౌలర్లను వణికించగలరు. వీరిద్దరితో పాటు వికెట్ కీపర్ బ్యాటర్లు ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్ తోడవ్వడం జట్టుకు కొండంత అండ. ఈ నలుగురు బ్యాటర్ల టీ20 స్ట్రైక్ రేట్ 150 కంటే ఎక్కువగా ఉండటం విశేషం. ఏ ఒక్కరు క్రీజులో నిలదొక్కుకున్నా స్కోరు బోర్డు పరుగులు పెట్టడం ఖాయం. పవర్‌ప్లేలోనే మ్యాచ్ ఫలితాన్ని మార్చేయగల సత్తా ఈ బ్యాటింగ్ లైనప్‌కు ఉంది. గతేడాది సన్‌రైజర్స్ ఎదుర్కొన్న ప్రధాన సమస్య మిడిలార్డర్, లోయర్ ఆర్డర్ బ్యాటింగ్. టాప్ ఆర్డర్ బ్యాటర్లు మంచి ఆరంభాన్ని ఇచ్చినా, ఆ తర్వాత వచ్చే ఆటగాళ్లు తక్కువ పరుగులకే ఔట్ అవ్వడం వల్ల జట్టు భారీ స్కోర్లు సాధించలేకపోయింది. ఈ సమస్యను అధిగమించేందుకు ఈసారి లియామ్ లివింగ్‌స్టన్, జేక్ ఎడ్వర్డ్స్ వంటి ఆల్ రౌండర్లను జట్టులోకి తీసుకున్నారు. ముఖ్యంగా లివింగ్‌స్టన్ రాకతో మిడిలార్డర్‌లో నిలకడ రావడంతో పాటు, అవసరమైనప్పుడు భారీ సిక్సర్లు కొట్టే అవకాశం ఉంటుంది. జట్టు కెప్టెన్ పాట్ కమిన్స్ గాయం కారణంగా ఆరంభ మ్యాచ్‌లకు దూరం కావడం సన్‌రైజర్స్‌కు పెద్ద తలనొప్పిగా మారింది. అయితే అతను కేవలం ఒక మ్యాచ్‌కే దూరం కావచ్చనే టాక్ వస్తోంది. మొదట అతను లేకుంటే బౌలింగ్ విభాగంలో అనుభవం తగ్గినట్లవుతుంది. ప్రస్తుతం కమిన్స్ స్థానంలో ఇషాన్ కిషన్ జట్టును నడిపించనున్నాడు. కమిన్స్ రెండో మ్యాచ్‌లో ఉంటాడా ఉండడా అనే విషయంలో క్లారిటీ రావాల్సి ఉంది. అయితే కమిన్స్ గాయం నుంచి కోలుకుని మళ్లీ పాత ఫామ్?ను చూపించాలి అంటే అంత సాధ్యం కాదు. ఇక మరోవైపు జయదేవ్ ఉనద్కత్, హర్షల్ పటేల్‌పై పనిభారం పెరిగింది. డెత్ ఓవర్లలో పరుగులను నియంత్రించడం ఈ ఇద్దరు భారతీయ పేసర్లకు సవాల్‌గా మారింది. హైదరాబాద్ జట్టు బలహీనతల్లో స్పిన్ బౌలింగ్ ప్రధానమైనది. హర్ష్ దూబే, జీషన్ అన్సారీ వంటి యువ స్పిన్నర్లు జట్టులో ఉన్నప్పటికీ, అంతర్జాతీయ స్థాయిలో వారికి పెద్దగా అనుభవం లేదు. లియామ్ లివింగ్‌స్టన్ పార్ట్‌టైమ్ స్పిన్నర్‌గా సాయపడగలడు కానీ, కీలక సమయాల్లో వికెట్లు తీయగల స్పెషలిస్ట్ స్పిన్నర్ లేకపోవడం జట్టును ఆందోళనకు గురి చేస్తోంది. ప్రత్యర్థి బ్యాటర్లు స్పిన్‌పై దాడి చేసే అవకాశం ఉన్నందున, ఈ యువ బౌలర్లు ఎలా రాణిస్తారనే దానిపైనే ఎస్ఆర్‌హెచ్ ప్లేఆఫ్స్ అవకాశాలు ఆధారపడి ఉన్నాయి. మ్యాచ్‌ను అద్భుతంగా ముగించే సరైన ఫినిషర్ లేకపోవడం కూడా ఎస్ఆర్‌హెచ్‌కు మైనస్‌గా కనిపిస్తోంది. నితీశ్ కుమార్ రెడ్డి, అనికేత్ వర్మ వంటి వారు ఉన్నప్పటికీ, వారు ఒత్తిడిలో ఎలా ఆడతారనేది చూడాలి. ముఖ్యంగా నితీశ్ కుమార్ ఫామ్?లో లేకపోవడం అతిపెద్ద మైనస్. అతను మునుపటిలాగా బాగా ఆడితేనే కీలకమైన మ్యాచ్?లలో పట్టు దొరుకుతుంది. అలాగే క్లాసెన్ లేదా లివింగ్‌స్టన్ చివరి వరకు ఉంటేనే జట్టుకు భారీ స్కోరు లభిస్తుంది. ఒకవేళ వీరు త్వరగా ఔట్ అయితే, మ్యాచ్‌ను ముగించే బాధ్యతను మోసే బాధ్యత నితీశ్ కుమార్ పైనే పడుతుంది. ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, లియామ్ లివింగ్‌స్టన్, హెన్రిచ్ క్లాసెన్, నితీష్ కుమార్ రెడ్డి, అనికేత్ వర్మ, పాట్ కమిన్స్ (వస్తే), జయదేవ్ ఉనద్కత్, హర్షల్ పటేల్, జీషన్ అన్సారీ ఉండవచ్చు. ఇంపాక్ట్ ప్లేయర్‌గా హర్ష్ దూబేను వాడే అవకాశం ఉంది. పేపర్ మీద బ్యాటింగ్ చాలా బలంగా కనిపిస్తున్నా, బౌలింగ్?లో మాత్రం కాస్త బలహీనంగా కనిపిస్తుంది.బ్యాటర్లు ఎంత పోరాడినా కీలక సమయాల్లో బౌలర్లు చేతులెత్తేస్తున్నారు. ముఖ్యంగా హోమ్ గ్రౌండ్ ఉప్పల్ స్టేడియంలో ఈ బౌలింగ్ యూనిట్ ఎంతవరకు రాణిస్తుందో చూడాలి. 2016 నాటి వైభవాన్ని మళ్లీ చూడాలంటే సన్‌రైజర్స్ ఈసారి బౌలింగ్ విషయంలో ఇంకా కష్టపడాలి. బ్యాటింగ్?పైనే ఆధారపడకుండా బౌలింగ్ విభాగం బాధ్యత తీసుకోవాలి. అలాగే అనుభవం లేని బౌలర్లు కీలక సమయాల్లో కట్టుదిట్టంగా బౌలింగ్ చేయాలి.




## ఐపీఎల్ నుంచి బెన్ డకెట్ అవుట్

### ఢిల్లీ క్యాపిటల్స్‌కు బిగ్ షాక్..


ఐపీఎల్ 2026 సీజన్ కౌంట్‌డౌన్ కొనసాగుతున్న వేళ ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు బిగ్ షాక్ తగిలింది. ఇంగ్లండ్ స్టార్ ఓపెనర్ బెన్ డకెట్ వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ కారణంతో టోర్నమెంట్ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించడంతో బెన్ డకెట్ ఐపీఎల్ కెరీర్ ప్రమాదంలో పడింది.ఐపీఎల్ 2026 వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీ రూ.2 కోట్ల భారీ ధరకు బెన్ డకెట్‌ను కొనుగోలు చేసింది. టాపార్డర్‌లో జట్టుకు బలాన్నిస్తాడని భావించిన నేపథ్యంలో బెన్ డకెట్ అనూహ్య నిర్ణయాన్ని తీసుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్ సీజన్ కోసం డకెట్ తనను తాను శారీరకంగా, మానసికంగా సిద్ధం చేసుకోవాలని.. అందుకే ఈ సీజన్ ఆడటం లేదని సోషల్ మీడియా వేదికగా ప్రకటించాడు.బీసీసీఐ గతేడాది ప్రవేశపెట్టిన కఠిన నిబంధనల ప్రకారం.. వేలంలో అమ్ముడుపోయిన ఏ విదేశీ ఆటగాడైనా, సరైన వైద్య కారణాలు లేకుండా టోర్నీ ప్రారంభానికి ముందు తప్పుకుంటే వారిపై రెండేళ్ల పాటు నిషేధం విధిస్తారు. ఈ నిబంధన అమలైతే బెన్ డకెట్ ఐపీఎల్ 2026తో పాటు 2027, 2028 వేలంలో కూడా పాల్గొనే అవకాశం ఉండదు. బెన్ డకెట్ నేరుగా 2029 ఐపీఎల్ సీజన్‌లోనే మళ్లీ ఎంట్రీ ఇవ్వగలడు. గతంలో హ్యారీ బ్రూక్ కూడా ఇలాంటి చర్యలనే ఎదుర్కోవడం గమనార్హం.తన నిర్ణయంపై స్పందిస్తూ బెన్ డకెట్ భావోద్వేగపూరిత పోస్ట్ చేశాడు. "ఇది చాలా కఠినమైన నిర్ణయం. ఇంగ్లండ్ తరఫున ఆడటమే నా మొదట ప్రాధాన్యత. అంతర్జాతీయ సీజన్ కంటే ముందు నేను శారీరకంగా, మానసిక దృఢంగా ఉండాలని కోరుకుంటున్నాను. ఢిల్లీ ఫ్రాంచైజీకి, అభిమానులకు కలిగిన ఇబ్బందికి క్షమాపణలు కోరుతున్నాను." అని బెన్ డకెట్ పేర్కొన్నాడు. ఇటీవల జరిగిన యాషెస్ సిరీస్‌లో బెన్ డకెట్ 10 ఇన్నింగ్స్‌ల్లో కేవలం 20.20 సగటుతో పరుగులు చేసి బెన్ డకెట్ పేలవ ప్రదర్శన కనబరిచాడు.ఓపెనింగ్‌లో మెరుపులు మెరిపిస్తాడని ఆశించిన బెన్ డకెట్ దూరం అవ్వడంతో ఢిల్లీ జట్టు బ్యాలెన్స్ దెబ్బతింది. ఇప్పుడు హుటాహుటిన డకెట్ స్థానంలో మరో విదేశీ ప్లేయర్‌ను వెతరాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## అన్నదమ్ముల మధ్య చిచ్చుపెట్టిన బ్యూటీ



టీమ్ ఇండియా స్టార్ ఆల్-రౌండర్ హార్దిక్ పాండ్యా సోదరుడు, ఆర్సీబీ స్టార్ ఆటగాడు క్రునాల్ పాండ్యా పుట్టినరోజు సందర్భంగా (మార్చి 24) పలువురు క్రికెటర్లు శుభాకాంక్షలు తెలిపారు. అయితే బర్త్‌డే రోజు సొంత తమ్ముడి వల్లే క్రునాల్ కలత చెందాడని అంటున్నారు. మరో రెండు, మూడు రోజుల్లో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ప్రారంభం కాబోతోంది. ఇప్పటికే పాండ్యా బ్రదర్స్ తమ జట్లతో కలిసి ప్రాక్టీస్ మొదలెట్టేశారు. అయితే క్రునాల్ పాండ్యా పుట్టినరోజు సందర్భంగా తమ్ముడు హార్దిక్ పాండ్యా శుభాకాంక్షలు తెలపకపోవడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. వారిద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయని చర్చ జరుగుతోంది.క్రునాల్ పాండ్యా పుట్టినరోజున, అతని భార్య పంఖురి శర్మ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ షేర్ చేసి అతనికి శుభాకాంక్షలు తెలిపారు. "నీ మనసు, నీ ప్రేమ, అన్నీ నాకు తెలుసు. ఆ విషయాన్ని నీకు గుర్తు చేయాలనుకుంటున్నాను. నువ్వు చాలా అందమైన జీవితాన్ని గడిపావు. కుటుంబం, క్రికెట్‌తో సహా ప్రతీదాన్నీ నువ్వు ప్రశాంతంగా, ధైర్యంగా నిర్వహిస్తావు," అని పంఖురి శర్మ పోస్ట్ చేసింది. భార్య పంఖురి శర్మ పెట్టిన ఎమోషనల్ పోస్ట్‌కు భర్త కృనాల్ పాండ్యా కృతజ్ఞతలు తెలిపారు. అయితే ఈ క్రమంలో కృనాల్ పాండ్యా సోదరుడు హార్దిక్ పాండ్యా అసలు ఎక్కడున్నాడనే ప్రశ్న తలెత్తుతోంది. ఎందుకంటే ప్రతి ఏటా కృనాల్ పాండ్యా పుట్టినరోజున అందరూ సంతోషంగా కలిసి ఉంటారు. కానీ ఈసారి హార్దిక్ పాండ్యా కనీసం విషెస్ చెప్పలేదని ఫ్యాన్స్ అంటున్నారు. హార్దిక్ పాండ్యా వదిన పంఖురి శర్మ పోస్ట్ చేసిన ఫోటో తర్వాత, 'హార్దిక్ పాండ్యా ఎక్కడ?', 'అతను క్రునాల్ పాండ్యాకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఎందుకు చెప్పలేదు?' వంటి ప్రశ్నలను అభిమానులు అడుగుతున్నారు. ఈలోగా, హార్దిక్ పాండ్యా సోషల్ మీడియా ఖాతాలను కూడా పరిశీలించగా, అతను క్రునాల్ పాండ్యాకు ఒక్క శుభాకాంక్షలు కూడా చెప్పలేదని స్పష్టమవుతోంది. ఒకప్పుడు వాళ్లిద్దరూ తమ పుట్టినరోజులను కలిసి జరుపుకునేవారు. చాలా కార్యక్రమాలలో ఇద్దరూ కలిసే కనిపించేవారు. కానీ హార్దిక్ జీవితంలోకి మహికా శర్మ వచ్చినప్పటి నుండి, ఆ ఇద్దరు సోదరుల మధ్య మనస్పర్థలు వచ్చాయని వదంతులు వస్తున్నాయి. పాండ్యా సోదరుల మధ్య పెద్ద గొడవ జరిగిందని సోషల్ మీడియాలో చాలా చర్చ జరుగుతోంది. కానీ ఈ గొడవకు ఖచ్చితమైన కారణం తెలియరాలేదు.


# విశ్వజ



## చెడు కొవ్వు కరిగించే ఈ కూరగాయలు తినండి... రిజల్ట్ మీరే చూడండి!

బరువు తగ్గాలని భావించేవారు బరువు తగ్గటం కోసం ఏం తినాలి? ఏం తినకూడదు అనేది కచ్చితంగా తెలుసుకోవాలి. ఇటీవల కాలంలో బరువు తగ్గటం కోసం చాలా మంది రకరకాల డైట్‌లను ఫాలో చేస్తున్నారు. అయితే బరువు తగ్గాలంటే, సులభంగా బరువు తగ్గించే ఆహారాలను తినాలని కొందరు డైటీషియన్స్ చెప్తున్నారు. అయితే బరువుకు చెక్ పెట్టటంలో కొన్ని కూరగాయల పాత్ర చాలా ఉంటుందని అంటున్నారు. దోసకాయ దోసకాయలో కేలరీలు తక్కువగా ఉంటాయి. దోసకాయాలలో ఫైబర్ అధికంగా ఉండటం కారణంగా ఇది బరువు తగ్గటానికి బాగా ఉపయోగపడుతుంది. దోసకాయలో వాటర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. ఇది మన కడుపు నిండిన ఫీలింగ్ కలిగిస్తుంది. దోసకాయలు ఆకలిని తగ్గిస్తాయి. ఇవి మన బరువును నియంత్రణలో ఉంచుతాయి. సొరకాయ సొరకాయలో కూడా బరువును తగ్గించే బోలెడు పోషకాలు ఉంటాయి. సొరకాయలో కూడా ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. సొరకాయను కూడా మనం ఆహారంలో భాగంగా చేసుకుంటే బోలెడు ప్రయోజనాలు ఉంటాయి. సొరకాయలో వాటర్ కంటెంట్ ఎక్కువ.. ఇది మన ఆకలిని తగ్గిస్తుంది. దీంతో బరువు తగ్గే అవకాశం ఉంటుంది. పుచ్చకాయ పుచ్చకాయ బరువు తగ్గటానికి ఎంతగానో దోహదం చేస్తుంది. పుచ్చాకాయలో కూడా వాటర్ కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. దీనిలో ఫైబర్, ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. పుచ్చకాయలో విటమిన్ ఎ, విటమిన్ సి అధికంగా ఉంటాయి. ఇది జీవక్రియను పెంచడంలో సహాయపడుతుంది. పుచ్చకాయ గింజల్లో ఫైబర్, ప్రొటీన్లు, విటమిన్లు, మినరల్స్ తో పాటు బోలెడు పోషకాలు ఉంటాయి. ఇవి కడుపు నిండుగా ఉండేందుకు, ఆకలిని తగ్గించడంలో సహాయపడతాయి. ఫలితంగా ఇవి మన బరువును తగ్గిస్తాయి. గుమ్మడికాయ గుమ్మడికాయలో చాలా తక్కువ క్యాలరీలు ఉంటాయి గుమ్మడికాయ మన బరువు తగ్గడానికి ఎంతో బాగా ఉపయోగపడుతుంది ఇందులో ఫైబర్ నీరు అధికంగా ఉండడం వల్ల మన కడుపు నిండుగా ఉన్న ఫీలింగ్ కలుగుతుంది గుమ్మడికాయను ఆహారంలో భాగంగా చేసుకుంటే కచ్చితంగా మంచి ఫలితం ఉంటుంది. ఇది మన బరువును తగ్గించడానికి దోహదం చేస్తుంది. వీటితో కూడా బరువు తగ్గొచ్చు ఇక ఇవి మాత్రమే కాదు బ్రోకలీ, క్యాబేజ్, క్యాలీ ఫ్లవర్, పాలకూర, పుట్ట గొడుగులు కూడా మన ఆకలిని తగ్గించి మనం బరువు తగ్గేందుకు దోహదం చేస్తాయి. కనుక పై ఆహారాలు మీ భోజనంలో భాగం చేసుకుంటే మంచి రిజల్ట్ ఉంటుంది.

# డేంజర్ వ్యాధులను సహితం మట్టుపెట్టు పెట్టే సూపర్ ఫుడ్ !..



### రోజూ ఇలా ట్రై చేయండి.

క్వినోవా అనేది పోషకాలను సమృద్ధిగా కలిగి ఉన్న శక్తివంతమైన ధాన్యం. ఇది ప్రధానంగా దక్షిణ అమెరికా దేశాల్లో ఉత్పత్తి అవుతూ, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య స్నేహితుల ఆహార జాబితాలో కీలకంగా మారింది. ఇది ప్రోటీన్లకు గొప్ప మూలంగా ఉండటమే కాకుండా, గ్లూటెన్-ఫ్రీ ఫుడ్ కావడం వల్ల చాలా మంది ఆరోగ్య పరంగా దీన్ని తమ డైట్‌లో భాగం చేసుకుంటున్నారు. దీన్ని ఆహారంగా చేర్చుకోవడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. క్వినోవా యొక్క ప్రయోజనాలు: క్వినోవాలో మన శరీరానికి అవసరమైన తొమ్మిది ముఖ్యమైన అమైనో ఆమ్లాలు ఉంటాయి. ఇది శాకాహారులు మరియు శాఖాహారులకు ప్రోటీన్ యొక్క గొప్ప మూలం. దీనిలో ఫైబర్ అధికంగా ఉంటుంది, ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది . మలబద్ధకాన్ని నివారిస్తుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో కూడా సహాయపడుతుంది. క్వినోవాలో ఐరన్, మెగ్నీషియం, పొటాషియం, విటమిన్ %దీ% వంటి అనేక ముఖ్యమైన విటమిన్లు , ఖనిజాలు ఉంటాయి. ఇవి మన ఆరోగ్యానికి చాలా అవసరం. ఈ ధాన్యంలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి, ఇవి మన శరీరాన్ని ఫ్రీ రాడికల్స్ నుండి రక్షిస్తాయి . క్యాన్సర్, గుండె జబ్బుల వంటి దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. క్వినోవా గ్లూటెన్ రహితమైనది, కాబట్టి ఇది ఉదరకుహర వ్యాధి లేదా గ్లూటెన్ సెన్సిటివిటీ ఉన్నవారికి మంచి ఎంపిక. దీనిలో ఫైబర్, ప్రోటీన్ అధికంగా ఉండటం వల్ల ఇది మనకు ఎక్కువసేపు కడుపు నిండిన భావనను కలిగిస్తుంది, దీని వలన మనం తక్కువ ఆహారం తీసుకుంటాము మరియు బరువు తగ్గడానికి సహాయపడుతుంది. క్వినోవాలో మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు, ఒమేగా -3 ఫ్యాటీ యాసిడ్స్ ఉంటాయి, ఇవి గుండె ఆరోగ్యానికి చాలా మంచివి. ఇవి కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించడంలో మరియు గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. క్వినోవాలో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల ఇది రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడుతుంది , డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. దీనిని అన్నం లాగా వండుకోవచ్చు లేదా సలాడ్లు, సూప్‌లు, స్మూతీలలో కూడా ఉపయోగించవచ్చు. దీనిని పిండిగా కూడా ఉపయోగించి రొట్టెలు, ఇతర బేక్ చేసిన వస్తువులను తయారు చేయవచ్చు. ఇది పోషకమైన ఆరోగ్యకరమైన ఆహారం. దీనిని మీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల మీరు అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# పండ్లు తింటేే ఆరోగ్యమని అతిగా తింటున్నారా? అయితే జాగ్రత్త!

చాలామంది పండ్లను ఇష్టంగా తింటారు. పండ్లు తింటే ఆరోగ్యంగా ఉంటామని భావించి ఉదయం, సాయంత్రం, రాత్రి వేళల్లో పండ్లను తమ ఆహారంలో భాగంగా చేసుకుంటున్నారు. అయితే పండ్లు తింటే ఆరోగ్యం వస్తుందన్నమాట వాస్తవమే అయినప్పటికీ అతిగా పండ్లు తినడం మాత్రం మంచిది కాదని హెచ్చరిస్తున్నారు ఆరోగ్య నిపుణులు. పండ్లను అతిగా తినడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. పండ్లు ఎక్కువ తింటే ఏమవుతుంది పండ్లలో సహజంగానే చక్కెరలు, క్యాలరీలు ఎక్కువగా ఉంటాయి. ఆరోగ్యంగా ఉంటామని భావించి వీటిని అతిగా తింటే బరువు పెరిగే ప్రమాదం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. అంతేకాదు విపరీతంగా పండ్లు తింటే పండ్లలో ఉండే చక్కెర శరీరంలో డయాబెటిస్ ను పెంచుతుందని డయాబెటిస్ బాధితులుగా మారే ప్రమాదం ఉంటుందని కూడా హెచ్చరిస్తున్నారు. అతిగా పండ్లు తింటే ఈ అనారోగ్య సమస్యలు చాలామంది అన్నం తినడం మానేసి పండ్లను ఎక్కువగా ఆహారంలో భాగంగా చేసుకుంటున్నారు. పండ్లలో చక్కెర, పీచు ఎక్కువగా ఉంటాయి. ఫలితంగా డయాబెటిస్ ఊబకాయం వచ్చే ప్రమాదం ఉంటుందని జీర్ణ వ్యవస్థకు సంబంధించి సమస్యలు కూడా వచ్చే ప్రమాదం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. కడుపు ఉబ్బరం, మలబద్ధకం, ఎసిడిటీ వంటి సమస్యలు వస్తాయని చెబుతున్నారు అందుకే పండ్లు తినాలి అనుకునేవారు రోజుకు ఎన్ని పండ్లు తినాలనేది



కచ్చితంగా తెలుసుకోవాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు. ప్రతీరోజూ ఇన్ని పండ్లు మాత్రమే తినాలి పండ్లు ఇష్టంగా తినేవారు ప్రతిరోజు మూడు నుంచి నాలుగు మాత్రమే పండ్లు తినాలి. 500 గ్రాములలోపు పండ్లను మాత్రమే తినవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. ఇంతకంటే ఎక్కువ మొత్తంలో పండ్లను తీసుకుంటే ఆరోగ్యానికి ప్రమాదం వాటిల్లుతుందని హెచ్చరిస్తున్నారు. కనుక పండ్లు తినాలి అని భావించేవారు మితంగానే పండ్లు తినాలని గుర్తుంచుకోవాలి. ఇక పండ్ల జ్యూస్ లను చేసుకుని ఎక్కువగా తాగే వారు కూడా డయాబెటిస్ బాధితులుగా మారతారని హెచ్చరిస్తున్నారు. పండ్ల జ్యూస్ లు ఎక్కువగా తాగితే మంచిది కాదు... జాగ్రత్త పోషకాల పరంగా చూస్తే పండ్లను జ్యూస్ గా చేసి తాగడం వల్ల వాటిలో 60 శాతం యాంటీ ఆక్సిడెంట్లు తగ్గిపోతాయని ఇక పండ్లను జ్యూస్ గా చేసుకుని తాగే కంటే నేరుగా తినడం మంచిదని చెబుతున్నారు. కనుక పండ్లు అతిగా తినేవారు తప్పక మీ ఆలోచన మార్చుకోవాల్సిందే. అలా కాకుండా విపరీతంగా పండ్లను తింటే మాత్రం అనవసరమైన అనర్ధాలను ఎదుర్కోవాల్సి వస్తుంది.

## ఆలివ్ ఆయిల్ వాడుతున్నారా? ఒక్కసారి ఈ విషయాలు తెలుసుకోండి!

ఆలివ్ ఆయిల్ అనేది ఆలివ్ పండ్ల నుండి తీయబడిన ఒక రకమైన వంట నూనె. ఇది మధ్యధరా ప్రాంతంలో ఎక్కువగా ఉపయోగిస్తారు. ఆలివ్ ఆయిల్‌లో మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు, యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు పుష్కలంగా ఉంటాయి. ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలను చేకూరుస్తుంది, కానీ కొన్ని సందర్భాల్లో ఇది దుష్ప్రభావాలను కూడా కలిగిస్తుంది. ఆలివ్ ఆయిల్‌ను ఎక్కువగా లేదా తప్పుగా తీసుకోవడం వల్ల కలిగే దుష్ప్రభావాలను కలిగిస్తుంది. ప్రతి రోజూ ఆలివ్ ఆయిల్‌ను ఉపయోగించడం వల్ల కలిగే నష్టాలను తెలుసుకుందాం.. 1. అలర్జీ ప్రతిచర్యలు: కొంతమందికి ఆలివ్ ఆయిల్‌కు అలర్జీ ఉండవచ్చు. దీనివల్ల చర్మంపై దద్దుర్లు, దురద, ఎరుపుదనం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి సమస్యలు తలెత్తవచ్చు. ఒకవేళ మీకు ఆలివ్ ఆయిల్ తీసుకున్న తర్వాత ఇలాంటి లక్షణాలు కనిపిస్తే, వెంటనే దానిని తీసుకోవడం ఆపేసి వైద్యుని సంప్రదించాలి. 2. జీర్ణ సమస్యలు: ఆలివ్ ఆయిల్‌ను ఎక్కువగా తీసుకోవడం వల్ల జీర్ణ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా కడుపు నొప్పి, వికారం, వాంతులు, విరేచనాలు వంటి సమస్యలు కలుగుతాయి. ఆలివ్ ఆయిల్‌లో కొవ్వు శాతం ఎక్కువగా ఉండటం వల్ల ఇది జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. కాబట్టి, జీర్ణ సమస్యలు ఉన్నవారు ఆలివ్ ఆయిల్‌ను తక్కువ మోతాదులో తీసుకోవడం మంచిది. 3. చర్మ సమస్యలు: ఆలివ్ ఆయిల్ అన్ని రకాల చర్మాలకు సరిపోదు. ముఖ్యంగా జిడ్డు చర్మం కలిగినవారు ఆలివ్ ఆయిల్‌ను ఎక్కువగా వాడటం వల్ల మొటిమలు వచ్చే అవకాశం ఉంది. ఆలివ్ ఆయిల్‌లో ఒలియిక్ యాసిడ్ ఉంటుంది, ఇది చర్మం యొక్క సహజ నూనెలను తొలగించగలదు, దీనివల్ల చర్మం పొడిబారవచ్చు. కాబట్టి, మీ చర్మ తత్వాన్ని బట్టి ఆలివ్ ఆయిల్‌ను ఉపయోగించడం మంచిది.



# మార్కెట్

## టెక్ మహీంద్రా సూపర్ జాబ్..

### హైదరాబాదీలకు రూ.15 లక్షల ప్యాకేజీ ఆఫర్, డోన్ట్ మిస్..




రెండు తెలుగు రాష్ట్రాల నుంచి యువత ఎక్కువగా ఐటీ ఉద్యోగం కోసమే బీటెక్ చేస్తున్నారు. ప్రధానంగా తెలుగు ప్రజలు మంచి ఆదాయవనరుగా భావిచంటంతో పాటు సమాజంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు అధిక గౌరవం దక్కటం కూడా చాలా మందిని ఈ రంగంలో ఉపాధి పొందేందుకు ప్రేరేపిస్తోంది. ఐటీ బూమ్ ప్రధానంగా ఉపయోగించుకున్న వారిలో తెలుగు ప్రజలు కూడా ముందు వరుసలోనే ఉన్నారు. చాలా మంది విదేశాల్లో ఉద్యోగాలు సంపాదించి అక్కడే స్థిరపడగా.. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కూడా ఉద్యోగాలు చేస్తున్నారు. అయితే ప్రస్తుతం హైదరాబాదు కూడా ఐటీ పరిశ్రమకు కేంద్ర బిందువుగా మారుతున్న వేళ ఇక్కడ కూడా మంచి ఉద్యోగ అవకాశాలు వస్తున్నాయి. “జెన్‌ప్యాక్ట్ లో జాబ్స్.. డిగ్రీ ఉంటే చాలు.. రెజ్యూమ్ రెడీ చేసుకోండి.. “ తాజాగా టాప్ ఐటీ కంపెనీల్లో ఒకటిగా ఉన్న టెక్ మహీంద్రా హైదరాబాదులో డాట్‌నెట్, ఫుల్‌స్టాక్ లీడ్ కోసం నియామకాన్ని చేపడుతోంది. దీనికోసం కంపెనీ 7 నుంచి 10 సంవత్సరాలు వర్క్ అనుభవం కలిగి ఉండాలని వెల్లడించింది. ఎంపికైన ఉద్యోగికి రూ.6 లక్షల నుంచి రూ.15 లక్షల ఆఫర్ చేస్తోంది. అయితే ఉద్యోగి బాధ్యతల్లో భాగంగా దేశంలో ఎక్కడైనా పనిచేయాల్సి ఉంటుందని తెలుస్తోంది. సాఫ్ట్‌వేర్ అప్లికేషన్‌లను అభివృద్ధి, మెరుగుపరచటం, నిర్వహించాల్సి ఉంటుందని కంపెనీ వెల్లడించింది. బాధ్యతలను పరిశీలిస్తే.. ప్రాజెక్ట్ అవసరాలను అర్థం చేసుకుని అవసరాలకు అనుగుణంగా సాంకేతిక పరిష్కారాలుగా అనువదించడానికి క్రాస్-ఫంక్షనల్ బృందాలు, వ్యాపార వాటాదారులతో పనిచేయాల్సి ఉంటుందని కంపెనీ వెల్లడించింది. అలాగే స్కేలబుల్, హై క్వాలిటీ సాఫ్ట్‌వేర్ పరిష్కారాలను రూపొందించడానికి, అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. దీనికి తోడు సాఫ్ట్‌వేర్ లోపాలను సకాలంలో పరిష్కరించాల్సి ఉంటుందని టెక్ మహీంద్రా వెల్లడించింది. టార్గెట్ కి అనుకూలంగా సకాలంలో పూర్తి చేసేందుకు ఉద్యోగి కట్టుబడి ఉండాల్సి ఉంటుందని కంపెనీ వెల్లడించింది.

## మిడిల్ క్లాస్ వాళ్ళకి రిలీఫ్ ఉంటుందా..?

# రేపే ఆర్‌బిఐ రెపో రేటు ప్రకటన..!



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య విధాన కమిటీ సమావేశం ఈరోజు (ఫిబ్రవరి 6) రెండవ రోజుకు చేరుకుంది. అయితే కీలక వడ్డీ రేట్లపై కమిటీ సభ్యులు చర్చించారు, దేశీయ ద్రవ్య పరిస్థితులను పరిష్కరించడానికి అలాగే రూపాయి అస్థిరతను తగ్గించడానికి తీసుకునే చర్యలతో పాటు ఈ నెలలో 25 బేసిస్ పాయింట్ల కోతను ప్రకటించే అవకాశం ఉందని ఆర్థికవేత్తలు తెలిపారు. ముఖ్యంగా కొత్తగా నియమితులైన గవర్నర్ సంజయ్ మల్హోత్రా నాయకత్వంలో ఇది మొదటి పాలసీ సమావేశం. డిసెంబర్ ప్రారంభంలో మాజీ ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ స్థానంలో రాబోయే 3 సంవత్సరాలకు రిజర్వ్ బ్యాంకు 26వ గవర్నర్‌గా అయన బాధ్యతలు స్వీకరించారు. “బెంగళూరులో వణికిపోతున్న తెలుగు టెక్కీలు..! కొత్త రచ్చతో నిద్ర పట్టట్లే.. “ బ్యాంక్ ఆఫ్ బరోడా నివేదిక ప్రకారం, ఫిబ్రవరి 7న జరగనున్న ద్రవ్య విధాన సమీక్షలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించవచ్చు. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడం వల్ల ఆర్‌బిఐ ఈ నిర్ణయాన్ని పరిగణించవచ్చని నివేదిక సూచించింది. ద్రవ్యోల్బణ ఒత్తిడి తగ్గింపు గత కొన్ని నెలలుగా ద్రవ్యోల్బణం స్థాయి తగ్గుముఖం పట్టాయని నివేదిక పేర్కొంది. టమోటాలు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు వంటి ముఖ్యమైన కూరగాయల ధరలు తగ్గడం వల్ల కన్స్యూమర్ ప్రైస్ ఇండెక్స్ స్థిరపడింది.దింతో మెరుగైన సప్లయ్ కారణంగా ధరల అస్థిరత తగ్గింపుకు దారితీసింది, ఇది వడ్డీ రేట్లను తగ్గించడానికి అవకాశాన్ని అందిస్తుంది. అయితే, ఈ ప్రక్రియ దశలవారీగా జరుగుతుంది అలాగే ఆర్థిక డేటాపై ఆధారపడి ఉంటుంది. ప్రపంచ %డ% దేశీయ అంశాల ప్రభావం ద్రవ్య విధానంపై నిర్ణయాలు తీసుకునేటప్పుడు ఆర్‌బిఐ అనేక ప్రపంచ, దేశీయ సవాళ్లను దృష్టిలో ఉంచుకోవాలి. నివేదిక ప్రకారం, ఇటీవలి కాలంలో ఆర్థిక మార్కెట్లలో అస్థిరత పెరిగింది, ఇది భారత రూపాయిని ప్రభావితం చేసింది. అమెరికా, కెనడా, మెక్సికో సహా చైనా వంటి దేశాలు విధించే సుంకాల పెంపుదల, వాణిజ్య విధానాల కారణంగా ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితి కొనసాగుతోంది. అమెరికా డాలర్ బలపడటం భారత కరెన్సీపై ఒత్తిడి పెంచింది. స్టార్ట్ షాపింగ్..” దేశీయ బ్యాంకింగ్ అండ్ ఆర్థిక పరిస్థితులు దేశీయ ద్రవ్యత పరిస్థితులు కూడా సవాలుగా ఉన్నాయి. బ్యాంకులు డిపాజిట్ వృద్ధి మందగమనం ఎదుర్కొంటున్నాయి, ఇది క్రెడిట్ ప్రవాహాన్ని ప్రభావితం చేసింది. ఈ ఆర్థిక సంవత్సరం మూడవ త్రైమాసికంలో కార్పొరేట్ ఫలితాలు మార్కెట్లో డిమాండ్ స్థిరంగా లేవని చూపిస్తున్నాయి, దీనితో పాటు తయారీ రంగం గ్రాస్ వాల్యూ యాడెడ్ లో కూడా మందగమనం కనిపిస్తుంది. ఆర్‌బిఐ వ్యూహం ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ఆర్‌బిఐ బ్యాలెన్స్ విధానాన్ని అవలంబించి రేపో రేట్లను 25 బేసిస్ పాయింట్లు తగ్గించవచ్చని నివేదిక సూచిస్తుంది. ఆర్థిక స్థిరత్వాన్ని కొనసాగిస్తూ ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడం దీని లక్ష్యం.భవిష్యత్తులో రిజర్వ్ బ్యాంకు మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా తగిన పాలసీ నిర్ణయాలు తీసుకునేలా జాగ్రత్తగా ఇంకా డేటా ఆధారిత విధానాన్ని అవలంబిస్తుంది.

## అమ్మకాల ఒత్తిడి స్టాక్ మార్కెట్ మళ్లీ ధమాల్..

### కుప్పకూలిన స్మాల్ క్యాప్, మిడ్‌క్యాప్ కంపెనీల స్టాక్స్..

నేడు అమ్మకాల ఒత్తిడి కారణంగా స్టాక్ మార్కెట్ మరోసారి క్షీణతతో ముగిసింది. ట్రేడింగ్ సమయంలో స్మాల్ క్యాప్ అండ్ మిడ్ క్యాప్ కంపెనీల షేర్లు కుప్పకూలాయి. బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ ఇండెక్స్ సెన్సెక్స్ ట్రేడింగ్ ముగిసే సమయానికి 213.12 పాయింట్లు లేదా 0.27% తగ్గి 78,058.16 వద్ద ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ నిఫ్టీ కూడా 69.60 పాయింట్లు లేదా 0.29% తగ్గి 23,626.70 పాయింట్లకు చేరుకుంది. పడిపోయిన భారతీ ఎయిర్‌టెల్, ట్రెంట్ షేర్లు స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ ముగిసే సమయానికి 30 షేర్ల సెన్సెక్స్‌లో 20 షేర్లు క్షీణతతో అలాగే 10 షేర్లు పెరుగుదలతో ముగిశాయి. ఇందులో భారతీ ఎయిర్‌టెల్ షేరు అత్యధికంగా 2.47% తగ్గి ఒక్కో షేరు ధర రూ.1619.55కి చేరుకుంది. అయితే, అదానీ పోర్ట్స్ షేర్లు 1.72% పెరిగి ఒక్కో షేరు ధర రూ.1163.95 వద్ద ముగిశాయి. అదే సమయంలో %చీాజు% నిఫ్టీలోని 50 షేర్ల ఆధారంగా 31 షేర్లు రెడ్ మార్కులో 20 షేర్లు గ్రీన్ మార్కులో ముగిశాయి. ఇందులో టాటా గ్రూప్ కంపెనీ ట్రెంట్ స్టాక్ అత్యధికంగా 8.36% తగ్గి ఒక్కో షేరుకు రూ.5269కి చేరుకోగా, ఫార్మాస్యూటికల్ కంపెనీ సిప్లా స్టాక్ 2.51% లాభంతో రూ.1472.80 వద్ద ముగిసింది. “బెంగళూరులో వణికిపోతున్న తెలుగు టెక్కీలు..! కొత్త రచ్చతో నిద్ర పట్టట్లే.. “ ఇతర ఆసియా మార్కెట్లు ఆసియాలోని ఇతర ప్రధాన మార్కెట్ల గురించి మాట్లాడుకుంటే, జపాన్‌కు చెందిన నిక్కీ 225, హాంకాంగ్‌కు చెందిన హాంగ్ సెంగ్, దక్షిణ కొరియాకు చెందిన కోస్పి, చైనాకు చెందిన షాంఘై కాంపోజిట్ లాభాలతో ముగిశాయి.

# ఆంధ్రప్రదేశ్

## ఒంటిమిట్టలో హరిద్ర ఘటనం

### పసుపు దంచే కార్యక్రమం ప్రారంభం

కడప,మార్చి 25 : కడప జిల్లా ఒంటిమిట్టలోని ప్రసిద్ధ ప్రాచీన ఆలయం శ్రీ కోదండరామస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం పవిత్రమైన హరిద్ర ఘటనం కార్యక్రమంతో ప్రారంభమయ్యాయి. పసుపు దంచే కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 1న శ్రీ సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించాలని తితిదే అధికారులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో రాములోరి కల్యాణానికి మంగళవారం హరిద్రా ఘటనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం బ్రహ్మోత్సవాలు మరియు శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాలకు శ్రీకారం చుట్టే తొలి ఆచారంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు, శ్రీవారి సేవకులు, టీటీడీ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని పసుపు కొమ్ములను దంచే పవిత్ర కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. హరిద్ర ఘటనంలో సిద్ధం చేసిన తాజా పసుపును స్వామివారికి నిర్వహించే స్నపన తిరుమంజనం కార్యక్రమంలో ఉపయోగిస్తారు. అలాగే శ్రీ సీతారాముల కల్యాణోత్సవానికి అవసరమైన తలంబ్రాలు సిద్ధం చేయడానికి కూడా దీనిని వినియోగిస్తారు. ముందుగా పసుపు కొమ్ములు ఇతర పరికరాలను గర్భాలయంలో ప్రతిష్టించి పూజలు నిర్వహించారు. అనంతరం మహాలక్ష్మి ఆరాధన చేశారు. శ్రీ సూక్తం పఠనానంతరం హరిద్ర ఘటనం నిర్వహించారు. పసుపు నూరిన తరువాత సమర్పణ చేసి తాంబూలం అందజేయడంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో ఎ. ప్రశాంతి, డీఈ (ఎలక్ట్రికల్) సరస్వతి, పీఆర్ఓ ఎఫ్ఏసీ కుమారి నీలిమ, సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఆలయ ఇన్స్పెక్టర్ నవీన్, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ధూళిపాళ్ల నరేంద్ర కూతిరి వివాహం

### హాజరై ఆశీర్వదించిన సిఎంలు చంద్రబాబు, రేవంత్ రెడ్డి

గుంటూరు,మార్చి 25 : గుంటూరు జిల్లా పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర చిన్న కుమార్తె వివాహానికి తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. గుంటూరులోని శ్రీకన్వెన్షన్‌లో నాగసాయి వైదీప్తి- కెవిన్ రామ్ వివాహం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి సీఎంలు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వారితో పాటు ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, మంత్రులు నారా లోకేశ్, పయ్యావుల కేశవ్, అనిత, సంధ్యారాణి, సవిత, పలువురు ఎమ్మెల్యేలు హాజరై నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.

## అమ్రాబాద్ గిరిజనులకు పూర్తి అండ

### వారికి ప్రత్యామ్నాయ కాలనీ నిర్మాణం
### ఒక్కో కుటుంబానికి 15లక్షల పరిహారం
### నగదు అందచేసిన డిప్యూటి సిఎం భట్టి

హైదరాబాద్,మార్చి25 : అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో నివసిస్తున్న గిరిజనుల పునరావాసానికి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గిరిజనుల అభీష్టం మేరకే పునరావాసం చేపడుతున్నామని ప్రభుత్వం స్పష్టం చేసింది. మొదటి దశలో నాలుగు గ్రామాలకు చెందిన 417 కుటుంబాలకు పునరావాసం కల్పించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా అసెంబ్లీ కౌన్సిల్ హాల్‌లో 14 గిరిజన కుటుంబాలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి రూ.15 లక్షల చొప్పున పరిహారం అందిస్తున్నారు. ఈ పథకంలో భాగంగా 160 కుటుంబాలకు నగదు పరిహారం ఇవ్వగా, 257 కుటుంబాలకు ఇల్లు, 5 ఎకరాల భూమిని కేటాయిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా బచారం వద్ద ఆధునిక సదుపాయాలతో పునరావాస కాలనీని నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం మొత్తం రూ.62.55 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించింది. పునరావాసం తర్వాత గిరిజన కుటుంబాలకు పక్కా ఇళ్లు, తాగునీరు, విద్యుత్, ఆరోగ్య సేవలు అందుబాటులో ఉంటాయని అధికారులు తెలిపారు. గిరిజన పిల్లలకు ఆధునిక పాఠశాలలు, డిజిటల్ లెర్నింగ్ సదుపాయాలు కూడా కల్పించనున్నారు. దేశంలోనే అత్యధిక పరిహారాల్లో ఒకటిగా భావిస్తున్న రూ.15 లక్షల ప్యాకేజ్ ద్వారా గిరిజనులకు ఆర్థిక భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అదేవిధంగా, ఈ పునరావాసం ద్వారా సుమారు 1501 హెక్టార్ల అటవీ భూమి పునరుద్ధరణకు అవకాశం లభించనుంది. పులులు, ఇతర వన్యప్రాణుల సంరక్షణకు ఇది కీలకంగా మారనుంది. బచారం పునరావాస కాలనీని మోడల్ గ్రామంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

## చంద్రబాబు చీరాల పర్యటన రద్దు

బాపట్ల,మార్చి 25 : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం చీరాల మండలం పర్యటన రద్దు అయిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28 న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాపట్ల జిల్లా, చీరాల మండలంలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొనవలసియున్నది. అమరావతిలో మార్చి 28 న ఎపి ప్రత్యేక అసెంబ్లీ సమావేశం ఉండటంతో చీరాల పర్యటన రద్దు అయిందని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## కవిత పార్టీకి ముహూర్తం ఖరారు

### 27న శ్రీరామనవమి రోజు పార్టీ పేరు ప్రకటన

హైదరాబాద్,మార్చి25 : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కొత్త పార్టీ ఏర్పాటుపై కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈనెల 27న శ్రీరామనవమి రోజు పార్టీకి సంబంధించిన అధికారిక ప్రకటన చేసే అవకాశముందని సమాచారం. శ్రీరామనవమి రోజు ఉదయం 8 గంటలకు కొత్త పార్టీ ఏర్పాటు తేదీని ప్రకటించే అవకాశం ఉందని తెలంగాణ జాగృతి వర్గాలు చెబుతున్నాయి. ఈ సందర్భంగా పార్టీకి సంబంధించిన ముఖ్య అంశాలు వెల్లడించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తన మెట్టినిల్లు నుంచి పార్టీ సింబల్, విధివిధానాలు ప్రకటించే అవకాశం ఉందని జాగృతి వర్గాలు పేర్కొంటున్నాయి. అంతేకాకుండా, కవిత తాను పోటీ చేసే నియోజకవర్గాన్ని కూడా ఇదే సందర్భంలో వెల్లడించవచ్చని చర్చ జరుగుతోంది.

## చంద్రగిరి కోట వద్ద క్షుద్రపూజలు

తిరుపతి,మార్చి25 : చంద్రగిరి కోట వద్ద క్షుద్రపూజల ఆనవాళ్లతో కలకలం రేగింది. సోమవారం అర్ధరాత్రి కోట పడమర ప్రవేశ ద్వారం వద్ద నడిరోడ్డుపై పసుపు, కుంకుమ, నిమ్మకాయలు పెట్టి వింత ఆకృతులతో ముగ్గులు వేసి ఉన్నారు. కోటకు సెక్యూరిటీ సిబ్బంది ఉండగా నడిరోడ్డుపై పూజలు ఎలా చేశారనే అనుమానం స్థానికుల్లో వ్యక్తమవుతోంది. గతంలో కూడా గుప్తనిధుల కోసం అనేకమంది పూజలు చేసి వుండడంతో ఈ విషయాన్ని పురావస్తుశాఖ అధికారుల దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. పోలీసులు కూడా ఆరా తీస్తున్నారు.

# ట్రంప్ మరో కీలక నిర్ణయం

## ఇరాన్ భూభాగానికి సమీపంలో దళాల మొహరింపు

అందబాటులో 2000 మంది ఎలైట్ బలగాలు



వాషింగ్టన్ : ఇరాన్‌తో శాంతి చర్చలు జరుగుతున్నట్లు చెప్పిన ట్రంప్.. మరో కీలక ఆదేశం ఇచ్చారు. ఇరాన్ భూభాగానికి సమీపంలో రెండు వేల మంది పారాట్రూపర్లను మోహరించారు. ఏ క్షణమైన వాళ్లు దాడికి పాల్పడే అవకాశాలు ఉన్నాయి. భూతల దాడులు చేస్తే తిప్పికొడుతామని ఇరాన్ చెబుతున్న నేపథ్యంలో.. పెంటగాన్ అధికారులు కొత్త ఆదేశాలు జారీ చేశారు. అమెరికన్ ఆర్మీలోని 82వ ఎయిర్‌బార్న్ డివిజన్‌కు చెందిన సుమారు 2000 మంది ఎలైట్ బలగాలు అందబాటులో ఉండనున్నాయి. ఇరాన్ భూభాగానికి అతిసమీపంగా ఆ దళాలు మోహరించి ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై అమెరికాకు చెందిన వాషింగ్టన్ పోస్టు, న్యూయార్క్ టైమ్స్ కథనాలు రాశాయి. ఆదేశాలు ఇచ్చిన 18 గంటల లోపే విమానాశ్ర యాలను, ఎంబసీలను సీజ్ చేసే సత్తా ఈ దళానికి ఉంటుంది. వీలైనంత మందిని తరలించగలరు కూడా. ఈ వారం చివరలో మరో 2500 మెరైన్లు కూడా గ్రౌండ్ ఆపరేషన్ కోసం సిద్ధం అవుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఖర్గ్ దీవిలో ఉన్న ప్రధాన ఆయిల్ ఎగుమతి కేంద్రాన్ని సీజ్ చేయాలన్న ఉద్దేశంతో అమెరికా ఉన్నట్లు భావిస్తున్నారు. దీని కోసమే పారాట్రూపర్లు రెడీ అవుతున్నట్లు అంచనా వేస్తున్నారు. ఇరాన్‌కు సమీపంగా వస్తే అమెరికా సైనికులను ఎలా ఎదుర్కోవాలో తమ దళాలకు తెలుసు అని ఇటీవల ఇరాన్ సీనియర్ మిలిటరీ అడ్వైజర్ అలీ అక్బర్ అహ్మదిన్ వార్నింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఎయిర్‌బార్న్ డివిజన్ బేస్ నార్త్ కరోలినాలో ఉన్నది. ఆదేశాలు ఇచ్చిన 18 గంటల్లోనే ఈ ప్రాంతం నుంచి టా÷-గ్గ÷ట్‌కు ఈ దళం వెళ్లగలదు. ఇమ్మిడియేట్ రెస్పాన్స్ ఫోర్స్(ఐఆర్ఎఫ్) అని కూడా ఈ దళాన్ని పిలుస్తారు. 2021లో ఈ దళం ఆఫ్ఘనిస్తాన్ ఆపరేషన్‌లో పాల్గొన్నది. ఆఫ్ఘనిస్తాన్‌లో అమెరికా ప్రభుత్వం తమ ఆపరేషన్స్ నిలిపివేసిన సమయంలో.. హమిద్ ఖర్జాయ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఈ దళం వెళ్లింది. ఎయిర్‌బార్న్ డివిజన్‌లో మొత్తం మూడు కంబాట్ బృందాలు ఉంటాయి. ఒక్కొక్క బృందంలో సుమారు 4 వేల మంది సైనికులు ఉంటారు. ఏవియేషన్ బ్రిగేడ్‌లో అటాక్, ట్రాన్స్‌పోర్ట్, కార్గో హెలికాప్టర్లు ఉంటాయి. ఓ ఆర్టిల్లరీ యూనిట్, లాజిస్టిక్స్ బ్రిగేడ్ కూడా ఉంటాయి. 82వ ఇన్‌ఫాంట్రీ డివిజన్‌ను మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో ఏర్పాటు చేశారు. కానీ యుద్ధం ముగిసిన తర్వాత డిమొబిలైజ్ చేశారు. అయితే మళ్లీ రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఈ సైనిక బృందాన్ని తీసుకొచ్చారు. 1942లో అమెరికన్ ఆర్మీకి చెందిన ఫస్ట్ ఎయిర్‌బార్న్ డివిజన్‌గా రూపాంతరం చెందింది. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత 82వ ఎయిర్‌బార్న్ దళం పలు యుద్ధాల్లో పాల్గొన్నది. వియత్నం, గ్రెనడా, పనామా, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్, పశ్చిమాసియాలో ఐసిస్ ఆపరేషన్స్‌లో ఈ దళం విధులు నిర్వర్తించింది.

## ఇప్పసారాపై సభలో గందరగోళం

### బిజెపి ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి వ్యాఖ్యలపై మంత్రుల ఆగ్రహం

హైదరాబాద్,మార్చి 25 : బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా శాసనసభలో గందరగోళం నెలకొంది. భాజపా ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి వ్యాఖ్యల పట్ల మంత్రులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇప్పపువ్వు సారా అంశంపై శాసనసభలో చర్చ జరిగింది. సారా పథకానికి మాత్రం ఇందిరమ్మ పేరు పెట్టొద్దంటూ భాజపా ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇప్ప సారాకు ఇప్ప టకీలా లేదా.. మరేదైనా పేరు పెట్టుకోవాలని అన్నారు. దీన్ని మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి తప్పుబట్టారు. ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్ చేశారు. రాకేశ్‌రెడ్డి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ తెలిపారు. దివంగత మహిళా ప్రధానిని భాజపా ఎమ్మెల్యే అవమానించారని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. భాజపా నేతలు ఇందిరమ్మ మీద ఇంకా అక్కసు ప్రదర్శిస్తున్నారని మంత్రి సీతక్క మండిపడ్డారు. ఇందిరాను అవమానించడమంటే మహిళా సమాజాన్ని అవమానించినట్లే అని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఇందిరా గాంధీని వాజ్‌పేయీ ఉక్కు మహిళ, దుర్గామాతా అని గతంలో అన్నారని గుర్తుచేశారు. అనంతరం తన వ్యాఖ్యలపై రాకేశ్‌రెడ్డి వివరణ ఇచ్చారు. ఇందిరా గాంధీపై గౌరవంతోనే ఆ పేరు పెట్టవద్దని చెప్పానన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఇప్ప సారా తయారీ కేంద్రం ఉండాలని సూచించానన్నారు. ప్రతి పథకానికి ఇందిరమ్మ పేరు పెట్టడం కాంగ్రెస్ వాళ్లకు అలవాటు. ఇప్పసారా పథకానికి మాత్రం దయచేసి ఆ పేరు పెట్టవద్దని సూచించాను. నేను చేసిన సూచనలో ఎలాంటి తప్పు లేదు. ఇందిరాగాంధీ ఉక్కు మహిళ.. ఆమె అంటే నాకు ఎంతో గౌరవం. ఆమె కాంగ్రెస్ నేత మాత్రమే కాదు.. భారత మాజీ ప్రధాని కూడా అని చెప్పారు.

## రాష్ట్రంలో పెట్రో, గ్యాస్ కొరత లేదు

### అపోహలు, వదంతులు నమ్మవద్ద
### డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క స్పష్టీకరణ

హైదరాబాద్,మార్చి25 : హైదరాబాద్ నగరంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా గ్యాస్, పెట్రోల్, డీజిల్ నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శాసనమండలి సమావేశపు హాలులో రాష్ట్ర పౌర సరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావులతో కలిసి గ్యాస్, పెట్రోల్ సరఫరాలను సమీక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా పెట్రోల్, గ్యాస్ నిల్వలు, పంపిణీలో ఎటువంటి ఇబ్బంది లేదని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. అపోహలు కలిగించే మాధ్యమాల కథనాలతో ఆందోళన చెందవద్దని వినియోగదారులకు సూచించారు. రెగ్యులర్ గా కొనుగోలు చేసే దాని కంటే, ఎక్కువగా కొని నిల్వ చేయవద్దని వాహనదారులకు విజ్ఞప్తి చేశారు. బంకుల వద్దకు వచ్చే చివరి వాహనదాదారునికి కూడా పెట్రోల్, గ్యాస్ దొరుకుతుందనే భరోసా కల్పించాలని అధికారులు, ఏజెన్సీ లను ఆదేశించారు. ప్రజల్లో నమ్మకాన్ని పెంచుటకు రెగ్యులర్ గా ప్రెస్ బ్రీఫింగ్స్ ఇవ్వాలని సూచించారు. బ్లాక్ మార్కెట్ చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులని ఆదేశించారు. పెట్రోల్, గ్యాస్ ఏజెన్సీ లకు ప్రభుత్వం పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందనే వార్తల నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజలకు భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురి కావాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఇంధన కొరత లేదని, అవసరానికి సరిపడా నిల్వలు ఉన్నాయని తెలిపారు. రెండు నెలలకు సరిపడా పెట్రోల్, డీజిల్ స్టాక్ రాష్ట్రంలో ఉందని మంత్రి వెల్లడించారు. ప్రభుత్వం సరఫరా వ్యవస్థను పర్యవేక్షిస్తోందని, అవసరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉందని చెప్పారు. సివిల్ సప్లై శాఖ మొత్తం పరిస్థితిని నిశితంగా గమనిస్తోందని తెలిపారు. ప్రజలు రూమర్స్, ఫేక్ న్యూస్‌ను నమ్మవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు. అవసరానికి మించి ఇంధనాన్ని నిల్వ చేసుకోవడం ప్రమాదకరమని హెచ్చరించారు. ముఖ్యంగా డ్రమ్స్, కంటైనర్లలో పెద్ద ఎత్తున ఇంధనం నిల్వ చేయడం చట్ట విరుద్ధమని, అలాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇక, సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీందర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇంధన డిమాండ్ సుమారు 25 శాతం పెరిగిందని తెలిపారు. ప్రస్తుతం రోజుకు సుమారు 1200 ట్యాంకర్ల ద్వారా సరఫరా జరుగుతోందని చెప్పారు. పెట్రోల్ బంక్‌లు అనవసరంగా మూసివేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అహ్మదాబాద్, సూరత్, నాగపూర్, చెన్నై వంటి నగరాల్లో కూడా ఇలాంటి పరిస్థితులు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అయితే బంక్‌లకు ఎలాంటి క్రెడిట్ సమస్యలు లేవని, సరఫరా వ్యవస్థ సజావుగా కొనసాగుతోందని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, కమిషనర్ కర్ణన్, పోలీసు కమిషనర్లు సజ్జనార్, సుధీర్ బాబు, ఆయిల్ కంపెనీల ఏజెన్సీల ప్రతినిధులు, పౌర సరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఛార్జీల పెంపు లేదు

### విద్యుత్ నియంత్రణ మండలి ప్రకటన

అమరావతి,మార్చి 25 : రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులకు గుడ్‌న్యూస్ చెప్పింది. 2026 - 2027 ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ ఛార్జీలు పెంచకూడదని నిర్ణయించింది. ఈ మేరకు ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి కీలక ప్రకటన చేసింది. 2026 - 2027 ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ ఛార్జీల పెంపు లేదని తెలిపింది. 2026 - 2027 డిస్కమ్‌ల లోడ్ 15,790 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తానని ముందుకు రావడంతో వినియోగదారులకు బిగ్ రిలీఫ్ దక్కింది. 2024 - 2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ట్రూ అప్ ఛార్జీల విధింపు కూడా నిలిపివేసినట్లు ఏపీఈఆర్‌సీ తెలిపింది. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని కోటి 13 లక్షల మంది గృహ వినియోగదారులకు టారిఫ్ పెంపు నుంచి మినహాయింపు దక్కనుంది. ప్రభుత్వం వాణిజ్య వినియోగదారులకు ఊరట నిచ్చేలా యూనిట్ ధరను 12.25 రూపాయల నుంచి 9. 95 రూపాయలకు తగ్గించింది. ఈ నిర్ణయం ద్వారా 2 లక్షల మంది వాణిజ్య వినియోగదారులకు లబ్ది చేకూరనుంది. అంతేకాదు.. కుటీర పరిశ్రమలకు లోడ్ పరిమితిని 10 హెచ్‌పీ నుంచి 20 హెచ్‌పీకి పెంచింది. రాష్ట్రంలోని 18 వేల మంది కుటీర పరిశ్రమల వినియోగదారులకు లబ్ది చేకూరనుంది.

## కర్నూలులో ఘోర రోడ్డు ప్రమాదం

### ప్రమాదంలో ఒకరు..సహాయక చర్యల వద్ద ఇద్దరు మృతి

కర్నూలు,మార్చి25 : కర్నూలులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు మృతి చెందారు. తొలుత ఘటన జరిగిన ప్రదేశంలో ఒకరు మృతి చెందగా.. అక్కడ సహాయక చర్యలు కొనసాగుతుండగా జరిగిన మరో ప్రమాదంలో ఇద్దరు చనిపోయారు. నగరంలోని కృష్ణానగర్ వద్ద జాతీయ రహదారి వంతెనపై మంగళవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. తొలుత బైక్‌ను లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న కుమ్మరి శేఖర్ మృతి చెందారు. ఈ క్రమంలో అక్కడ సహాయక చర్యలు కొనసాగిస్తున్న వారిని మరో లారీ ఢీకొట్టింది. దీంతో శరీన్‌నగర్‌కు చెందిన బండారి కన్నాతో పాటు మరో యువకుడు మృతి చెందారు.

## 28న ఎపి అసెంబ్లీ ప్రత్యేక సమావేశం

### అమరావతి రాజధానిపై తీర్మనం చేయనున్న అసెంబ్లీ

అమరావతి,మార్చి25 : ఈ నెల 28వ తేదీన ఏపీ అసెంబ్లీ ప్రత్యేకంగా సమావేశం కానుంది. ఈ మేరకు సమావేశం నిర్వహిస్తున్నట్లు నోటిఫికేషన్ విడుదల అయింది. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ బుధవారం సాయంత్రం నోటిఫికేషన్ విడుదల చేశారు. 28వ తేదీ ఉదయం 11 గంటలకు అసెంబ్లీ సమావేశం ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా అమరావతిని ఏపీ రాజధానిగా ప్రకటిస్తూ అసెంబ్లీ తీర్మానం చేయనుంది. అసెంబ్లీ ఆమోదించిన ఈ తీర్మానాన్ని కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నారు. విభజన చట్టం ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాజధాని ఏదన్నది పార్లమెంట్ రికార్డుల్లో స్పష్టంగా ఉండేలా కేంద్రం ద్వారా తదుపరి చర్యలు తీసుకోనున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణాలకు కేంద్రం నుంచి రూ.15 వేలకోట్లు, హడ్కో ద్వారా మరో రూ.11 వేలకోట్లు సమకూరుస్తున్నామని మంత్రి నారాయణ వెల్లడించారు. అమరావతితో అసెంబ్లీ, హైకోర్టు, ఐదు టవర్ల ఐకానిక్ భవనాలను నిర్మిస్తున్నామన్నారు. అసెంబ్లీ 250 మీటర్ల ఎత్తులో ఉంటుందని, ప్రజలు పైకి వెళ్లి నగరం మొత్తాన్ని చూడవచ్చని తెలిపారు.

## పాక్ లాగా భారత్ దళారీ దేశం కాదు

### అఖిలపక్షంలో విదేవాంగ మంత్రి జైశంకర్

న్యూఢిల్లీ,మార్చి25 : పాకిస్థాన్‌ను 'దళారీ' దేశంగా కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ అభివర్ణించారు. పాకిస్థాన్‌లాగా భారతదేశం ఎప్పుడూ మధ్యవర్తిత్వం నెరపే దేశం, దళారీ దేశం కాదని అన్నారు. పశ్చిమాసియాలో నెలకొన్ని ఉద్రిక్తతలపై కేంద్రం నిర్వహించిన అఖిల పక్ష సమావేశంలో జైశంకర్ ఈ వ్యాఖ్యలు చేసినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. పశ్చిమాసియాలో యుద్ధానికి ముగింపు పలికేలా వాషింగ్టన్-టెహ్రాన్‌తో మధ్యవర్తిత్వం వహించేందుకు పాక్ ముందుకు రావడంపై అఖిలపక్ష సమావేశంలో ప్రస్తావనకు వచ్చినట్టు చెబుతున్నారు. దీనిపై జైశంకర్ స్పందిస్తూ, పాకిస్థాన్ దళారీ దేశమని అన్నారు. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయాల్లో భారత్ దళారీ దేశంగా వ్యవహరించదని చెప్పారు. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం నాలుగో వారానికి చేరుకోవడంతో మధ్యవర్తిత్వం వహించడానికి పాక్ ఉత్సాహం కనబరుస్తోంది. చర్చలకు ఆతిథ్యం ఇచ్చేందుకు తాము సిద్ధమని పాక్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో భారత్ ఎందుకు మౌనంగా ఉందని విపక్షాలు ప్రశ్నించినప్పుడు, భారత్‌కు ప్రత్యేక గౌరవం ఉందని, ఎన్నడూ దళారీ దేశంగా వ్యవహరించదని జైశంకర్ వ్యాఖ్యానించారు.

## ఆశావర్కర్ల జీతాలపై హామీ మరిచారా?

### అసెంబ్లీలో ప్రశ్నించిన హరీష్ రావు

హైదరాబాదం,మార్చి 25 : ఎన్నికల సందర్భంగా ఓట్లు దండుకోవడం కోసం అలవిమాలిన హామీలు ఇచ్చి ఇప్పుడు మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం పై బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీష్‌రావు మండిపడ్డారు. అసెంబ్లీ వేదికగా సర్కారుపై నిప్పులు చెరిగారు. ఆశావర్కర్లకు రూ.18 వేల వేతనం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ నాడు తన ఎన్నికల మానిఫెస్టోలో పేర్కొన్నదని ఆయన గుర్తుచేశారు. అయితే కాంగ్రెస్ తన మానిఫెస్టోలో పేర్కొన్న మేరకు ఆశా వర్కర్లకు రూ.18 వేల కనీస వేతనం ఎప్పటి నుంచి ఇస్తుందని ప్రశ్నించారు. గత వారం రోజులుగా ఆశా వర్కర్లు ధర్నా చేస్తున్నారని, ఇచ్చిన మాట ప్రకారం వారికి రూ.18 వేల కనీస వేతనం ఎప్పటి నుంచి అమలు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు.



# సినిమా వదిలేస్తానని ఏడ్చేశా : నటి ఇలియానా

'దేవదాసు' అనే సినిమాతో తెలుగు తెరకు పరిచయం అయిన ఇలియానా బ్యూటీ- తన అందంతో , నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. దాంతో ఈ మూవీ తర్వాత నుంచి ఈమెకు అదిరిపోయే రేంజ్ క్రేజీ సినిమాల్లో అవకాశాలు వచ్చాయి. కానీ ఇండస్ట్రీలో హీరోయిన్ ల కెరీర్ గురించి తెలియంది కాదు.. అవకాశాలు వచ్చినట్లే వచ్చి ఆగిపోతాయి. ఇలియాన విషయంలో కూడా ఇదే జరిగింది. దీంతో ఈ అమ్మడు బాలీవుడ్ లోకి ఎంట్రీ- ఇచ్చి అక్కడ కూడా మంచి క్రేజ్ సంపాదించుకుంది. ప్రజంట్ ఇండస్ట్రీక్రి దూరంగా ఉండి.. తల్లి మాతృత్వాన్ని ఆస్వాదిస్తోంది. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఇలియానా సినీ ప్రయాణంలో ఒక కీలక మలుపు గురించి పంచుకుంది.. సినీ రంగం బాహ్యంగా గ్లామరస్‌గా కనిపించినా, వాస్తవానికి చాలా ఒత్తిడులు, భావోద్వేగాలతో కూడి ఉంటుంది. ముఖ్యంగా 'దేవదాసు' సినిమా -టైమ్‌లో ఎదుర్కొన్న కష్టం ఎప్పటకి మర్చిపోలేను. ఫస్ట్ సినిమా కావడం వల్ల, సెట్స్‌లో కొత్త వాతావరణం, భాష, వర్క్ కల్చర్ వల్ల ఒత్తిడి ఎక్కువయ్యింది. దీంతో మా అమ్మకి ఫోన్ చేసి 'సినిమా వదిలేస్తానని' ఏడ్చిన.. ఆ సమయంలో తల్లి ధైర్యం చెప్పడం వల్లే ఆమె ఆ సినిమాను పూర్తి చేయగలిగాను. ఈ సంఘటన నా జీవితాన్ని మార్చేసింది. అదే సినిమా నన్ను స్టార్ గా నిలిపింది.ఒత్తిడిలోనూ ధైర్యంగా ముందుకెళ్లడం ఎంత అవసరమో,మన కుటు-ంబ సభ్యుల మద్దతు కూడా అంతే ముఖ్యం' అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ అమ్మడు మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.







# సర్కే చునార్ తేరీ సర్కేలో అశ్లీలం తెలియదు

## దర్శకుడు ప్రేమ్ స్పందన

ప్రేమ్ దర్శకత్వంలో రాబోతున్న 'కేడీ: ది డెవిల్' సినిమాలోని 'సర్కే చునార్ తేరీ సర్కే' పాట వివాదాస్పదమైన విషయం తెలిసిందే.అన్ని వేదికల్లోనూ ఈ పాటను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) అధికారులను ఆదేశించింది. తాజాగా ఈ పాట వివాదంపై దర్శకుడు ప్రేమ్ స్పందించారు. తనకు కూడా ఆ హిందీ పాట లిరిక్స్ అర్థం తెలియదని అన్నారు.'ఈ పాట ఐదు భాషల్లో విడుదలైంది. కన్నడలో లిరిక్స్ నేను రాశా. హిందీపై నాకు పట్టులేదు. అందుకే వాటి అర్థం తెలియదు. ప్రస్తుతం దేశంలో ఎన్నో సమస్యలు ఉన్నాయి. ఒకవైపు యుద్ధం, మరోవైపు గ్యాస్ కొరత.. ఇలాంటి వాటి గురించి చర్చించుకుందాం. అంతేగానీ, ఈ పాట లిరిక్స్‌ను వివాదం చేయాల్సిన అవసరం లేదు' అని అన్నారు. ఇక ఉద్దేశపూర్వకంగానే దీన్ని వివాదం చేస్తున్నారంటూ వస్తోన్న వార్తలను ప్రేమ్ ఖండించారు. తాను వివాదాలకు దూరంగా ఉంటానన్నారు. ఇది ఎమోషనల్ మూవీ అని.. ఇందులో ఆ పాట కేవలం పార్టీలో భాగంగా సరదాగా ఉంటుందని చెప్పారు. ఇటీవల ఈ అంశంపై ప్రేమ్ భార్య రక్షిత కూడా స్పందించిన విషయం తెలిసిందే. గతంలో 'పీలింగ్స్', 'డ్రీమమ్ వేకపమ్', 'చోళీ కే పీచే' వంటి వందలాది పాటలు వచ్చినప్పుడు అందరికీ అవి సాధారణంగానే అనిపించాయని.. ఇప్పుడెందుకు ఈ పాట విషయంలో ఇలా చేస్తున్నారని అసహనం వ్యక్తంచేశారు. ధ్రువ్ సర్జా కథానాయకుడిగా నటించిన ఈ మూవీలో నోరా ఫతేహి, సంజయ్‌దత్ కీలక పాత్రలు పోషించారు. ఏప్రిల్ 30న ఈ సినిమా విడుదల కానుంది.




# హైదరాబాద్‌లో వారణాసి నిర్మాణం

## రాజమౌళి మూవీ కోసం భారీ సెట్టింగ్

రాజమౌళి అంటేనే ప్రతి విషయంలోనూ ఎంత అదనపు శ్రద్ధ తీసుకుంటారో తెలిసిందే. ఇక సెట్స్‌పై ఆయన విజన్ మరింత ప్రత్యేకం. తాజాగా వైరలవుతోన్న వారణాసి సెట్ ఇమేజ్‌లు మరోసారి జక్కన్న పనితీరును చాటిచెబుతున్నాయి. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా రానున్న చిత్రం 'వారణాసి'. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీప్రియులు దీనికోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దీంతో దీనికి సంబంధించిన చిన్న అప్‌డేట్ కూడా క్షణాల్లో వైరల్ అవుతోంది. తాజాగా ఈ సినిమా కోసం వేస్తోన్న సెట్ ఇమేజ్‌లు వైరల్‌గా మారాయి. ఈ సినిమా కాశీ నేపథ్యంలో సాగే విషయమని తెలిసిందే. దీంతో కాశీ నగరాన్ని తలపించేలా సెట్‌ను నిర్మిస్తున్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని పురాతన నగరం వారణాసిని అచ్చుగుద్దినట్లు చూపించేలా దాదాపు 700 మీ 400 అడుగుల విస్తీర్ణంలో ఈ భారీ సెట్‌ను నిర్మించారు. వారణాసిలోని ప్రతి వీధి, ప్రతి కట్టడాన్ని తలపించేలా దీన్ని రూపొందిస్తున్నారు. వేల సంఖ్యలో రిఫరెన్స్ చిత్రాలను, కచ్చితమైన కొలతలను వాడినట్లు చిత్ర బృందం పేర్కొంది. ఇక ఈ సెట్‌లో రత్నేశ్వర్ మహాదేవ్ ఆలయం ప్రత్యేక ఆకర్షణగా నిలవనుందట. దీని గోపురం వంపు తిరిగి ఉంటుందని ఈ సెట్‌లో ఆ ఆలయాన్ని కూడా అదే కోణంలో, అదే ఎత్తులో రూపొందిస్తున్నట్లు సమాచారం. నిర్మాణ సమయంలో ఏ చిన్న అలంకరణను, శిల్పకళలను మిస్ కాకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమా కథ త్రేతాయుగం నుంచి 2027 వరకూ సాగనున్నట్లు తెలుస్తోంది. దీనికి అనుగుణంగా వారణాసి నగరం కాలక్రమేణా ఎలా మారిందో చూపించడానికి సెట్‌లో ప్రత్యేక మార్పులు చేస్తున్నారు. అప్పటి కట్టడాల నంచి నేటి ఆధునిక కాలం వరకు ప్రతీది ప్రత్యేక శ్రద్ధతో నిర్మిస్తున్నట్లు తాజాగా టీమ్ పంచుకున్న ఫొటోలు చూస్తే అర్థమవుతుంది. వారణాసిలోని గంగా నది తీరం, అక్కడి పురాతన కట్టడాలను తలపించేలా హైదరాబాద్‌లో ఒక భారీ సెట్‌ను రాజమౌళి నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. రాజమౌళి తన సినిమాల్లో లొకేషన్లకు ఇచ్చే ప్రాధాన్యత గురించి అందరికీ తెలిసిందే. ఈ సినిమాలో ఒక కీలకమైన సన్నివేశం వారణాసి నేపథ్యంలో సాగుతుందని, అందుకే ఈ భారీ సెట్ పనులు జరుగుతున్నాయని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. మహేష్ బాబు ఈ సినిమాలో ఒక సాహసికుడిగా కనిపించబోతున్నారు. గ్లోబ్ ట్రాటింగ్ నేపథ్యంలో సాగే ఈ కథలో భారతీయ సంస్కృతిని ప్రతిబింబించేలా వారణాసి వంటి పుణ్యక్షేత్రాలను కూడా జోడించడం రాజమౌళి మార్క్ అని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చిత్రాలలోని గ్రాండియర్ చూస్తుంటే, రాజమౌళి మరోసారి ఇండియన్ సినిమా స్థాయిని ప్రపంచ దేశాలకు చాటిచెప్పేలా ప్లాన్ చేస్తున్నట్లు అర్థమవుతోంది. ప్రస్తుతం మహేష్ బాబు తన మేకోవర్ కోసం కఠినమైన శిక్షణ తీసుకుంటున్నారు. పొడవాటి జుట్టు, గడ్డంతో ఆయన కనిపిస్తున్న లుక్స్ ఇప్పటికే వైరల్ అయ్యాయి. ఐమ్యాక్స్ వెర్షన్‌లోనూ రూపొందుతున్న ఈ సినిమా 2027 వేసవిలో విడుదల కానుంది. ఈ చిత్రాన్ని 120 దేశాల్లో రిలీజ్ చేయాలని రాజమౌళి చేస్తున్నారు.




# దురంధర్ -2 కలెక్షన్ల సునామీ

బాలీవుడ్ స్టార్ రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో, ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్: ది రివెంజ్' బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేస్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే ఈ సినిమా కలెక్షన్ల సునామీ సృష్టిస్తూ, రికార్డులను తిరగరాస్తోంది. ట్రేడ్ వర్గాల లెక్కల ప్రకారం, కేవలం ఆరు రోజుల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 919 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించడం విశేషం. ఇందులో ఇండియాలోనే రూ. 695 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లు నమోదు చేయడం సినిమా దూకుడుకు నిదర్శనం. వీక్‌డేస్‌లో కూడా కలెక్షన్లు ఏ మాత్రం తగ్గడం లేదు. ఐదో రోజు రూ. 65 కోట్లు, ఆరవ రోజు రూ. 56 కోట్లకు పైగా నెట్ కలెక్షన్లు రాబట్టింది. ఇక ఓవర్సీస్ మార్కెట్‌లో కూడా 'ధురంధర్ 2' దూసుకుపోతోంది. ఇప్పటికే రూ. 200 కోట్ల మార్క్‌ను దాటేసి, గ్లోబల్ స్థాయిలో భారీ వసూళ్లను అందుకుంటోంది. ఈ వేగాన్ని చూస్తుంటే, కేవలం వారం రోజుల్లోనే రూ. 1000 కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయం అని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అదే జరిగితే అత్యధిక వేగంగా వారం రోజుల్లోనే వెయ్యి కోట్లు రాబట్టిన చిత్రంగా సరికొత్త రికార్డ్ క్రియేట్ చేయనుంది ధురంధర్ 2. సుమారు నాలుగు గంటల భారీ రన్‌టైమ్ ఉన్నప్పటికీ, ప్రేక్షకులు ఈ సినిమాను ఆదరించడం విశేషం. మొదటి భాగం సుమారు రూ. 1400 కోట్ల వసూళ్లు సాధించిన నేపథ్యంలో, 'ధురంధర్ 2' రూ. 2000 కోట్ల మార్క్‌ను అందుకునే అవకాశముందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. బాలీవుడ్‌లో హిట్ సినిమాలకు లాంగ్ రన్ ఉండటం ఈ అంచనాలకు బలం ఇస్తోంది. ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్ తన పవర్‌ఫుల్ యాక్షన్‌తో ప్రేక్షకులను ఆకట్టుకోగా, అర్జున్ రాంపాల్, సంజయ్ దత్, ఆర్. మాధవన్ వంటి స్టార్ నటులు కీలక పాత్రల్లో మెప్పించారు. మొత్తానికి 'ధురంధర్ 2' భారతీయ సినీ చరిత్రలో కొత్త రికార్డులను సృష్టించే దిశగా దూసుకెళ్తోంది.




# పెద్ది షూటింగ్‌లో రామ్‌చరణ్‌కు స్వల్ప గాయం

## భయమేమీ లేదని వెల్లడించిన చిత్రబృదందం

## త్వరగా కోరుకోవాలని పవన్ ఆకాంక్ష

మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం బుచ్చిబాబు సానా దర్శకత్వంలో 'పెద్ది' చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఏప్రిల్ 30న ఈ చిత్రం విడుదల కానుండగా.. వీలైనంత త్వరగా షూటింగ్ ఫినిష్ చేసేలా దూసుకుపోతోంది చిత్ర యూనిట్. ప్రజెంట్ హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతోంది. అయితే, ఈ చిత్రానికి సంబంధించిన ఒక కీలకమైన యాక్షన్ సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న సమయంలో రామ్ చరణ్‌కు గాయం అయినట్టుగా తెలుస్తోంది. ఆయన కంటి సమీపంలో స్వల్ప గాయం అయిందని సమాచారం. ఈ వార్త తెలియగానే అభిమానులు కాస్త ఆందోళన చెందినప్పటికీ, ఇది చాలా చిన్న గాయమని, అభిమానులు భయపడాల్సిన అవసరం లేదని చిత్ర యూనిట్ వర్గాలు తెలిపాయి. అయితే, కంటికి సంబంధించిన గాయం కావడంతో జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచించారు. అలాగే.. రెండు రోజుల పాటు పూర్తి విశ్రాంతి అవసరమని డాక్టర్లు సలహా ఇచ్చారు. దీంతో.. రెండు రోజుల రెస్ట్ తర్వాత తిరిగి రామ్ చరణ్ పెద్ది సెట్స్‌లో జాయిన్ అవనున్నారు. ఈ షెడ్యూల్ అయిపోయిన తర్వాత.. తదుపరి షెడ్యూల్‌లో ఒక స్పెషల్ సాంగ్ చిత్రీకరణలో పాల్గొననున్నారు. ఇక్కడితో షూటింగ్ దాదాపుగా కంప్లీట్ అయినట్టే. మరోవైపు, ఈ శుక్రవారం మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజు కావడంతో మెగా సెలబ్రేషన్స్‌కు సిద్ధమవుతున్నారు అభిమానులు. ఆరోజు పెద్ది టీజర్ లేదా గ్లింప్స్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఇలాంటి సమయంలో చరణ్‌కు గాయం అనే వార్త మెగాభిమానులను కాస్త టెన్షన్‌కు గురి చేసినట్టైంది. తమ అభిమాన హీరో త్వరగా కోలుకోవాలని సోషల్ మీడియా వేదికగా కోరుకుంటున్నారు అభిమానులు. ఈ క్రమంలోనే తాజాగా రామ్ చరణ్ గాయం మీద పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, స్పందించారు. ఈ మేరకు మీడియాకు సమాచారం అందించారు. త్వరగా రామ్ చరణ్ కోలుకోవాలని పవన్ కళ్యాణ్ ఆకాంక్షిస్తున్నట్లుగా పవన్ కళ్యాణ్ టీం ఒక మెసేజ్ షేర్ చేసింది. అయితే ఇప్పటివరకు రామ్ చరణ్ కి గాయాలు అయినట్లుగా 'పెద్ది' టీం కానీ, రామ్ చరణ్ టీం కానీ ప్రకటించలేదు. కానీ పవన్ కళ్యాణ్ స్పందించడంతో, ఈ వార్త కన్ఫామ్ అయినట్లయింది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com